నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 27-8-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:22 పేజీలు: 8 వెల: రూ.1/-

కేసీఆర్ కిట్‌లో చేనేత చీరెలు ఇవ్వాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను కలసి వినతిపత్రం సమర్పించిన అఖిల భారత పద్మశాలీ సంఘం యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు గుండేటి శ్రీధర్, తెలంగాణ పద్మశాలీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అవ్వారి భాస్కర్

చేనేత కార్మికులను ఆదుకోండి

కెసిఆర్ కిట్‌లో చీరలు ఇవ్వండి

మంత్రి ఈటెలకు సంఘం ప్రతినిధుల వినతి

హైదరాబాద్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కేసీఆర్ కిట్‌లో చేనేత చీరెలు ఇవ్వాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను అఖిల భారత పద్మశాలీ సంఘం యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు గుండేటి శ్రీధర్, తెలంగాణ పద్మశాలీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అవ్వారి భాస్కర్ కోరారు. ఈ మేరకు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో పనిలేక కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, చేనేత పరిశ్రమ దిక్కుతోచని స్థితిలో పడిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని దవాఖానలో వాడుతున్న వివిధ వస్త్ర ఉత్పత్తులను (బెడ్ షీట్, పిల్లో కవర్, అప్రాన్స్, మాస్క్‌లు, కర్టెన్) నేరుగా చేనేత సహకార సంఘాల నుంచి, చేనేత కార్మికుల నుంచి కొనుగోలు చేసి జీవన భృతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ దవాఖానలో ప్రసవించిన మహిళలకు ఇస్తున్న కేసీఆర్ కిట్‌లో పాలిస్టర్ చీరెకు బదులుగా ఆరోగ్యానికి మేలు చేసే కాటన్ చేనేత చీరెలు ఇచ్చేలా చూడాలని కోరారు. దీంతో చేనేత కార్మికులకు ఏడాది పొడవునా పని దొరికే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు స్పందించిన మంత్రి ఈటల సాధ్యమైనంత త్వరలోనే విధి విధానాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని వైద్య కార్యదర్శికి లేఖను పంపారు. చేనేత కార్మికులకు తనవంతు సహకారం అందిస్తానని భరోసా కల్పించారు.

మరింత క్షీణించిన ప్రణబ్ ఆరోగ్యం

కిడ్నీ సంబంధ సమస్యలు కూడా చేరాయి: ఆర్మీ ఆస్పత్రి

న్యూఢిల్లీ,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆరోగ్య పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తోంది. ప్రణబ్ ముఖర్జీ ఇంకా కోమాలోనే ఉన్నారని తాజా హెల్త్ బులిటెన్‌ను ఆర్మీ ఆసుపత్రి విడుదల చేసింది. ఆయన ఆరోగ్యం మరింత క్షీణిస్తోందని బులిటెన్ లో ఆర్మీ ఆసుపత్రి పేర్కొంది. ప్రస్తుతం ఉపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌కు చికిత్స అందిస్తున్నామని వెల్లడించింది. ఆయనకు నిన్నటి నుంచి కిడ్నీ సంబంధ సమస్యలు కూడా ఎదురవుతున్నట్లు తాజా బులెటిన్‌లో పేర్కొంది. ప్రస్తుతం కోమాలో ఉన్న ప్రణబ్ ముఖర్జీకి వెంటిలేటర్ సహాయంతోనే చికిత్స అందిస్తున్నామని ఆర్మీ ఆసుప్రతి ప్రకటించింది. కాగా.. ఆగస్టు 10వ తేదీన ప్రణబ్ ముఖర్జీ ఢిల్లీలోని ఆర్మీ ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. శస్త్రచికిత్స జరిగిన తరువాత ఆయనకు కరోనా సోకింది. అప్పటి నుంచి ఆయన ఆరోగ్య స్థితిలో ఎలాంటి మార్పు ఉండడం లేదు. తాజాగా ఆయన తీవ్ర (డీప్)కోమాలోకి వెళ్లిపోయారని, వెంటిలేటర్ మద్దతుతో కృత్రిమ శ్వాస అందజేస్తున్నామని ఆర్మీ రీసెర్చ్ అండ్ రెఫరల్ దవాఖాన బుధవారం తెలిపింది. మెదడుకు శస్త్రచికిత్స జరిగిన తరువాత కరోనా సోకడంతో 16 రోజులుగా ప్రణబ్ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ ఉండడం వల్ల ప్రణబ్‌కు చికిత్స అందజేస్తున్నామని, నిన్నటి నుంచి ఆయన మూత్రపిండాలు కూడా క్షీణిస్తున్నట్లు కనబడుతోందని వైద్యులు తెలిపారు.

యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

రెండు బస్సులు ఢీ .. ఆరుగురు మృతి

లక్నో,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లో దారుణం చోటు చేసుకుంది. రెండు స్టేట్ రోడ్‌వేస్ బస్సులు ఒకదానికితో ఒకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆరుగురు మరణించగా.. 12 మందికిపైగా గాయపడ్డట్లు సమాచారం.

లక్నో నగర శివార్లలోని కకోరి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఉత్తరప్రదేశ్ స్టేట్ రోడ్‌వేస్ బస్సులు ఒకదానితో ఒకటి ఢీకొట్టాయి. ఇంతలో ఒక ట్రక్కు అదుపు తప్పి వాటి సమీపంలోకి వెళ్లడంతో దాని డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి అని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని కింగ్‌జార్జ్ మెడికల్ యూనివర్సిటీకి తరలించారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కకోరి అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఎస్ ఎం ఖాసి అబిది తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'లక్నో నుంచి వస్తున్న బస్సు, ట్రక్కును అధిగమించడానికి ప్రయత్నించింది. ఆ సయమంలో ఎదురుగా వస్తున్న మరో బస్సును ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది' అని తెలిపాడు. ప్రమాదం జరగినప్పుడు అక్కడే ప్రయాణిస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు కూడా గాయపడ్డాడు. రెండు బస్సులు ఒకదానికి ఒకటి ఢీకొట్టడం చూసి తనకు కళ్లు తిరగాయని.. నియంత్రణ కోల్పోవడంతో తనకు కూడా ప్రమాదం జరిగిందని ట్రక్కు డ్రైవర్ తెలిపాడు.

చరిత్రలో నేటినిజం

కం॥ అతిగుణవంతుడు, విబుధుడు
మతిమంతుడు, భాగ్యశాలి, మహిమాన్వితుడున్
చతురుండై చెలగెను భా
రతమాతకు ప్రియసుతుడు దాదాభాయ్ టాటా!!

(ఆగష్టు 27 దాదాభాయ్ టాటా జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

దుబ్బకట్ల మృతికి మంత్రి సంతాపం

హైదరాబాద్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): ఆదివాసీ ఉద్యమ నాయకుడు, తుడుందెబ్బ వ్యవస్థాపకుడు దబ్బకట్ల నర్సింగరావు మృతి పట్ల గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివాసీల గొంతుక వినిపించి, వారి హక్కులను కాపాడడంలో నర్సింగరావు చేసిన కృషి ఎప్పటికీ మరవలేనిదన్నారు. ఆయన సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. నర్సింగరావు మృతి ఆదివాసీలకు తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని మంత్రి ప్రార్థించారు.

ఎడ్మ కిష్టారెడ్డికి మంత్రుల నివాళి

హైదరాబాద్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస యాదవ్ పరామర్శించారు. కల్వకుర్తిలోని కృష్ణారెడ్డి నివాసంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కృష్ణారెడ్డి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రాజధాని రైతులు ధైర్యంగా ఉండాలి

హైకోర్టులో వారే అంతిమ విజేతలు

సుప్రీం తీర్పును స్వాగతించిన ఎంపి రఘురామ

న్యూఢిల్లీ,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): రాజధాని అంశంపై సుప్రీం కోర్టు తీర్పును నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు స్వాగతించారు. ఢిల్లీలోని తన నివాసంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. రైతులు ఆశాభావంతో ఉండాలన్నారు. హైకోర్టులో రైతులే గెలుస్తారని.. ధర్మం, న్యాయం గెలుస్తుందని వ్యాఖ్యానించారు. రైతులు ఇంత బాధపడుతుంటే.. కౌలు కోసం రైతులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే.. సీఆర్డీఏ ఆఫీసుకు వెళ్లిన రైతులను అరెస్ట్ చేసి.. దాడి చేయడం దారుణమన్నారు. వారికి ఇవ్వాల్సినవి ఇవ్వకుండా అడిగితే జైల్లో పెట్టడం ఏంటని ప్రశ్నించారు. అమరావతి రైతులకు కౌలు డబ్బు ఇవ్వడం లేదు. మూడు రాజధానులు కడతారా? మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనా? ఏపీ ప్రజలు ఇదే అంటున్నారని ఘాటుగా వ్యాఖ్యానించారు. బెదిరింపులకు ఎవరూ భయపడొద్దని రఘురామరాజు హితవు పలికారు. పీపీఈ కిట్లు లేవని ఎప్పుడో కామెంట్ చేస్తే డాక్టర్ గంగాధర్ లాంటి ప్రముఖ వైద్యులకు ఇప్పుడు సెక్షన్ 41 కింద నోటీసులు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. నోరు విప్పితే భయపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. వైఎస్‌కు అత్యంత సన్నిహితుడైన వ్యక్తిగా, మృదుభాషిగా డాక్టర్ గంగాధర్‌కు పేరుందని ఆయన అన్నారు. ఓ దళిత యువకుడు మద్యంపై మాట్లాడితే.. ఆ వ్యక్తిని వైసీపీ కార్యకర్తలు చంపుతామని బెదిరించారని వార్తలు వచ్చాయి. దీంతో ఆ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తెలుస్తోంది. ప్రాణాలు తీసుకోవడం బాధాకరం దయచేసి అందరూ ధైర్యంగా ఉండండి. నాకూ బెదిరింపులు వస్తున్నాయి. ఎవరూ చలించకండి. ఎవర్నీ ఎవరూ ఏమీ చేయలేరు. ధైర్యంగా ఎదుర్కొంటే ఏమీ కాదు. నన్ను సోషల్ మీడియాలో ఓ మహిళా మూర్తి రకరకాలుగా మాట్లాడారు. ఆడవాళ్లు మాట్లాడాల్సిన మాటలే కావవి. ఎన్నిరకాలుగా ఏం చేసినా.. ఏం ప్రయోజనం లేదని అంటూ రఘురామ రాజు చిటికేసి చెప్పారు.

అధికారంలో ఉంటే దోచుకోవడమే కాంగ్రెస్‌కు తెలుసు

కులవృత్తులను ఆదుకున్న ఘనత కెసిఆర్‌ది: తలసాని

నల్లగొండ,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ నేతలకు ఏనాడు సంక్షేమం పట్టలేదని, ప్రజల్ని దోచుకొని, దాచుకోవడమే లక్ష్యంగా పని చేశారని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కేసీఆర్ నేతృత్వంలోనే సమస్త వృత్తులకు గుర్తింపు లభించిందన్నారు. అన్ని వృతులకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కూడా తెలంగాణ సర్కార్ దే అన్నారు. మత్స్యకారుల జీవితాల్లో చేప పిల్లల పంపిణీ సమూల మార్పులు తీసుకువస్తుందని చెప్పారు. జిల్లాలోని నాగార్జున సాగర్ నియోజకవర్గంలో పర్యటించిన ఆయన అనుముల మండలం కొత్తపల్లి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే నోముల నర్సింహ్మయ్యతో కలిసి పల్లె ప్రకృతి వనాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. అనంతరం తిరుమలగిరిసాగర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో చేప పిల్లలను వదిలారు. అధికారంలో ఉన్నపుడు ఏనాడు కాంగ్రెస్ నాయకులకు రైతులు గుర్తుకు రాలేదని తలసాని దుయ్యబట్టారు. రైతు బంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరంట్, పుష్కలంగా నీళ్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొడుతూ ఇంటింటికి సురక్షిత నది జలాలను అందుస్తున్నారని తెలిపారు.

పివి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో జాగృతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపి కవిత, ఎంపి కె. కేశవరావు, పివి కుటుంబ సభ్యులు ప్రభాకర్ రావు, వాణీరావు

పివికి భారతరత్న ఇవ్వాల్సిందే

హైదరాబాద్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): తెలంగాణ ముద్దు బిడ్డ పీవీ నరసింహారావుకి దేశ అత్యుత్తమ పురస్కారం భారతరత్న ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత కోరారు. పీవీ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్ లో సమాలోచన సభ నిర్వహించారు. తెలంగాణ తేజం మన పీవీ సాహితీ సౌరభం - అసమాన దార్శనికత పేరుతో, మాజీ ఎంపీ కవిత అధ్యక్షతన సమాలోచన సభ జరిగింది.

పీవీ నరసింహారావు శతజయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు కే.కేశవరావు, పీవీ తనయుడు ప్రభాకర్ రావు, కూతురు వాణిదేవి, రచయిత కల్లూరి భాస్కర్, టీఆర్ఎస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మహేష్ బిగాల హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాజీ ఎంపీ కవిత మాట్లాడుతూ.. దేశం క్లిష్టమైన పరిస్థితుల్లో ఉండగా పీవీ ప్రధాని పదవి చేపట్టారన్నారు. పీవీ సేవలను యువతరానికి తెలియజేసేలా రాష్ట్ర వ్యాప్తంగా శతజయంతి కార్యక్రమాలు నిర్వహించాల్సిందిగా తెలంగాణ జాగృతి నాయకులకు కవిత పిలుపునిచ్చారు.

పీవీ మేధస్సును, సాహిత్యాన్ని యువతరానికి చేరేలా తెలంగాణ జాగృతి, ప్రతినెలా రెండు కార్యక్రమాలు నిర్వహించనుందని మాజీ ఎంపీ ప్రకటించారు.

'పీవీ బుక్ క్లబ్' పేరుతో, ప్రాచీన పుస్తకం, నవీన పుస్తకం పేరుతో ప్రతి నెలా రెండు కార్యక్రమాలు నిర్వహించి, పీవీకి అక్షర నివాళి అందిస్తున్నామన్నారు. పీవీ తన మేధస్సును దేశం కోసం ఉపయోగించారని ఆమె పేర్కొన్నారు. రాజకీయాల్లో ప్రత్యర్థులు సైతం పొగిడేంత, హుందాతనంతో పీవీ వ్యవహరించారని గుర్తు చేసుకున్నారు.

-జాగృతి అధ్యక్షురాలు కవిత

అభివృద్ధి సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

కరోనా సంక్షోభంలోనూ ఆగని అభివృద్ధి

సూర్యాపేటలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

కెసిఆర్ లక్ష్యంతో ప్రజలకు మేలు జరుగుతోందన్న జగదీశ్వర్ రెడ్డి

సూర్యాపేట,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): ఎన్ని అవాంతరాలు ఎదురైనా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆగవని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. కరోనా వంటి క్లిష్ట సమయాల్లో కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతుందన్నారు. సూర్యాపేట పట్టణంలో పర్యటించిన మంత్రి పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కూడా కరోనా విస్తరిస్తున్న క్రమంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మంత్రి సూచించారు. కరోనాకు భయపడకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమాలు రెండు కళ్లు అని, ప్రజలు సంతోషంగా ఉండడమే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష అన్నారు. కాళేశ్వరం గోదావరి నీటితో సూర్యాపేట జిల్లా పచ్చగా మారిందని, గత యాసంగిలో రాష్ట్రంలో అత్యధిక దిగుబడులు సాధించిన జిల్లాగా ఉమ్మడి నల్లగొండ జిల్లా నిలవడం గర్వకారణంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు తిరుగులేని వ్యవసాయం చేసేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని మంత్రి చెప్పారు. సూర్యాపేట జిల్లాలో ఈ వానకాలంలో ఇప్పటి వరకు 3లక్షల12వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా నియంత్రిత సాగు విధానంలో వరిలో సన్నరకాలు అధికంగా సాగు చేసేందుకు ప్రణాళికలు తయారు చేశామన్నారు. అందుకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. సమగ్ర వ్యవసాయ విధానంలో ప్రతి 5వేల ఎకరాలు క్లస్టర్ల వారీగా 82 రైతు వేదికలను రూ.18కోట్ల తో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే రూ 31కోట్లతో 4,500ల కల్లాలకు ప్రణాళికలు రూపొందించి 2,838 కల్లాలు మంజూరై పనులు పురోగతిలో ఉన్నట్లు వివరించారు.రైతుబంధు పథకం ద్వారా ఈ సంవత్సరం రైతులకు 494 కోట్లు మంజూరు చేశామన్నారు. 980 మంది రైతులకు బీమా డబ్బులు అందినట్లు చెప్పారు. యాదవులకు గొర్రెల పెంప కం పథకం కింద ఇప్పటి వరకు 16, 800 మంది లబ్దిదారులకు రూ.186 కోట్ల ఖర్చుతో 3,52,000 గొర్రె పిల్లలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి

అంబులెన్స్ కొనుగోలు కోసం మంత్రి కేటీఆర్‌కు చెక్కు అందజేత

మంచిర్యాల, ఆగష్టు 26 : మంత్రి కేటీఆర్ చేపట్టిన 'గివ్ ఏ స్మైల్' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నది. తన జన్మదినం సందర్భంగా బహుమతులు, బొకేలు తేవొద్దు. పేదల ముఖాల్లో చిరు నవ్వులు పూయించండని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకొచ్చారు. నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నడిపెల్లి విజిత్ కుమార్ తో కలిసి అంబులెన్స్ కొనుగోలు కోసం 20.50 లక్షల రూపాయల చెక్కును మంత్రి కేటీఆర్‌కు హైదరాబాద్ లో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించారు.

వెంకయ్యతో విజయసాయి భేటీ

న్యూఢిల్లీ,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో వైసీపీ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా వ్యవసాయ, మత్స్య, ఫ్లాంటేషన్, కొబ్బరి పీచు, పసుపు ఉత్పత్తుల ఎగుమతులకు సంబంధించి స్థాయి సంఘం ఆమోదించిన 154వ నివేదికను విజయసాయిరెడ్డి ఉపరాష్ట్రపతికి అందజేశారు. విజయసాయిరెడ్డి పార్లమెంట్ స్థాయి సంఘం వాణిజ్యం కమిటీ చైర్మన్‌గా ఉన్న సంగతి తెలిసిందే. వ్యవసాయ ఉత్పత్తుల విదేశీ ఎగుమతుల సామర్థ్యాన్ని పెంచాలన్నారు. టీ ఉత్పత్తులకు బ్రాండ్ ప్రమోషన్ చేపట్టడంతో పాటు పొగాకు ఉత్పత్తులపై బ్యాలెన్స్ పద్ధతి రావాలన్నారు. పొగాకు ఉత్పత్తులను కేవలం ఎగుమతుల వరకే పరిమితం చేయాలి.. ఇలా చేయడం వల్ల రైతులకు, రైతుకూలీలకు నష్టం జరగదని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

ప్రసిద్ధ బాలల రచయిత డా॥ వి.ఆర్.శర్మ కలం నుండి జాలువారిన ఈతరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల 'బాలవర్ధన్'. ఈ వారం నుండి 'నేటినిజం' పాఠకుల కోసం ప్రత్యేకం...

-సంపాదకులు

బాల వికాసం

బాలవర్ధన్

ఈ తరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల

(ప్రసిద్ధ జానపద కథ బాలనాగమ్మ కథ స్ఫూర్తితో ఆధునిక సృజన)

జానపద ప్రపంచంలో బుర్రకథగా ప్రారంభమై, కథగా మారి తరతరాలుగా మనకు అందివస్తున్న అపూర్వ సాహిత్య, సాంస్కృతిక వారసత్వ సంపద బాలనాగమ్మ కథ. ఇది సుమారు ఎనభై ఏళ్ళ కిందటే సినీమాగా వచ్చింది. ఊరూరా నాటకాలుగా ప్రదర్శింప బడింది. ఇప్పుడు ఆరవ తరగతిలో పాఠ్యాంశంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పిల్లల సినీమా 'హరిపోటర్'కూ బాలనాగమ్మ కథకూ ఎన్నో దగ్గరి పోలికలు నాకు కనబడ్డాయి.

మారిన కాలమాన పరిస్థితులలో, ఆనాటి ఆకథ ప్రేరణతో ఈనాటి టీనేజీ పిల్లలకోసం నేను కల్పించి రాసిన బాలవర్ధన్ కథ ఇది. అది తల్లి తరం కథ అయితే ఇది నేటి కొడుకు తరం కథ. ఈ కథను నేను మార్చిలో మొదలు పెట్టి, మేలో పూర్తి చేశాను. అందుకే ఈనాటి పరిస్థితులు దీనిలో కనిపిస్తాయి. ఈనాటి పిల్లలకూ, తరువాత పెద్దలకూ నచ్చేలా ఉండడానికీ, సహజత్వానికి దగ్గరగా అనిపించేలా రాయడానికీ ప్రయత్నం చేశాను. ఇది బాగుందనిపిస్తే ఆ గొప్పదనమంతా నా ఈరచనకు ప్రేరణనిచ్చిన మన బాలనాగమ్మ కథది. బాలనాగమ్మ కథను సృష్టించిన ఆ అజ్ఞాత జానపద రచయితలకూ, తరతరాలుగా నిలబెట్టిన జానపద కళాకారులకూ దీన్ని అంకితం చేస్తున్నాను. నా ఈ ప్రయత్నం మీద మీ అమూల్యమైన అభిప్రాయాలను కోరుతున్నాను.

-వి.ఆర్.శర్మ



ఈ ప్రపంచం లాక్‌డౌన్ అంటూ తనకు తాను తాళం వేసుకోవడానికి కొంత కాలం ముందు...

ఒకరోజు ఉదయం ...

"అరే వర్ధన్ కాచుకో, ఈ బాల్‌తో నువ్వు అవుట్" అని అరుస్తూ బాల్‌ను పైకి ఎగరేసి పట్టుకుని పైకెత్తి చూపించాడు రోహిత్. అక్కడ ఉన్న పిల్లలందరూ "ఓ..." అంటూ గట్టిగా అరిచారు. వాళ్ళంతా

పన్నెండు నుంచి పదహారేళ్ళ వయస్సులో ఉన్న పిల్లలు. బాలవర్ధన్ స్నేహితులు.

అది మూడు వైపుల నుంచి వస్తున్న తోవలు కలుసుకుంటున్న చోటు. అక్కడ కొంతమంది పిల్లలు చేరి క్రికెట్ ఆడుకుంటున్నారు. ఆ రోజు ఆదివారం కావడం వల్ల ఆ పిల్లలంతా పొద్దునే అక్కడికి ఆటకు చేరుకున్నారు.

ఎప్పుడో వేసిన ఆ రోడ్ల మీద డాంబర్ చాలా వరకు ఎగిరిపోయింది. గుంతలతో, మట్టితో,తేలిన సన్నటి కంకరతో కనబడుతోంది. మధ్యలో కొంత బాగున్న చోట చేరి వాళ్ళు ఆడుకుంటున్నారు .

బాల్ గిరగిరా తిప్పుతూ వేగంగా విసరడానికి పరుగెత్తుకొస్తున్నాడు రోహిత్ . బ్యాట్ పట్టుకొని వేటకోసం చూస్తున్న చిరుత పులిలా బాలవర్ధన్ సిద్ధంగా నిలబడ్డాడు. పిల్లల్లో కొందరు "రోహిత్...రోహిత్" అని, కొందరు"బాల...బాల..." అని,చేతులు ఊపుతూ అరుస్తున్నారు.

ఎంతో వేగంగా గిర్రున తిరుగుతూ ఎగిరి వచ్చిన ఆ బాల్ బాలవర్ధన్ కొట్టిన షాట్ తగిలి 'ఠాప్' మని శబ్దం చేస్తూ, రెట్టించిన వేగంతో ఓ మిసైల్‌లా ఎడమ వైపు దూసుకు పోయింది.

సరిగ్గా అదే సమయంలో ఆ వీధిలోకి వచ్చిందో స్కూటి. దానిమీద కాళ్ళ దగ్గర ఓ వాటర్ క్యాన్ పెట్టుకొని తీసుకొని పోతోంది ఓ ఆడమనిషి . సుమారు ఓ యాభై ఏళ్ళుండొచ్చు ఆమెకు. కానీ వ్యవసాయ కుటుంబానికి చెందిన మనిషి కనుక బలంగా, ఆరోగ్యంగా కనబడుతోంది. క్రికెట్ బాల్ వేగంగా వెళ్ళి

ఆ స్కూటి ముందు భాగంలో దధేలున తగిలింది. అదుపు తప్పి ఆ వాహనంతో పాటు ఆ ఆడమనిషి కూడా రోడ్డు మీద పడిపోయింది.

పిల్లలందరూ భయంతో కొయ్యబారి పోయారు. "అబ్బా... అమ్మా..." అని మూలుగుతూ, అరుస్తూ ఆమె లేచి కూర్చుంది. కుడి మోచేతికి బాగా గీరుకుపోయి కొంచెం రక్తం కారింది. ఇంకా ఎక్కడ దెబ్బలు తగిలాయోనని చూసుకుంటూ, అరవసాగింది. ఆ పిల్లల్ని తిట్టడం మొదలుపెట్టింది.

కొందరు పిల్లలు అక్కడ్నుంచి పారిపోయారు. బాలవర్ధన్ అతని తమ్ముడు ఆర్యవర్ధన్ కూడా బాగా కంగారుపడ్డారు. కొంత సేపటికి గబగబా ఆమె దగ్గరికి వెళ్ళి, ఆమె లేవడానికి సహాయం చేయబోయారు.

ఆమె లేచి నిలబడుతూ వాళ్ళను బూతులు తిట్టడం ప్రారంభించింది.

"సారీ ఆంటీ! చూసుకోలేదు. తప్పయింది" ఆమెకు క్షమాపణ చెప్పుకుంటూ, ఆమె గాయాలను గమనించాడు బాలవర్ధన్. కాయకష్టంతో గట్టిపడ్డ శరీరం కనుక ఆమె వెంటనే లేచి నిలబడింది. పెద్దగా దెబ్బలు ఏమీ తాకినట్టులేదు. కానీ తాను లేచి నిలబడ్డానికి సహాయం చేసిన బాలవర్ధన్‌ను అలాగే పట్టుకొని పెద్దగొంతుతో "మదం బట్టినావురా గాడిది. కండ్లు కనవడ్తలేవా !" అంటూ తిట్టడం కొనసాగించింది.

"సారీ అమ్మా! చూసుకోలేదు" అంటూ బాలవర్ధన్ ఆమెను సముదాయించబోయాడు.

"సారీ ఏందిరా... సారీ... పానం దింటుంటివి ఇయ్యాల.. పుట్టంగనే అవ్వనూ, అయ్యనూ మింగి కూసున్నోనివి. ఇయ్యాల నా పోరలను గూడా గట్లనే జేద్దామనుకున్నవేమో!... దిక్కుమాలిన పోరడా..."

ఆ తరువాత ఆమె అంటున్న మాటలు ఏవీ బాలవర్ధన్ చెవికెక్కలేదు. "ఏమంటుందీమె! తాను పుట్టగానే అమ్మా, నాన్నా చచ్చిపోయారా? అందుకు చేయివేసి బాధపడుతూ అన్నాడు . ఆ మాటలతో బాలవర్ధన్ మెల్లగా ఈ లోకంలోకి వచ్చాడు. వెర్రివాడిలా రోహిత్ వైపు చూసి, ఏమీ మాట్లాడకుండా తల ఊపి, తమ ఇంటి వైపు కదిలాడు. తమ్ముడు ఆర్యవర్ధన్ అతణ్ణి అనుసరించాడు. 'బైరా...' అంటూ రోహిత్ మరో వైపు వెళ్ళిపోయాడు.

2

అది తెలంగాణ రాష్ట్ర రాజధానికి సుమారు నూట ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న కామారెడ్డి జిల్లాలోని ఊరు వానకొండ . ఆ ఊరికి చుట్టూ ఉన్న అడవి ఒకప్పుడు బాగా దట్టంగా ఉండేది. ఆ అడవి పలుచ బడుతూ ఊరికి దూరంగా జరుగుతూ, ఇప్పుడు నిస్సహాయంగా శోకిస్తున్న వృద్ధాప్యంలా కనిపిస్తున్నది.

సుమారు అయిదు వందల ఏండ్ల చరిత్ర ఉన్న ఊరది. ఆ ప్రాంతాన్ని పాలించిన సంస్థానాధీశులు కట్టించారు ఆ ఊరును. కానీ ఇప్పుడు ఆ చరిత్రకు సంబంధించిన ఆనవాళ్ళు ఏవీ కనిపించవు. అన్నీ వ్యాపార నాగరికత అనే ఆధునిక మృగానికి ఆహారమై పోయాయి. ఆ ఊరు వేగంగా పట్టణంలా మారిపోతున్నది. ఇప్పుడది ఓ మండల కేంద్రంగా మారింది. అయినా ఆ ఊరి తూరుపు చివర ఉన్న కొన్ని పాత వీధులు మాత్రం ఇంకా గత కాలపు అవశేషాలతో మిగిలి ఉన్నాయి. వెనుకటి కాలపు శిథిలమైన ఇళ్ళకు కొంత భాగం సిమెంటుతో చేసిన మార్పులతో కనిపిస్తున్నాయి. కొన్ని సిమెంటు ఇళ్ళు, కొన్ని పెంకుటిళ్ళతో కలిసి పాత వాసనలతో కనిపిస్తున్నది. అందరూ దాన్ని పాత ఊరనే పిలుస్తారు.

అక్కడ మూడు వైపుల నుంచి వస్తున్న దారులు కలుసుకుంటున్న చోటు.దానికి కొంచెం దూరంలో ఓ పెద్ద విశాలమైన భవనం. పాతదనం కొంత నిలుపుకొంటూ, కొత్తదనాన్ని కలుపుకుంటూ కనిపించే భవనం అది. సుమారు ఓ ఎకరం వైశాల్యంలో ఉందది. ఏ వంద ఏండ్లకు ముందో నిర్మించిన ఓ గడీలాంటి కట్టడమది. ముందు వైపున ఉన్న గేటు దాటి ఓ మూడు వందల గజాల దూరం నడిస్తే, ఆ భవనం మొదలౌతుంది. అక్కడ ద్వారానికి పాత తలుపులు. పెద్ద పెద్దవి. టేకుతో చేసినవి, ఇంకా దృఢంగానే ఉన్నట్టు కనిపిస్తున్నాయి. లోపల కుడివైపున ఉన్న బంగ్లా కొంత భాగం శిథిలమైపోయింది. దానికి మరమ్మత్తులుచేసి వాడుకుంటున్నట్టు కనబడుతున్నది. ఎడమ వైపున వంటిల్లు, పెరడు ఉన్నాయి. కుడి వైపున కొన్ని గదులు నివాసానికి అవసరమైన విధంగా మార్చి కట్టించినట్టున్నాయి. నడుమ పెద్ద గచ్చు, దాని చుట్టూ అరుగు. వసారాలో పెద్దపెద్ద గుమ్ములు, వాటిలో ఏవో ధాన్యాలున్నాయి. వాటి పక్కన కొన్ని వ్యవసాయ పరికరాలు కనిపిస్తున్నాయి.

ఉమ్మడి కుటుంబాలు అన్నీ కనుమరుగై ఇద్దరు ముగ్గురికే పరిమితమైన ఈ కాలంలో కూడా ఆ ఇంట్లో ఓ నాలుగు కుటుంబాలు కలిసే ఉంటున్నాయి. పెద్ద దర్వాజ దాటగానే కుడివైపున ఉన్నదో నల్లా. దాని దగ్గర కాళ్ళు కడుక్కుని, వేగంగా నడుచుకుంటూ తన తల్లి నాగరత్న దగ్గరకు వెళ్ళాడు బాలవర్ధన్. ఆమె తన గదిలో ఏదో పనిలో ఉంది.

బాలవర్ధన్ ఆ గదిలో ప్రవేశిస్తూనే గట్టిగా "అమ్మా! " అని అరుస్తున్నట్టుగా పిలిచాడు. ఆ పిలుపు విని ఆమె తలతిప్పి బాలవర్ధన్ వైపు చూసింది ఏమిటన్నట్టు.

"అమ్మా! నువ్వు నిజంగా నా కన్న తల్లివేనా?... నిజం చెప్పమ్మా! అబద్ధం చెబితే నన్ను చంపుకతిన్నట్టే".

ఆ పిల్లాడి మొహంలో, గొంతులో వ్యక్తమౌతున్న దు:ఖం, ఆందోళన చూసి ఏమైందోనని కంగారుపడింది నాగరత్న. బాలవర్ధన్ నోటివెంట వచ్చిన ఆ ప్రశ్నలు ఆమెకు ఊహించని పిడుగు పాటులా తగిలాయి. ఆమె మొహం క్షణకాలం కళ తప్పింది. గొంతు తడారినట్టు మూగబోయింది. "అదేంటి నాన్నా!... అవేం మాటలు. ఏంజరిగింది?" అంటూ బాలవర్ధన్‌ను అనునయించ బోయింది. ఆ ఇంట్లో ఉన్న ఆడవాళ్ళందరూ ఆ గదిలోకి వచ్చారు ఏమైందోనని.

"చెప్పమ్మా! నిజం చెప్పు! మీరు నా తల్లిదండ్రులు కారా?... దయచేసి నిజం చెప్పమ్మా!

నామీద ఒట్టే...!

కాసేపు అతడి మొహంలోకి చూస్తూ నిశ్శబ్దంగా నిలబడిపోయింది నాగరత్న. తరువాత ఏదో నిర్ణయానికి వచ్చిన దానిలా తలాడిస్తూ "చెప్తాను వర్ధన్! నీకీ రోజు నిజాన్ని చెప్తాను. చెప్పాల్సిన రోజు వచ్చిందని అర్థమౌతున్నది. ఈ నిజాన్ని దాచిపెట్టే శక్తి ఇక నాకు లేదు." అని కాసేపు ఆగి, తన చుట్టూ ఉన్న ఆడవాళ్ళను ఓ సారి చూసి, బాలవర్ధన్ భుజం మీద ఆప్యాయంగా చేయి వేసి మెల్లగా చెప్పింది "నిజమే. నువ్వు మా కొడుకువు కాదు! మీ అమ్మ నాగమణి, నీ తండ్రి కార్యవర్ధన్. నీవు పుట్టిన కొద్ది రోజులకే వాళ్ళు నీకు దూరమయ్యారు."

ఆ మాటలు వినగానే బాలవర్ధన్ కళ్ళలోంచి నీళ్ళు జలజలా రాలిపడ్డాయి. దు:ఖం ఓ పెద్ద కెరటంలా పొంగుకొచ్చింది. "...ఏమైంది వాళ్ళకు? చనిపోయారా? ఎలా?" దు:ఖాన్ని ఆపుకునే ప్రయత్నం చేస్తూ అడిగాడు.

"లేదు బాలవర్ధన్! మీఅమ్మా నాన్నా చనిపోలేదు... వాళ్ళింకా బతికే ఉన్నారు."

"బతికే ఉన్నారా! ఎక్కడ? ఎలా ఉన్నారు? నేను ఇప్పుడే వాళ్ళను చూడాలి !"

బాలవర్ధన్ మొహాన్ని ప్రేమతో జాలిగా తడుముతూ అంది నాగరత్న "చెప్తాను వర్ధన్! అంతా చెప్తాను.అదో పెద్ద కథ. నీకు వివరంగా చెప్తాను!" అంటూ ఆ గదిలో ఉన్న మంచం మీద అతణ్ణి కూర్చోబెట్టింది. ఆడవాళ్ళంతా ఆ గదిలో ఉన్న కుర్చీల్లో, సోఫాల్లో, మంచంమ్మీదా కూర్చున్నారు.

"ఈ విషయాలు నేను కొన్ని పెద్దవాళ్ళు చెప్పగా విన్నాను. కొన్ని విషయాలు వాళ్ళూ వీళ్ళూ చెప్పుకుంటే తెలుసుకున్నాను. కొన్ని విషయాలు నేను చూసాను. కొన్ని సందర్భాల్లో నేను ఉన్నాను. వీటిలో కొన్ని నమ్మలేని విషయాలూ, ఆశ్చర్యంగా అద్భుతంగా అనిపించే సంగతులూ ఉంటాయి. అయితే 'అచ్చంగా ఇలాగే జరిగిందా' అంటే 'దాదాపుగా నాకు తెలిసింది ఇదే' అని మాత్రం చెప్పగలను.

ఇక విను నాన్నా! " అంటూ నాగరత్న తాను కూడా బాలవర్ధన్ పక్కన కూర్చొని, వాళ్ళ అమ్మ కథను చెప్పడం ప్రారంభించింది .



-డా॥వి.ఆర్.శర్మ
సెల్:9177887749

"సారీ ఏందిరా... సారీ... పానం దింటుంటివి ఇయ్యాల.. పుట్టంగనే అవ్వనూ, అయ్యనూ మింగి కూసున్నోనివి. ఇయ్యాల నా పోరలను గూడా గట్లనే జేద్దామనుకున్నవేమో!... దిక్కుమాలిన పోరడా..."

"అమ్మా! నువ్వు నిజంగా నా కన్న తల్లివేనా?... నిజం చెప్పమ్మా! అబద్ధం చెబితే నన్ను చంపుకతిన్నట్టే"



బాల గేయం

ఆవు

పచ్చని గడ్డిని మేసేవి
కమ్మని పాలను యిచ్చేవి
అమ్మలా పోషించేవి
సాధు జంతువులు, ఆవులు!

మూపురాలతో సూర్యరశ్మిని
ప్రాపుగా స్వీకరించేవి
ప్రజలకెల్లను ఆక్సిజన్లుగా
ప్రాణశక్తి ప్రసాదించేవి

పేడతో పరిశుభ్రతకై
కల్లాపికుపకరించేవి
మూత్రముతో గూడా
మాత్రలకుపకరించేవి

అనాదిగా మన ఆవులు
ఆరోగ్యాల ప్రోవులు!
వాటిని సంరక్షించాలి
మేటిగ యిల జీవించాలి!

- డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

గురువు

శిలలాంటి శిష్యుణ్ణి
శిల్పంగామలచి
ప్రాణం వూది
నడవడంనేర్పి
జ్ఞానమనే దివిటీనిచ్చి
ధైర్యమిచ్చి
సాహస మిచ్చి
మానవత్వం నింపి
అంధకారం దాటించి
లోకంలో స్థానమిప్పించి
గౌరవం కలిగించి
తనతో సమానంగా
జ్ఞానంలో దిట్టగా
తన తరువాత
తనకు జ్ఞాన వారసుడుగా
శిష్యుణ్ణి తయారు
చేయువాడే గురువు

-ఎస్.ఎమ్.షరీఫ్
9618045319

వర్షం

వానలు బాగా కురిశాయి
ఊరు వాడ ఏకం చేసెను
చెరువులు కుంటలు నిండాయి
మత్తడి అలుగులు దుంకాయి
పరుగున పిల్లలు వెళ్లారు
కాగితపు పడవలు వదిలారు
ఇసుకతో కాలువలు కట్టారు
ఇంజనీర్లలా నీరు పారించారు
ముద్దుగా వానలో తడిశారు
మురిపంతో గెనీతులేశారు
పచ్చగా చెట్లు చిగురించెను
చూడముచ్చటగా కనిపించెను
జీవులన్నిటికీ ఊరటనిచ్చె
భువినంతటికి సంతసమిచ్చె

-యాదవరనీ చంద్ర కాంత్ గౌడ్
9441762105

బస్సు

ఊరు ఊరు తిరుగుకుంటు
ప్రతి ఊరును పలకరిస్తు
పల్లె పట్టణంబులనక
పయణించును ఆ బస్సు!!రి

చిన్న పెద్దలందరిని
పదిలంగా తీసుకెళ్ళి
సమయానికి గమ్యానికి
చేర్చుతుంది ప్రతి బస్సు!!

తీర్థయాత్రలన్నింటికి
తీసుకెళ్ళు ఆ బస్సు
ఎండ,వాన తగులకుండ
భలే బాగు మన బస్సు!!

స్వచ్ఛమైన చల్లగాలి
కిటికీనుండి వస్తుంటే
ప్రకృతి అందాలు చూస్తూ
పయణించుట హాయి హాయి!

- అన్నాడి జ్యోతి
9440708866

ప్రధానమైన నూరు పాఠాలు...

బహు భాషలను జిహ్వ పై
మధుర భాషణంగా వేదిక పై
వేల్పుల చేసిన మహా పండిత వరేణ్యుడు !
తెలుగు ఖ్యాతిని ప్రపంచాన
ఓరుగల్లు తోరణంగా ప్రతాపం
చేసిన స్వభాషాభిమాని !
విలువలెరిగిన రాజకీయ
ఎత్తుగడలతో దేశాన్ని
అంతర్జాతీయంగా ఎవరెస్టు
శిఖరాయమానం చేసిన
అపర చాణుక్య ఘనుడు !
ప్రయోజన ప్రణాళికలు రచించి
దేశాన్ని అన్ని రంగాల
రంగ రంగ వైభవం చేసిన
మన ప్రధాన మంత్రి !
విద్యాప్రమాణాల ధారణగా
దేశంలో విద్యను తీర్చిదిద్దిన
మన దేశం పెద్ద బడి పంతులు !
మధ్యాహ్న భోజన పథకం
శ్రీకారం చేసి పేద బాలల
బడికి రప్పించిన ఆబాల గోపాల విద్యాతపస్వీ !
రైతు కుటుంబాన పుట్టిన వాడు
రైతు శోకం ఎరిగిన వాడు
పుట్టెడు పుట్టెడు ధాన్యం
పండేలా రైతుల నాగలికి
ఎన్నెన్నో రాయితీలు మొలకలెత్తించి నారు పోసిన
ఈ దేశపు రైతుల రారాజు !
ఆహా ! ఆడంబరమెరుగని
లాల్చీ ఉత్తరీయల పంచెకట్టు
తెలుగు వెలుగుల ప్రధాని !
పాములపర్తి వేంకట నరసింహా రావు శతజయంతి వేళ
మన పూర్వ ప్రధాని
చరిత్ర పుటం పెట్టిన
నూరు పాఠాలుగా
మనకు అపూర్వం - ఆదర్శం !
(అపూర్వ ప్రధాని పి వి .నరసింహారావ
శతజయంతి కవిసమయంగా కవితా అర్ఘం)

- కందాళై రాఘవాచార్య
8790593638

అపర రాజనీతిజ్ఞుడు

ఆయనొక సాహస రాజకీయ కెరటం
అలుపెరగని రాజనీతిజ్ఞుడు
బహుభాషాకోవిదుడు తెలంగాణ రాజకీయ యోధుడు
పెక్కు కలగళాలకు ప్రేరణదాయకుడు
సత్య వాక్పటిమా నిత్యచైతన్య శీలి...!
మాతృభాషతోపాటు పదహారుభాషల్లో
కవితా సేద్యం చేసిన కళా పిపాసి...!

మనసులో మెరిసిభావాలకు
రమ్యంగా ప్రాణంపోసి...గొల్ల రామవ్వకథను రాసి
కాకతీయ పత్రికను నడిపి
తెలంగాణకు సాహితీ గౌరవాన్ని కలిగించిన ఘనాపాటి...!

పాములవర్తి వంశోద్భవచంద్రుడే
పీవీజీ గా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా,
కేంద్రమంత్రిగా,
విదేశిరాయబారిగావిశిష్ట సేవలందించినఅపరచాణక్యుడు!

ఆర్థిక సంస్కరణలవేత్తగాదక్షిణాదితొలి
ప్రధానిగా గురుతరబాధ్యతల్ని
నిర్వహించి దేశ ఆర్థిక ప్రగతికి రూపురేఖల్ని దిద్దిన ప్రణాళికాబద్ధుడు
ఆర్థిక వృద్ధిరేటుకు అక్షర శిల్పి...!
పారదర్శతకు నిత్య కృషీవలుడు..!
భారత భావితరానికి ఊతంనేర్పిన
కార్యదక్షతకు ప్రాతఃస్మరణీయుడు..!

సనాతన సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దం...!
సాంకేతిక పరిజ్ఞాన పరికల్పన
సమ్మేళనాలకు శ్రీకారం చుట్టిన
ఆదిత్య హృదయతత్త్వుడు పీవీజీ..!

సాహితి లోకానికి పెన్నిధిగా,
విశ్వనాథ వేయిపడగల్ని సహస్రఫణిగా అనువదించి కేంద్ర సాహిత్య
అకాడమీ నందుకున్న సాహితీమార్గదర్శిగా,
పీవీజీ ...ఓ ధ్రువతార..!

తెలుగువాడిగా ఢిల్లీలో చక్రంతిప్పిన ఆధునిక యౌగందరాయణుడు
రాజకీయ దురంధరుడుప్రజాస్వామ్య పరిరక్షణా ధర్మతత్త్వుడు
పట్టుదోతుల వేష భూషణాలంకారమే ఆతని ఆత్మగౌరవం ఠీవీ..
తెలంగాణ హృదయ సంస్కారానికి నిలువెత్తు సాక్ష్యం ..
మన పీవీజీ... !

త్రికరణశుద్ధిగా జయంత్యుత్సవాలలో
జయ నీరాజన వీణగేయంగా
శతకోట్ల భారత ప్రజావాణిగా
చేతులెత్తి శిరసానమామిగా
మోకరిల్లి అక్షర పుష్పాంజలులను
ఆనందంగా సమర్పిస్తూ.....!!!

-పాందాల మహేశ్వర్
7981837830.

నిత్యస్మరణీయులు

ఆంజనేయుడు

-దోరవేటి
సెల్:9866251679

శా॥ శ్రీరామస్మరణ ప్రపూర్ణమతివై, సిద్ధస్థితప్రజ్ఞవై,
వారశిన్ శైలయేరుగా గడియియన్ వజ్రాంగువై లోక వి
స్తారంబైన యశంబు నందితి విలన్ ధైర్యంబు సంకేతవై
ఊరూరన్ జనవందనంబుగొను సద్యోశక్తి దాతా నమో !

కం॥ బలమెంత గలదియున్న న
నిలపత గర్వంబువేక నిరతము కైగడే
విలనీ సరసన్ నిలువన్
గల దైవము లేడు లేడు ఘన చరిత్రా !

ఉ॥ సూర్యకుమార మంత్రివయి సూనృతవాక్ప్రమతి మన్నుజే
సూర్యకులంబుండు రేమునికి శోభను గూర్చిన బంటువయ్యి స
త్కార్యములన్ని క్షిప్రమతిగా నొనరించు వివేక పూర్ణవై
ఆర్యుల సన్నుతిన్ గొను మహాబల విక్రమ! నీకు మ్రొక్కెదన్

తే॥ అపర మదగజములకు నిలవమ్మవయ్యి
రామ నామమ్మునకు నివె ధామమయ్యి
చేతనను నింపు శ్రీ చిరంజీవివయ్యి
భక్తి సేవింతు రయిల ప్రజలు నిన్ను !

తెలంగాణ సాహిత్య ప్రాతినిధ్య కథలు

కారణాలు ఏవైనా కావచ్చు, ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో తెలంగాణా కథలు, కథకులు, కొంత వివక్షతకు లోనయ్యారు. సినిమాల్లో ప్రతినాయకుల నోటమాత్రమే వినదగ్గ భాషగా "దొరా! బాంచెన్ కాల్గొక్త! గులాపోన్ని" అన్న దీనలాపనలకు పనికి వచ్చే భాషగా మాత్రమే పరిగణించబడేది. నిజానికి తెలంగాణ తెలుగే ప్రాచీనం అని చెప్పటానికి ఎన్నో ఋజువులు, సాక్ష్యాధారాలు కనబడుతాయి.

కాకీతీయ పాలన తర్వాత, ఢిల్లీ ప్రభుత పాలన వింధ్యా పర్వతాలను దాటి దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించిన నాటినుండి మొదలైన ఈ విస్మరణ వేరు తెలంగాణ వరకు కొనసాగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాక, తెలంగాణ సాహిత్యాన్ని వెదికి, వెలికితీసి పరిరక్షించటానికి ఒక 'అకాడమీ' ఉద్భవించింది. స్వయం సాహితీవేత్త మరియు సాహితీప్రియుడు అయిన డా॥నందిని సిధారెడ్డి అధ్యక్షతన ఈ అకాడమీ తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ఔన్నత్యాలని ప్రపంచానికి చాటి చెప్పటానికి నడుం బిగించింది.

ఈ క్రమంలో అనతికాలంలోనే శత గ్రంథాలకుపైగా ముద్రించింది.

కథ సంస్కృతిలో ఒక విడదీయలేని భాగం, పండితులకు, పామరులకు, అక్షరాస్యులకు, నిరక్షరాస్యులకు కూడా మనసుకు ఎక్కేప్రక్రియ. సాహిత్యంలో కథకున్నంత ప్రాముఖ్యత మరే ప్రక్రియకు లేదని అంటే అది అతిశయోక్తి కాదు. సంస్కృతి సాంప్రదాయాలు ఒకతరం నుండి మరో తరానికి అందించటానికి కథా ప్రక్రియ ఎంతో ఉపయోగపడుతుంది.

ప్రశంసనీయమైన ఈ ఉద్దేశంలో భాగంగా అకాడమీ వీరు సుమారు వందేళ్ళ వెనక్కి వెళ్ళి మూడు తరాల కథలను శ్రీమతి ముదిగంటి సుజాతారెడ్డి, శ్రీయుతులు కె.పి. అశోక్‌కుమార్, ఆడెపు లక్ష్మీపతి మరియు ఏనుగు నర్సింహారెడ్డి గార్ల సంపాదకత్వంతో **"అస్తిత్వ"** (ప్రాతినిధ్య తెలంగాణ కథలు) సంకలనం ఆగస్టు 2019లో తీసుకువచ్చారు. ఇందులో 35 కథలున్నాయి. సురవరం ప్రతాపరెడ్డి (1896-1953) గారి "గ్యారా కద్దూ బారా కోత్వాల్"తో మొదలుపెట్టి ఖమ్మం జిల్లావాసి శ్రీమతి షాజహానా (1974) 'దీవాతరెం" కథ వరకు ఈ సంకలనంలో పొందుపరిచారు. 1930 నుండి 2016 వరకు, అంటే సుమారు 85 ఏళ్ళకాలంలో వెలువడిన కథలను పరిశీలించి ఈ కథలను ప్రాతినిధ్య కథలుగా నిర్ణయించినట్లు తెలుస్తున్నది.

కథలు ఆనాటి వ్యవస్థకు ప్రతి రూపాలుగా చెప్పుకొనవ చ్చును. స్వాతంత్ర్యం రాకమునుపు అంటే 1948కి ముందు నిజాంరాజులు పాలన ఎలా ఉండేవి? మామూళ్లకు మరిగిన ప్రభుత్వోద్యోగులు, సాధారణ ప్రజానీకాన్ని ఎలా పీడించుకు తినేవారో సంకలనంలోని మొదటికథ "గ్యారా కద్దూ.." తెలుపుతుంది. ఉపాయం ఉంటే ఊళ్ళేలవచ్చు ననికూడా ఈకథ తెలుపుతుంది. శిష్టులతో బాటు మామూళ్ళు, తిండిగ్రాసం, చివరకు ఆతాహసీలుదారు 'దొర' గారింట్లో పెళ్ళి నిశ్చయమైతే, సరుకు సంభారాలకు ఆయన క్రిందివారు ఎలా ఊరిమీద పడిదోచుకుంటారో



తెలిపేదే మరో కథ శ్రీ పొట్లపల్లి రామారావుగారి 'న్యాయం".

స్వాతంత్ర్యానికి ముందు వచ్చిన సింహభాగం కథలు అధికారుల 'జులుం' వసూళ్ళ గురించి తెలిపితే, స్వాతంత్ర్యా నంతర కథలు, ఆర్థికావసరాలు, గాడితప్పిన మానవ సం బంధాలను తెలుపుతాయి (వట్టికోట ఆళ్వారు స్వామిగారి 'గాలిపటం') ఆ తర్వాతికాలంలో తెలంగాణా ప్రాంతాన్ని, శ్రీకాకుళం ఏజన్సీ ఏరియాని ప్రభావితం చేసిన నక్సలిజం, పోలీసుల హింసా ప్రవృత్తి, ఎన్‌కౌంటర్లు, హింస, ప్రతి హింసలతో సామాన్యుడు, ఎలా నలిగిపోయాడో చెరబం దరాజు (బద్ధం భాస్కరరెడ్డి), 'చిరంజీవి' కథ వివరిస్తుంది.

ఆ తర్వాతి కాలంలో అంటే డెబ్బయవ దశకంలో సాంఘీకాచారాలు, మగ, ఆడపిల్లల యెడ చూపే వివక్షత, వ్యత్యాసం మాదిరెడ్డి సులోచనగారి "హక్కు" కథలో కనిపిస్తుంది. సుప్రసిద్ధ వర్తమాన కథా/నవలా రచయిత నవీన్ (డొంగరి మల్లయ్యగారి రాకతో సాహిత్యం ఓ మలుపు తిరిగింది. మనుగడ, మౌలికావసరాల మీదినుండి మరలి, ఫ్రాయిడ్, జాన్‌పాల్ సార్త్రె లాంటి మనఃస్తత్వవేత్తలు, సైద్ధాంతికలు వివరించే మానసిక పరిస్థితి, భౌతిక, ఆది ప్లైతిక జీవితాల మీదకు రచయితలు దృష్టి సారించాలని చెప్పవచ్చును. ఉద్యోగం, అందులో ఉండే సాధక బాధకాలు, పై ఆఫీసర్ల చీవాట్లు, బలహీన ఆత్మస్థయిర్యం, తట్టుకోక 'హలుసినేషన్'లో ఉండటంలాంటి విభిన్న, వినూత్న వైయక్తిక విషయాలను వీరి కథ 'హత్య' వివరిస్తుంది. ఇదే కాలంలో తిండి గుడ్డ, కప్పు, చదువు ఆర్థికావసరాల మీదకు, దృష్టిని బి.యస్.రాములు వంటివారు మరలించారు (సదువు). సంకలనంలో చేర్చబడని, ఖమ్మంకు చెందిన పర్చాదుర్గా ప్రసాదరావుగారి బియ్యపుగింజలు" కూడా ఆనాటి, కలవారి, లేనివారి మధ్య వృత్యాసాన్ని, లేనివారు కూటిగింజలకు పడే వేదనను చూపుతుంది. 1948 అనంతరం, ప్రజలకు ఎన్నికలపై అవగాహన పెరిగిందని అల్లం రాజయ్య "ప్రత్యర్థులు' కథ చెబుతుంది. ఇలాంటిదే మరోకథ పి.చంద్ (పి.యాదగిరి)గారి 'భూ నిర్వాసితులు'.



మౌలికావసరా ల్లోంచి ప్రజలు నెమ్మది నెమ్మదిగా, కళలు వేపు తమ ప్రాధాన్యతను పెంచుకుంటున్నారని బెజ్జారపు రవీందర్ 'ఒంటికాలి శివుడు' వివరిస్తుంది. ప్రపంచీకరణ తెలంగాణ వాసుల బ్రతుకుల్ని వారి జీవనాధారాల్ని వృత్తి వసులోంచి, బీడీలు చుట్టటంలాంటి ఉపవృత్తుల్లోకి మార్చుతోందని, అప్పటికే వ్రేళ్ళూనుకుని ఉన్న కుటీర జీవనోపాధి బీడీల తయారిలో అనంఘిటిత కార్మికులు ఎలానష్టపోతున్నారో అంబల్ల జనార్ధన్‌గారి'ఓర్ది' కథ పటం కడుతుంది.

ఈలోగా షాజహానాలాంటి రచయిత్రులు ముస్లిం వైనారిటీ వర్గం ప్రాతిపదికగా రాయటం మొదలుపెట్టారు. ఆత్మలు అన్నవి జీవించే మానవుల్లోనే కాదు, సిమెంటు ఇటుక గోడల్లో కూడా ఉంటాయన్నారు.

నేటి అభివృద్ధికి ఆధారం అయిన కంప్యూటర్‌లలు తద్వారా ప్రచరితం అయ్యే ఆటలు (Computer Games) కొన్నిప్రాణాలు తీస్తున్నాయి. నేటి యువత, వీటి మాయలో చిక్కి పోవటాన్ని కస్తూరి మురళీకృష్ణతన "మాయా ప్రపంచం"లో వివరించారు.

ముందు మాటలో శ్రీ కె. శ్రీనివాస్‌తగారన్నట్లు "సేకరణ, క్రీడీకరణ, సంపుటీకరణ తరువాత దృష్టిపెట్టవలసిన విషయం విశ్లేషణ" అంటారు. మొదటి మూడింటిని ఈసంకలనం పరిపూర్తి చేసింది కనుక నాల్గవ అంశానికి ఈప్రయత్నం తొలితమెట్టు కాగలదని ఆశిద్దాం.

పుస్తక సమీక్ష

అకాడమీ వారు తలపెట్టి సాధించిన మరో ప్రశంసనీయ కార్యక్రమము- ఈ సంకలనానికి ఏక కాలంలో ఇంగ్లీషు (ఆగష్టు 2019) మరియు హిందీ (అక్టోబర్ 2019) అనువాద గ్రంథ సంకలనాలు తీసుకురావటం ఇంగ్లీషు అనువాద సంకలనానికి కె. దామోదర్‌రావు మరియు ఎలనాగ (డా॥ సురేంద్ర నాగరాజు)గారలు సంపాదకత్వం నెరిపారు. ప్రముఖ అనువాదకులు చింతపట్ల సుదర్శన్ కె.బి. గోపాలం, కె. దామోదర్‌రావు ముక్తవరపు పార్థ సారథి, శ్రీపాద స్వాతి ప్రభుతులు ఇంగ్లీషులోకి అనువదిం చారు. హిందీ అనువాద సంకలనానికి ప్రొ॥బుషబ్ దేవ్‌శర్మ, డా॥ ఎం. రంగయ్య మరియు గుడ్ల పరమేశ్వర్‌గారలు సంపాదకత్వం నెరపగా, డా॥టి. మోహన్‌సింహ, ఎస్.నారాయణరావు, షకీల్ అహ్మద్ గారలే కాకుండా సంపాదకులు కూడా కొన్ని కథలను హిందీలోకి అనువాదం చేసారు. మూల కథలోని భావ అర్థాలకు భంగం వాటిల్లకుండా అనువాద పర్యవేక్షణ శ్రీ నందిని సిధారెడ్డిగారు, ప్రధాన సంపాదకులుగా పోషించిన పాత్ర బహుధా ప్రశంసనీయము అని చెప్పవచ్చును.

మూలకథ మరియు అనువాదకుల వివరాలు:

1. గ్యారాకద్దూ బారా కోత్వాల్. సురవరం ప్రతాప్‌రెడ్డి. ఇంగ్లీషు అనువాదం తోట శ్రీనివాస్. హిందీ అనువాదం. డా॥ ఎం. రంగయ్య.
2. తెలియక ప్రేమ తెలిసి ద్వేషము. కాళోజీ నారాయణరావు. ఇం. అ. కె. దామోదర్‌రావు, హిం.అ. డా॥ఎం. రంగయ్య.
3. న్యాయం. పొట్లపల్లి రామారావు. ఇం.అ. ఎలనాగ, హిం.అ. డా॥ ఎం. రంగయ్య.
4. గొల్లరామవ్వ, పి.వి.నరసింహారావు. ఇం.అ.కె. పురుషోత్తం. హిం.అ. డా॥ఎం. రంగయ్య.
5. నిప్పూపూలు. దాశరథి కృష్ణమాచార్య. ఇం.అ. ఎలనాగ. హిం.అ.గుడ్ల పరమేశ్వరి.
6. గాలిపటం. వట్టికోట ఆళ్వార్‌స్వామి. ఇం.అ. పాలకుర్తి దినకర్. హిం.అ. "కనకవ్వ" శీర్షికతో డా. ఎం.రంగయ్య.
7. ఇద్దరు ఖైదీలు. నల్లపురెడ్డి బుచ్చారెడ్డి. ఇం.అ. చింతపట్ల సుదర్శన్. హిం.అ. గుడ్ల పరమేశ్వర్.
8. చిరంజీవి. చెరబండరాజు. ఇం.అ. స్వాతి శ్రీపాద. హిం.అ. ప్రొ. టి. మోహన్ సింహ.
9. హక్కు. మాదిరెడ్డి సులోచన. ఇం.అ. పరిమళ కులకర్ణి హిం.అ. గుడ్ల పరమేశ్వర్.
10. హత్య. నవీన్ (డొంగరి మల్లయ్య). ఇం.అ. కె. దామోదర్‌రావు. హిం.అ. గుడ్ల పరమేశ్వర్.
11. నేను చచ్చిపోయానా. సి.హెచ్. మధు. ఇం.అ. అల్లటి తిరుపతి రెడ్డి. హిం.అ. డా. టి.సి. వసంత.
12. జాడీ. సదానంద్ శారద. ఇం.అ. గన్ను నటరాజశేఖర్ మరియు ఎన్. రమేశ చంద్ర శ్రీకాంత్. హిం.అ. పేరంబుదూర్ నారాయణరావ్.
13. చిత్రకన్ను. నందిని సిధారెడ్డి. ఇం.అ. ఆదిరమేష్ మరియు జయవంతరావు. హిం.అ. షకీల్ అహ్మద్.
14. పొడవని పొద్దు. దేవరాజు మహరాజు. ఇం.అ. పాలకుర్తి దినకర్‌మరియు అల్లటి తిరుపతిరెడ్డి. హిం.అ. శ్రీ పెరంబుదూర్ నారాయణరావు.
15. మిణుగుర్లు ముక్తవరం పార్థసారథి, ఇంగ్లీషు అనువాదం కూడా వీరే చేసుకున్నారు. హిం.అ. షకీల్ అహ్మద్.
16. ఇత్తనపుకోడె. వుప్పల నరసింహం. ఇం.అ. కె.బి. గోపాలం, హిం.అ. డా॥ టి. మోహన్‌సింహ్.
17. ఆహార యాత్ర. డా. ఎ.ఎం. అయోధ్యారెడ్డి. ఇం.అ. గనన్ననటరాజ శేఖర్, హిం.అ. డా॥ సుమన్‌లత.
18. చావువిందు. తుమ్మేటి రఘోత్తమ రెడ్డి. ఇం.ఇ. కె.బి.గోపాలం. హిం.అ. ప్రొ.టి. మోహన్ సింహ్.
19. నదువు. బి.యన్.రాములు. ఇం.అ. ఇ.సత్యనారా యణ.హిం.అ. ప్రొ.టి. మోహన్ సింహ్.
20. ప్రత్యర్థులు. అల్లం రాజయ్య. ఇం.అ.అల్లాడి ఉమ మరియు ఎం.శ్రీధర్. హిం.అ. గుడ్ల పరమేశ్వర్.
21. యుద్ధభూమి. కాలువ మల్లయ్య. ఇం.అ.కె. దామోదర్‌రావు.హిం.అ.శ్రీ పెరంబుదూర్ నారాయణ రావ్.
22. భూ నిర్వాసితులు.పి. చందన. ఇం.అ. అల్లాడిఉప మరియు ఎం.శ్రీధర్. హిం.అ.షకీల్ అహ్మద్.
23. ఒంటికాలి శివుడు.బెజ్జారపు రవీందర్. ఇం.అ. తోట శ్రీనివాస్. హిం.అ.డా. సుమన్ లత.
24. అంతర్ముఖం. జాతశ్రీ (చార్లెస్), ఇం.అ. ముక్తవరం పార్థపారథి. హిం.అ. డా॥ సుమన్ లత.
25. ఒర్ది. అంబల్ల జనార్ధన్. ఇం.అ. జయవంత్‌రావు, చాలూర్‌కర్ మరియు ఆది రమేష్‌బాబు. హిం.అ. షకీల్ అహ్మద్.
26. 9/11 లవ్‌స్టోరీ ముదిగంటి సుజాతారెడ్డి. ఇం.అ. అల్లాడి ఉప మరియు ఎం.శ్రీధర్, హిం.అ. షకీల్ అహ్మద్.
27. నెమలినార. బి.మురళీధర్. ఇం.అ. కె.బి. గోపాలం, హిం.అ. డా. టి.సి. వసంత.
28. మాయా ప్రపంచం. కస్తూరి మురళీకృష్ణ. ఇం.అ. ఎన్.రమేష్ చంద్ర శ్రీకాంత్, హిం.అ. డా. టి.సి. వసంత.
29. అసందిగ్ధ కర్తవ్యం. ఆడెపు లక్ష్మీపతి. ఇం.అ. టి.ఎస్. చంద్రమౌళి. హిం.అ. శ్రీ పెరంబుదూర్ నారాయణ్‌రావ్.
30. కరెంటు కథ. బోయ జంగయ్య. ఇం.అ. టి.యస్. చంద్రమౌళి. హిం.అ. ప్రొ.టి. మోహన్ సింహ్.
31. దీవారెం. డా॥ షాజహానా. ఇం.అ. పరిమళ కుల్‌కర్ణి. హిం.అ. డా. టి.సి. వసంత.
32. డబ్బుసంచి. కె.వి. నరేందర్, ఇం.అ. జయవంత్‌రావ్ చాలూర్‌కర్ మరియు ఆదిరమేష్ బాబు.హిం.అ. డా. టి.సి.,, వసంత.
33. దుఃఖాగ్ని. రామా చంద్రమౌళి. ఇం.అ.ఇ. సత్యనారాయణ. హిం.అ. శ్రీ పెరంబుదూర్ నారాయణ రావ్.
34. గుండెలో వాన. పెద్దింటి అశోక్‌కుమార్.ఇం,అ, ఆది రమేష్ బాబు మరియు జవంత్ రావు. హిం.అ. డా.సుమన్‌లత.
35. వాళ్ళు. తాయమ్మ కరుణ. ఇం.అ. అల్లాడి ఉమ మరియు ఎం. శ్రీధర్. హిం.అ. డా. సుమన్‌లత.

తెలుగు సంకలనంలో పై 35 రచయిత (త్రు)ల పరిచయం ఇచ్చారు. ఇంగ్లీషు మరియు హిందీ అనువాద సంకలనాలలో ఆ,యా, అనువాదకుల వివరాలు కూడా ఇవ్వటం ఎంతో సమంజసంగా ఉంది.

అకాడమీ తరపున సంపాదకులు చెప్పుకున్నట్లు వంద సంవత్సరాల చరిత్ర ఉన్న తెలంగాణ కథా సాహిత్యం లోంచి మూడు తరాల "ప్రాతినిధ్య" కథలను



ఏరుకోవటం అంతటి సామాన్యమైన విషయం కాదు. ఎన్నుకున్న కథలు, నాటినుంచి నేటి వరకు తెలంగాణా సంస్కృతిని, సమాజంలోని బహుముఖీన జీవన సంఘర్షణలకు అద్దం పట్టేవిగా ఉన్నాయి. వందేళ్ళ కాలంలో ఇతర రాష్ట్ర కథల్ని పరిశీలిస్తే. తెలంగాణాప్రజలది.నిన్న మొన్నటివరకు. కూడా "పోరు బ్రతుకు" అని అనిపిస్తుంది. "మా రాజ్యం మాగ్గావాలి. మాభాషకు సమున్నత గౌరవం దొరకాలి. మా సంస్కృతి మాకుండాలి" అన్న పోరాటంలో విజయం సాధించాక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సరైన దిశలో పయనిస్తోంది అని చెప్పటానికి ఈ కథా సంకలనం ఒక గొప్ప నిదర్శనం.

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తెలంగాణా చిత్రకారుడు తోట వైకుంఠంవల్ల బొమ్మలకు ముఖ చిత్రంగా మరియు అట్ట చివరి బొమ్మగా వేయటం వల్ల అకాడమీ వారు తెలంగాణా చిత్రకళకు ప్రాముఖ్యం ఇచ్చినట్లయింది.

తెలంగాణ కథకు దేశస్థాయి, మరియు అంతర్దేశ స్థాయి ఈ మూడు సంకలనాలతో చేకూరిందనటానికి ఏ మాత్రమూ సందేహంలేదు. ఇంతటి గొప్ప ప్రశంశనీయమైన కార్యక్రమాన్ని భుజాన వేసుకుని విజయవంతంగా నెరవేర్చిన ప్రధాన సంపాదకులు డా॥ నందిని సిధారెడ్డి గారికి సంపాదక వర్గానికి మరియు తెలంగాణ సాహిత్య అకాడమీవారికి అభినందనలు. సాహిత్యానురక్తులైన వారి ప్రతి ఇంటా ఉండదగిన కథా సంకలనమిది.

("అస్తిత్వ" ప్రాతినిధ్య తెలంగాణ కథలు) ప్రధాన సంపాదకులు: డా॥ నందిని సిధారెడ్డి.ప్రచురణ: తెలంగాణ సాహిత్య అకాడమీ. వెల: రూ॥ 250/-. తెలుగు, హిందీ మరియు ఇంగ్లీషు అనువాద ***సంకలనాలకు:*** తెలంగాణ సాహిత్య అకాడమీ. కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్-500 040. ఫోన్: 040-29703142.

-కూర చిదంబరం
సెల్: 8639338675

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 27-8-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

లిట్మస్ పరీక్ష...!

ఇది నాకైతే దిగులు మబ్బులతో కూడిన
ఉషోదయమే..!
ఆహా..!పరిమళభరిత సువాసన..
ఎక్కడినుంచో..నన్ను వెతుక్కుంటూ
ఆత్రంగా ఆఘ్రానిస్తూ ఆస్వాదిస్తున్నా..
ఏ పువ్వూ విసరనంత కొత్తదనం
మరే కవీ నిర్వచించనంత కమ్మదనం..!
నిలువెల్లా పులకించి
ప్రాణం లేచొచ్చినంత హాయి
ఇంతకు ముందు చూడందేమీ కాదు గానీ
ఇప్పుడు మాత్రం..ప్రత్యేకతే..!
కనబడని వైరి కరోనాతో కబడ్డీ కదా
గెలిచానో..ఓడానో
నాకు నేను చేసుకుంటున్న లిట్మస్ పరీక్ష
అది..అమ్మ కలిపిస్తున్న..నిమ్మరసం
నీలగిరీ చుక్కల సువాసన సుమా..!

ఆకాశం తో పాటూ
నాకూ పడిశం పట్టింది వారంనుంచీ..
యెడతెగని జల్లులు
ఆ దినకరుడే మబ్బుల దుప్పటికింద
దాక్కున్నాడు.
ఇక నేనెంత..!?
పైపెచ్చు..
దాబాపైని వానదేవుడిని నిలువరించి
కాగితప్పడవై..చినుకుల కేళిలో విహరించాను కదా..!
ఇకచూడాలి చిన్న తుమ్మకే
కషాయం..కాఫీ గార్లింగంటూ మా ఇంట్లోహడావుడి

బంధువర్గపు పలుకరింపులూ
ముందుజాగ్రత్తల ఉపన్యాసాలు
ఆక్సిటెస్టులు..స్టీమ్ పట్టడాలు..ఓహో
ఎప్పుడూ లేంది ఎంత ప్రేమో..అనుకున్నా ..
నేను లేస్తేనే తప్పా
వీళ్లకు పొయ్యి వెలగదనే ముచ్చట వెలిగింది
హమ్మయ్య..! ఎట్టకేలకు
నా జ్ఞాన నాసిక వాసనని పసిగట్టింది సుమా..
అయితే నన్నింకా కరోనా కుట్టలేదన్న మాట...!

-నాంపల్లి సుజాత
9848059893

రెక్కలు విరిగిన పక్షి

నిన్న నేనొక స్వేచ్ఛా విహంగాన్ని
నాకు హిమగిరి శ్రేణులంత రెక్కలుండేవి
భుజాలకి, కాళ్ళకి, కళ్ళకి, మనసుకి
ఊహలకి, ఆశలకి ఎన్నో, ఎన్నెన్నో రెక్కలు
ఎక్కడికంటే అక్కడికి, ఎప్పుడంటే అప్పుడు
స్వేచ్ఛగా ఎగిరి వెళ్లిపోయేదాన్ని !!
చుక్కల లోకానికెగిరి అక్కడ
నా ఈకను జెండాగా ఎగరేయాలనుకున్నా
మబ్బులకి ఊయలలేసి, కొండల్లో, కోనల్లో
ఊగాలనుకున్నా!!
సెలయేటి అలలతో కేరింతాలాడాలనుకున్నా
పాడుతూ, పరవశిస్తూ, గంగఒడ్డు పూలగాలినై
పరిమళించాలనుకున్నా....

ఎక్కడినుంచో వచ్చింది ఓ ఎర్రని
అజ్ఞాత శత్రువు !!
రెక్కలన్నీ విరిచేసింది
ఆకసానికి వేసుకున్న ఊయల తాళ్ళను
తెంచేసింది ...
స్వేచ్ఛని హరించేసింది...
నా దేశ స్వరపేటికని నొక్కేసింది..
నేనిప్పుడు పాడలేను.. ఆడలేను..ఎగరలేను .
నిశ్చేష్టురాలినై, నిస్సహాయనై
దిక్కులు చూస్తూ నిలబడి ఉన్నా
అటూ, ఇటూ ఊగే పెండ్యులంలా

కాలాలాపనకూగే మౌనపు తలలా
త్రిశంకుస్వర్గంలో పట్టు దొరకని అడుగులా...
ఇక్కడ నుంచి ఏ నేల
కడుపులోకి జారిపోతానో,
ఏ నింగి పొడుపులోకి ఎగిరిపోతానో
తెలియని అయోమయం
కంటికగుపడని కసాయి ఇంద్రజాలం.

-అత్తలూరి విజయలక్ష్మి
9676881080

చేతుల్లో కుంచె

మెత్తని కలల నిండా గుత్తులు గుత్తులుగా
సుకోమల వర్ణ సముదాయం
పెదవి కదలని మస్తిష్కపు కాన్వాస్ మీద
తొలి పాదం మోపేందుకు
తొందరపడుతూ ఒక తమకం

ఓ పక్కన తెరలు తెరలుగా ఉక్కిరిబిక్కిరి చేస్తూ
పచ్చని పంటను రాత్రీ పగలూ మేస్తున్న చీడ
ఆకు రాలు కాలంలా క్షణక్షణానికీ రాలుతున్న ఆశలు
మేసి మేసి బలిసిన చీడకు ఎటు పాకాలన్న ధ్యాస
పొడవైన శీతల హస్తాన్ని చాచి
ఎవరిని మంచుముక్కగా మార్చాలా అని

ఎదురు చూస్తున్న ఒక మహమ్మారి
గెలుపు ఓటముల మధ్య ఒక సుదీర్ఘ గుంజాటన

ఈతరాని తనమంతా
నడి సముద్రాన విడిది చేసి
చేతులు పైకెత్తేసిన అసహాయత
అసహాయతల మీద, ఆర్తనాదాల మీద
నిస్సహాయపు రోగిష్టి క్షణాల మీద
దౌర్భాగ్యపు మరణాల మీద

బంగారు మేడలు కట్టుకునే
బండ బారిన గుండెల బడా వైద్య వ్యాపారులు
మనుషులనుకుందుకూ సిగ్గుచేటు జన్మలు
ఇన్ని దృశ్యాలు ఒకదానివెనకఒకటి
మనసును పిండేసాక చేతివేళ్ళ మధ్య
మూగవోయిన కుంచె ఏ రాగాలను పాడగలదు?
ఖాళీ ప్రపంచాన ఒక రెండు కన్నీటి బొట్లు
ఈ నాటికి అద్దాలుగా
మహా చారిత్రిక చిత్రాలుగా

-స్వాతీ శ్రీపాద
8297248988

పాషాణ మానవులు

అనాదిగా..ఆచార వ్యవహారాలు
సభ్యతా సంస్కారాలు..
నైతిక విలువల ఆదరణా
భారతీయ కుటుంబ వ్యవస్థకు గట్టి
పునాది రాళ్ళు.!!.
నాగరికత వెర్రి తలలు
వేస్తున్న ఈ రోజు ల్లో
కన్న తల్లి ని గొంతు
నులిపి చంపేసే కూతుళ్ళూ..

కన్న పిల్లలను కర్కశంగా
హత మార్చే..తల్లి రాక్షసులూ..!!

కన్ను మిన్ను కానక
స్వంత కూతుళ్ళను
తమ కామానికి బలి
చేసే అమానుష తండ్రులూ..!!.
కంచే..చేను మేసిన వైనంగా
పునాదులే భవనాలను

నేలమట్టం ...చేస్తున్న చోద్యంగా..!!

కుసంస్కారాలకులోనై..
విచక్షణా జ్ఞానం కోల్పోయి..
మానవతా విలువలను
మంట కలిపే..పాఖండులై
పునాదులకే..సమాధులు కడుతున్న
పాషాణ మానవులు..!!
కలి కాల దానవులు..!!

-సావిత్రి రంజోల్కర్
9833497812

ఆ బాలిక కేక ఆ ఏలికకు వినపడలేదా..!

-డా॥ కత్తి పద్మారావు
సెల్:9849741695

ఆకాశం నుంచి నీరు ధారగా కురుస్తుంది
వాగులు, వంకలు కలసి నదులవుతున్నాయి
నదులు సముద్ర ఘోషను వినిపిస్తున్నాయి
సముద్రాలు అంతర్గతంగా అలజడిలో వున్నాయి
సూర్యగోళం కూడా ప్రమాద ఘంటికలు మోగిస్తుంది
కరోనా కరాళ నృత్యం చేస్తుంది
జనం భయం వీడుతున్నారు
ప్రమాదంలోకి స్వీయంగా వెళుతున్నారు
నిన్నటిదాకా లారీలకు భయపడ్డారు
ఇప్పుడు గీత దాటుతున్నారు
కోట్లున్నవాడు కూడా మూతికి గుడ్డ కట్టుకుని
చిందులేయడానికి అర్థం లేదు
జీవితాన్ని స్మార్ట్‌ఫోన్స్‌కు అంకితం చేశారు
దృశ్యంలో నగ్నత్వం కోసం ఆరాటం
ఆచ్ఛాదనమంతా మార్కెట్‌లో విస్తరించింది
జీవితంలో ప్రతి ఘట్టం
సమాజం ముందు ఆరబోయాలనే ఆరాటం
అంతరంగ జీవనం లేదు
కుదురు లేని బతుకులు

వార్ని వారు కొలుచుకోవడానికి
వార్ని వారు విస్తరింపచేసుకోవడానికి
కూసింత సమయం ఇవ్వలేని అసక్తత
మనిషికి నిలువెత్తు అహం
అహానికి పునాది లేదు.. అది కూలిపోతుంది
ప్రపంచాన్ని కొందరు నడిపిస్తే
ప్రపంచం అందిరినీ నడిపిస్తుంది
రోజూ ఒక వస్తువు పుడుతుంది
దానితో ఒక వ్యాధి పుడుతుంది
శరీర రుగ్మతలకు మందులున్నాయి
మనస్సు అస్తిరత్వానికి మందేదీ?
వాళ్ళెవరికో ఆనందం కలిగించడానికి
వాడు తనను తాను తగ్గించుకుంటున్నాడు
తన విలువలు తగ్గించుకొని మాట్లాడుతున్నాడు
జీవితాన్ని రోజురోజుకు మార్చుకుంటున్నాడు
వారు వెళుతున్న మార్గం వారికి తెలియదు
అది మళ్ళీ ఒడ్డుకు రాలేనంత లోతైన
ఊబిలోకి తీసుకెళుతుంది
వారి చెవులకు వినిపిస్తున్న స్వరం నిజమైంది కాదు
ఆ స్వరం కల్పితమైంది.. కృత్రిమమైంది..
ఆ ధ్వని కోసం వారు ఆరాటపడుతున్నారు
తొమ్మిది అంకెలు వారిని లొంగదీసుకుంటున్నాయి
చివరకు ఒక అంకెను కోల్పోతున్నారు
అవును! వ్యక్తిత్వం అంటే ఏమిటి?
అంతరంగం లేనిది.. అంతరంగ భాష లేనిది
వ్యక్తిత్వం ఎలా అవుతుంది?

భాషలు పెదాల మీద ఆడుతున్నాయి
నీవు ఆలోచించేదానికి భాష లేదు
వారి వేదనకు భాష లేదు
ఆ ఆశ్రమ బాలికను యజమాని చెరిచాడనేది వార్త
వాడి సేవ వెనుక కౄరత్వం వుంది
వాడి నటన వెనుక ధనకాంక్ష వుంది
రాజ్యం వాడికి పూడిగం చేస్తుంది
రామమందిరానికి రాయి వేస్తున్నవానికి
ఇక్కడ చెరచబడుతున్న స్త్రీల ధ్వని వినిపించడం లేదా!
కథనానికి ఉన్న శ్రుతి వాస్తవ దృశ్యానికి లేదా!
పాలిస్తున్నవాడు ఆధునికుడా! పూర్వికుడా!
అవును! తుఫాన్‌కు కూలుతున్నది గుడిసెలే కాదు,
బాల్య జీవన సౌధాలు కూడా!
ఒకనాడు మంటల్లో తగులబెట్టారు
ఇప్పుడు గుండెల మీద కుంపటి పెట్టి జీవించమంటున్నారు
అవును! వ్యక్తిత్వం భగ్నమవుతున్నచోట
జీవితానికి అర్థం ఉందా!
వారు మాట్లాడుతూనే వున్నారు
ఆ మాటలు ఎండుటాకుల్లా రాలుతున్నాయి
వ్యర్థమైన రాళ్ళ కోసం అనంత భాషను ధారపోస్తున్నారు
అందుకే! మళ్ళీ బోధి వృక్షాలు నాటండి!
అప్పుడే, మనిషిని మనిషి ప్రేమించే
మనిషిని మనిషి రక్షించే
మనిషిని మనిషి గౌరవించే
సమాజ పునర్నిర్మాణం జరుగుతుంది
పునరుజ్జీవనోద్యమం ఈనాటి చారిత్రక ధర్మం

నమ్మలేని నిజాలు

బజారుజోస్యం
బోడిగుండుకు బొట్లు
నమ్మిచెడకు
ముసురువాన
కూలిన గుడిసెలు
దెబ్బపైదెబ్బ

ఊహించనివి
జీవతాల్లో మార్పులు
కరోనయుగం
చింతన స్థితి
సాధనస్వర్గతుల్యం
మౌనంజీవార్థం
ఒకటి సున్నా
అటు ఇటు మారింది
శూన్యవేదన

- రేడియమ్
సెల్: 9291527757

నానీలు

ఆటో ఎక్కాక
తెలిసింది
మీటరు వేగానికి
బ్రేకుండదని.
అర్థంకాని
పరుసలు అయ్యాయి
ఆంటీ అంకుళ్ళు
అవతరించాక.
అందంలో అమ్మాయి
ముద్దు గులాబి

కరోన విద్యా నాశయా

కరోనా భయం ,విద్యార్థుల చదువుకు ఆటంకం.
మహమ్మారి నీడలా లోకాన్ని చుట్టేస్తుంది.
మనిషి జీవితాన్ని అధోగతిలో పడేస్తుంది.
విద్యయే బ్రతుకు తెరువుకు బాట
ఆశగా విద్యార్థి వెతుకు లాట
తరగతి గదిలో వెలుగు చూపించిన
భవితవ్యం నేడు
ఇంటి నాలుగు గోడల మధ్య
ఖైదు అయిన వైనం.
ఆన్లైన్ పాఠాలతో
సరి పెట్టుకున్న దుస్థితి
పూర్తి జ్ఞానం బోధించలేని పరిస్థితి.
అందరికి విద్య,అందు బాటులోలేని విపత్కర స్థితి.
బడుగు ,బలహీన విద్యార్థికి బహుదూరం ఆన్ లైన్.
కరోనా కాటుకు భయపడిన ఆఫ్ లైన్.
గ్రంథాలయాలు,క్రీడాలయాలు లేని క్లాసు
అయోమయం స్థితిలో పసి మనసు.
కాలం మార్పు కోసం ఎదురుచూపు.
చదువు కోసం వేసే
అడుగులు మౌనం వైపు.
ఆచరణతో కూడిన ఆలోచన
పరిణతి చూపిస్తుంది.
ఓరిమి తో కూడిన ఆరాటం
ప్రగతిని బోధిస్తుంది.

-సముద్రాల శ్రీదేవి
9949837743

కరోనా C/o పల్లెటూర్లు

రోజూ కూలీకెళ్లే అవ్వ
ఎందుకో ఈనాడు గుడిసెను విడువట్లేదు,
ఆకాశంలో పరిచిన నక్షత్రాల్లా
ఇళ్లన్నీ బీడీపీకలే
ఊరంతా కలియతిరిగే తాత ఈనాడెందుకో
ఇంట్లోనే తచ్చాడుతున్నాడు!
అపాయము వస్తుందంటే
సైరన్ లలా మోగే ఊరి కుక్కలు ఎందుకో
ఈనాడు గడ్డివాములో దాక్కున్నాయి!
బీడీలు చుట్టే ఆడవారితో నిండుగా ఉండే అరుగు
ఈనాడెందుకో వర్షం కురిసి వెలిసిన ఆకాశంలా నిశ్శబ్దంగా ఉంది!
అతివృష్టి అనావృష్టి లకు అదరని రైతన్న గుండె
ఎందుకో ఈనాడు బెదిరింది!
ఆటపాటలతో తో ఆకలి దప్పిక లెరుగని పసి మనసులు
ఈనాడెందుకో కలత చెందాయి!
ఊరి బయట రావి చెట్టు పై వాలిన కాకుల అరుపులు
ఎవరో విశిష్టత అతిథి రాకను తెలియజేస్తున్నాయి!
అదిగదిగో.. అదిగదిగో.. విశ్వమంతా
విలయతాండవం చేస్తున్న విశిష్ట అతిథి
ఏసీ బస్సుల్లో ఊపిరాడలేదేమో ఎర్ర బస్సెక్కి రానే వచ్చింది!
నిశ్శబ్దంగా ఉన్న చెరువు అద్దంపై రాళ్లవాన కురిసినట్లుగా
ప్రశాంతమైన పల్లెసీమలో అలజడి రేపింది!
మట్టి పరిమళాల పల్లె చేయి శానిటైజర్ పూతలతో రోత పడుతుంటే!
కల్మషం లేని పల్లె నవ్వుకి గుడ్డపేలుక అడ్డు పడుతుంది!
ఆత్మీయత ఆలింగనాలే
నా పల్లె మనసుకి ఆడంబరాలు!
నేడు మనిషి మనిషిని కలవలేక మనసు విప్పి ఆత్మీయంగా
మాట్లాడలేక ఎక్కి ఎక్కి ఏడుస్తుంది పల్లె!
ప్రాణం పోతుందన్న భయం కన్నా ప్రాణం లాంటి మనుషులను
కోల్పోతామేమో అన్న దిగులు వల్లే నేడు పల్లె దీనంగా కూర్చుంది..

-తోట సంజీవ్
7893297942

మాయదారి కరోనా

ఓ మాయదారి
కరోనా నీ అంతానికి మా పంతం
ప్రకటించాం నీపై పరిశుభ్రత యుద్ధం
పాటిస్తాం స్వీయ నిర్బంధనం
జనులందరికీ నీ నిర్మూలనే లక్ష్యం
నెరవేరును తప్పక మా సంకల్పం
కనబడుటలేదా వలసకూలీల దైన్యం
కరుగుటలేదా నీ కఠోర హృదయం
నీకు మాకు లేదు ప్రత్యక్ష వైరం
కనుక నీవెళ్లాలి తక్షణం
లేదు నీకు మరో మార్గం
ఓ మహమ్మారి....
నీవు నేర్పావు మా సంస్కృతుల పాఠం
భారత సాంప్రదాయాలు మరువజాలం
చేస్తాననుకున్నవా నా దేశాన్ని అల్లకల్లోలం
అది నీకెప్పటికీ అసాధ్యం
నిన్ను పారద్రోలుటే మా తక్షణ కర్తవ్యం
మరువబోము వైద్యుల,పోలీసుల సేవాగుణం
ఎంత పొగిడినా తరగదు పారిశుధ్య కార్మికుల
భాగస్వామ్యం
నిన్ను తరిమేయుటకు కలుపుతాం
కరం కరం
నిస్సహాయ స్థితిలో నీవెళ్తావు ఇది సత్యం సత్యం

– ప్రియాంక
9652717548

పాటల తూటాల్ని పేల్చిన తూనీగ-వంగపండు

వెర్రిబాగులోడి నవ్వు వెయ్యివాట్ల బల్బు వెలుగంత అన్నట్లు పలకరిస్తేనే కల్తీలేని నవ్వుతో కళ్లతోనే బదులిచ్చే జనకళాజీవి వంగపండు ప్రసాదరావు. గజ్జెకట్టి తాండవమాడే ఈ తన్మయుడికి ఉద్యమగీతాలే ఊపిరి. అర్ధ శతాబ్దం పాటు ప్రజల గుండెల్లో వేడి రగిలించిన ఆ శ్వాస ఆగష్టు 4 ఉదయం ఆగిపోయింది. ఆ మరుక్షణం నుంచే వంగపండు అశేష అభిమానుల గుండెల్లో పునరుత్థానంలా ఆయన పాటై మోగిపోతున్నారు. ఏ ప్రసార మాధ్యమాలను కదిపినా వంగపండు అస్తమయ ప్రస్థావనే. ఆయన పాటల సవ్వడే.జనం కళాకారుడి మరణం చివరి చరణం కాదనడానికి ఇంతకన్నా మరే రుజువు అవసరం లేదు. వేదికలకు, వాదనలకు దూరంగా రాష్ట్రం చివరి కొసన కదిలే తపోమునిగా బతకడం వల్లే ఆయన అందరివాడయ్యాడు. సైద్ధాంతిక తాత్త్వికత, కాలమార్పుకు సడలని భావజాల నమ్మికలకు దొరకని కారణంగా మరింత విస్తరించగలిగాడు. తన జీవన రీతిలో, యవ్వన దశలో సామాజిక పరిస్థితులకు సహజసిద్ధ కళా హృదయ స్పందనకు తోడుగా ఆ రోజుల్లో కళ్లముందే కదలాడిన శ్రీకాకుళ రైతాంగ పోరుస్ఫూర్తి కలగలిసి వంగపండును తీర్చిదిద్దాయి. అవే జనం కళాకారుడిని సమాజానికి అందించాయి.

దేశవ్యాప్తంగా వంగపండు కన్నా ఆయన పాటలే ఎక్కువగా ప్రయాణిం చాయి. 1970 నుండి గజ్జెకట్టి ఆడిపాడుతున్న ఆయన 1980లో ఓసారి హైదరాబాద్ వచ్చాడు. బహుశ అంతకన్నా ముందు నగరానికి వచ్చాడో లేదో.. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజిలో పాట ఎలా పుట్టింది అనే అంశంపై జరిగిన కార్యక్ర మానికి ఆయనను ఆహ్వానించారు. వంగ పండు, గద్దర్, అరుణోదయ రామారావు ఆనాటి వక్తలు. వారి ప్రసంగాలు చిరుపొత్తంల ప్రచురణ కాబడ్డాయి. బక్కపలచగా కార్మిక యూనిఫాంలో వేదికపైకి వచ్చిన వంగపండు ప్రసాదరావు అప్పటికి చాలామందికి తెలియదు. అయితే ఏంపిల్లడో ఎల్దమొస్తవా.. యంత్ర మెట్లా నడుస్తువుందంటే.. జజ్జనకరి జనారే.. అని ఆయన పాడుతుంటే ఆశ్చర్యపోవడం సభికులవంతైంది. ఎందుకంటే ఆ పాటల్ని గద్దర్ గొంతు ద్వారా ఎన్నోసార్లు విన్న అనుభవం వారిది. పాట పాటకు మధ్య గద్దర్ లేచి అవును ఇది వంగపండు పాటనే అని సమాధానమీయవలసి వచ్చింది. అయితే వంగపండు ఉత్తరాంధ్ర యాన. బిగపట్టిన గొంతులో ఆ పాటల అసలు రుచిని అందుకునే అవకాశం హైదరాబాదీలకు లభించింది.

అలా ఆనాడు దూరంగా వేదికపై వంగపండును చూసిన నాకు సుమారు ఓ ఏడాదిపాటు ఆయనతో కలిసి ఉండే అవకాశం లభించడం నిజంగా ఊహించని పరిణామం. 1983లో వచ్చిన విముక్తి కోసం అనే సినిమాకు వంగపండు అన్ని పాటలు రాసిపెట్టడం, ఆ సినిమాకు నేను సహాయ దర్శకుడిగా పని చేయడం వల్ల అది సాధ్యపడింది. మందడి ఉదయ్‌కుమార్ దర్శకత్వంలో ప్రస్తుత ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు దానిని నిర్మించారు. శ్రీకాకుళ రైతాంగ పోరాట నేపథ్యంలో భూషణం రాసిన తీర్పు కథ ఆధారంగా విముక్తి కోసం తయారైంది. అందువల్ల పాటలు, వంగపండుతో రాయించాలనుకున్నారు. ప్రధానంగా వంగపండు రాసిన 'ఏం పిల్లడో ఎల్ద మొత్తవా' పాటను ఈ సినిమాలో వాడుకోవాలనే దృష్టితోనే ఆ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ చిత్ర నిర్మాణాన్ని పసిగట్టిన తెలంగాణ సినిమా పెద్ద మనిషి ఒకరు. వీరి కన్నా ముందుగానే వంగపండును సంప్రదించి 'ఏం పిల్లడో' పాట తనకీయమని, ఇచ్చేసినట్టేనని మాట తీసుకున్నాడు. అలా కట్టబడిపోయిన వంగపండు 'ఏం పిల్లడో' తప్ప ఏమైనా అడగమని ఆఖరి మాటగా చెప్పాడు. దానికి బదులు **'రండిరో కూలన్న'** అనే పాట రాసిచ్చాడు. **రావణా సెందనాలో.., అమ్మా తక్కిడీ.., సువ్వీ సువ్వన్నాలు..** ఇలా మిగతా పాటలు కూడా వంగపండు రాసినవే.

అయితే. 1986లో వచ్చిన **'అర్ధరాత్రి స్వతంత్రం'** సినిమా 'ఏం పిల్లడో' పాటతో ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది. 1983లో వచ్చిన 'విముక్తి కోసం' కన్నా 'అర్ధరాత్రి స్వతంత్రం'తోనే వంగపండు సిని ప్రస్థానం మొదలైందనేలా అది చరిత్రను ప్రభావితం చేసింది.

'విముక్తి కోసం' సినిమా ఆఫీసు నల్లకుంట మార్కెట్‌లో ఉండేది. పాటల ఫైనలైజేషన్, బాణీ కూర్పుల పనిపై వంగపండు తరచుగా వచ్చేవాడు. అలా వచ్చినప్పుడల్లా అటు ఆజామాబాద్ నుండి ఇటు అంబర్‌పేట్ దాకా ఉన్న రచయితలు, పాత్రికేయులను కలిసేందుకు ఇద్దరం కలిసి ఎంత దూరమైనా నడిచి వెళ్లేవాళ్లం. హైదరాబాద్ ట్రాఫిక్‌కు, సందులకు తికమక పడి నా చేయి వదిలిపెట్టేవాడు కాదు. వచ్చిన ప్రతిసారి అంబర్‌పేట ప్రాంతంలో ఉండే కెఎన్‌వై పతంజలిని కలవడం మిస్సయ్యేదికాదు. ఆయన మరింత మందిని రప్పించి వంగపండుకు పరిచయం చేసేవారు.

1983లో ఎండకాలమంతా పార్వతీపురం దగ్గరి చినమేరంగి వద్ద సినిమా షూటింగ్ జరిగినంత కాలం వంగపండు యూనిట్‌లో ఒకరుగా గడిపారు. అక్కడ ఎవరిని పిలిచినా పేరు పక్కన గారండీ అని తగిలించడం అలవాటు. వంగపండు గారండీ అని పిలిస్తే మీరెందుకు అలా పిలుస్తారు వంగపండూ అనండి చాలు అనేవాడు. తప్పో ఒప్పో గాని హైదరాబాద్ నుండి వెళ్లిన యూనిట్ అంతా అలాగే పిలిచేవాళ్లం. తనకు ప్రసాద్‌రావు అని ఎలా పెట్టారో గాని 'రావు' అన్న తోక అవసరం లేదని చెప్పేవాడు. సినిమా క్రెడిట్స్‌లో వంగపండు ప్రసాద్ అని వేయమంటాను అన్నారుగాని ఆయనకి తెలియకుండానే 'రావు' పడిపోయింది.

వెర్రిబాగులోడి నవ్వు వెయ్యివాట్ల బల్బు వెలుగంత అన్నట్లు పలకరిస్తేనే కల్తీలేని నవ్వుతో కళ్లతోనే బదులిచ్చే జనకళాజీవి

– బి. నర్సన్
సెల్: 9440128169

నా గుర్తుకు తిరిగి వంగపండు 2016లో హైదరాబాద్ వార్తల్లో కనబడ్డాడు. ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ నిర్వహణలో ఏటా బహూకరిస్తున్న సుద్దాల హన్మంతు-జానకమ్మ జాతీయ పురస్కారం ఆ యేడు వంగపండు ప్రసాదరావుకు ఇచ్చి సత్కరించబడడం జరిగింది. ఆ సందర్భంగా నేను ఓ పత్రికలో రాసిన వ్యాసాన్ని విశాఖ మిత్రుల ద్వారా తెలుసుకొని ఫోను చేసి మాట్లాడారు. 33 ఏళ్ల విశాఖ మిత్రుల ద్వారా తెలుసుకొని సంగతులను పిల్లాడిలా మననం చేసుకుంటూ పంచుకున్నారు.

ప్రసార మాధ్యమాల్లోకి చొచ్చుకురాని వంగపండును ఏప్రిల్‌లో కరోనాపై ప్రజాగాయకుల ప్రతిస్పందనగా ఓ టీవీఛానల్ పలకరించి ప్రసారం చేసింది. ఆ సందర్భంగా ఆయన పదే పదే గానం చేసిన 'జజ్జనకరి కరోనా' ఇంకా స్మృతి పథంలోనే ఉంది.

77 ఏళ్ల జీవనయానంలో ఆయన 50 ఏళ్లకుపైగా ప్రజాకళల వెంటే ఉన్నారు. కూతురు ఉషను తన స్థానంలో తీర్చిదిద్దారు. 1943లో విజయనగరం జిల్లాలోని పెదబండపల్లిలో జన్మించిన వంగపండు తిరిగి అక్కడే తన ఇంట తుది శ్వాస విడిచారు.ఆయన వెంట నడిచిన ఉద్యమం ఏ ఏమలుపులు తీసుకున్నా, తెలిసీ తెలియని రాజకీయ మలుపుల్లో వంగపండు చిక్కుబడినా **'దద్దరిల్లే గాన దృశ్యం'**గా ఆయనెప్పుడో జనం గుండెల్లో నిలిచి ఉంటాడు.తమ స్థానాన్ని మరొకరు పూడ్చలేని స్థాయికి ఎదగడమే కళాకారుల ప్రతిష్టకు చిహ్నం. వారే చరిత్రకు ముద్దుబిడ్డలవుతారు. ఆ క్రమంలో తన ఆసనాన్ని సుస్థిరం చేసుకుని లోకాన్ని వీడినవాడే వంగపండు.

ఎరుపెక్కిన పాట

పాణి గ్రాహి నిజవారసుడిగా
తూరుపు పవనపు హోరు గాలివై
ఉత్తరాంధ్ర జనజీవన గొంతువై
వసంత కాలపు మేఘ ఘర్జనలా
ఘల్లున మోగే పీడితజన
పాట కాలి గజ్జెలుగా
తెలుగు గుండెలను కదిలించిన
జన వాగ్గేయకారుడా.. అమరుడా
వంగ పండూ..నీకు మరణం లేదు
ఇక్కడి గద్దర్, గోరటి వెంకన్నలలా
జనం గుండె లయను ఒడిసిపట్టి
అల్లిన నీ పాటను, ఆటను చూసి
మురిసిన విశాఖ సంద్రం
నిన్ను ఎగసి ముద్దాడాలని తరంగమై
ఎన్నెన్ని సార్లు పొంగి పొరలిందో
యంత్రమెట్లా నడుస్తుందో
నీవు విప్పిచెప్పేదాక మర్మమేమిటో
తెలుసుకోలేక పోయాం
సికాకులం సీమకొండల్లో
సాలూరవతల సవర్ల కొండల్లో
నల్లగొండ నట్టడివిలో
పులుల్ని తినే మేకలున్నవని
కత్తులు దులపరించే చిలుకలున్నాయని
పాములను చంపే చీమలున్నాయని
పామర జనానికి నీ పాటతో
దిటవు నింపి పోరాటానికి
సన్నద్ధం చేసిన కళా యోధుడివి
నీ ఒక్క పాటే చాలు
వేల కవులెందుకన్న
మహాకవి మాట ఎంత నిజమో
ఆకాశంలో అరుణ బింబంలా
అలలా జనాలకు అండ దండలా
ఎరుపెక్కిన నీ పాట, నీ ఆట
సదా రెప రెపలాడుతూ ఉంటుందిలే
(అమరుడు కామ్రేడ్ వంగపండు స్మృతిలో)

-డా. కె. దివాకరా చారి
9391018972

లక్ష కన్నీటి బొట్లు

బాధగా ఉన్నా ఇది పీడికల కాదు
చేదుగా ఉన్నా ఇది పాడుకల కాదు
అద్దం లాంటి విశాల రోడ్లు
అకాశాన్ని తాకే భవనాలు
ఆహో! ఎన్ని భోగాలు..

ఇప్పుడు అమెరికా అంటు రోగాలు
పిల్లల్ని కోల్పోయని తల్లుల
తల్లుల్ని కోల్పోయిన పిల్లల విలాపరాగాలు-
వైభవం వెనుక వెతలు
వినోదం చాటున కథలు-
సంపన్నుల లోకంలో శోకం
హడావుడి అడుగులకే ప్రాధాన్యమా
కనీస పరిజ్ఞానం కొరవడి విచ్చలవిడి
విహారాలకే ప్రాముఖ్యమా
మందిలో నిషేదాంక్షల్ని పకడ్బందీగా
పాటించకపోవడమే శాపమా
సమర్థంగా ఎదుర్కొనే శక్తి ఉన్నా సడలింపులే నేరమా
ఏమైతేనేం!
లక్ష కన్నీటిబొట్లు రాల్చింది-
ఆపన్నహస్తం గతం
ప్రస్తుతం సతమతం.

-కోటం చంద్రశేఖర్
సెల్: 8331043826

మద్యము మత్తుకి మనిషి చిక్కేనా?

సప్త వ్యసనాల్లో ఒకటి
మద్యాన్ని సేవించడము
సర్వ దరిద్రానికి మూలం
దాని దరి చేరడము-
తెలిసి తెలిసి మనిషి దాన్ని చేరుతున్నాడా?
తెలియక మద్యం ఉచ్చులో పడుతున్నాడా?

మద్యం త్రాగడమంటే
మండుతున్న విషాన్ని త్రాగడమే
విషమనేది ఒకేసారి చంపుతుంది
మద్యపానము విషము ప్రతిసారి చంపుతుంది

ప్రకాశవంతమైన మనుజుల శరీరానికి
మద్యం మత్తును అలవాటు చేస్తే
ఆ మత్తులేక మనిషి బ్రతకలేడు
ఆ మత్తుకై ఎంతటి దారుణానికైనా
ఎంతటి ఋణానికైనా వెనకాడడు
జూదం మత్తులో ధర్మరాజు అన్నతమ్ములను
భార్యను పందెంకాస్తే
మద్యం మత్తుకై మనిషి తలనరుకుతాడు

కరోనా ఘాటు రోగము
జడలు విప్పి కరాళ నృత్యము చేసే వేళ
వైనుషాపులు వద్ద
మందుబాబులు వరసతీరు
రోడ్డునంటుకొని వదలని తారులా
తుమ్మచెట్టుకు అంటుకున్న బంకలా
వదలకుండా కనబడుతుంది
లాక్ డౌన్ సడలింపు సమయాన
ఒక్కరోజులోనే రాష్ట్రాలల్లో
మద్యం ఏరులై ప్రవహించు తీరుచూస్తే
మద్యానికి మనిషి చిక్కేనా అని అన్పిస్తుంది

దుష్టకారిని,దుఃఖకారిని అయిన
మద్యపాన నిషేదము సంపూర్ణముకానప్పుడు
ప్రభుత్వ ఆదాయము మాటెలాగున్నా,
మనిషి జీవితము అసంపూర్ణమే
మద్యం మత్తుకి మనిషి చిక్కకుండా వుండాలంటే
మద్యమనేది లేకుండా చేయడమే తరుణోపాయము
ఆరోగ్యమైన సమాజానికి ,
మనిషి శ్రేయస్సుకి
నవోదయము

– విశ్వనాధ నరసింహం
సెల్: 9490971589

మొబైల్ మొహం

మొబైల్ స్క్రీన్ మొహం మీద
ముని వ్రేళ్ళు అనే పెదాలతో
ఎంత గాఢంగా ముద్దెట్టుకున్నా
తనివి తీరదం లేదు!
ఓ చరవాణీ!
పొద్దున్నే లేచింది మొదలు
రాత్రెప్పుడో నిద్రకు ఉపక్రమించే వరకూ
కాలాన్నంతా గుప్పెట్లో బంధించి
నియంత్రిస్తున్నావు!
నువ్వంటే
ఎంత ప్రేమ!
ఎంత ధైర్యం!
ఎంత బలహీనత!
నిన్ను వదలి
ఒక్క క్షణం కూడా ఉండలేని
దయనీయ పరిస్థితి!
ఈ కరోనా కష్టకాలంలో
స్వయం నియంత్రణలో
బంధీకృతుడైన సగటు మనిషికి
అసలు సిసలైన నేస్తానివి!
నీ శక్తి ఎంత గొప్పదో
అర్థమైపోయింది!
ఇంట్లో జరిగే
శుభాశుభాలకూ
నీ వల్ల పరిష్కార మార్గం దొరుకుతుంది!
నువ్వు ముందుంటే
అన్నింటికి
స్పందించాల్సిన
అవసరం లేదుగా!!

– దా॥ దాశరథుల నర్సయ్య
సెల్: 9390919100

ముసుగు భారతం

అంటు పురుగేదో పగబట్టి
ఆరోగ్య వస్త్రం లాగుతుంటే
శ్రీకృష్ణ పరమాత్మలా ఓ నూలు పోగు
ఆదరిస్తుందని కలగన్నామా!

తుంపర సైనిక బలంతో
తెగబడే అలెగ్జాండరంతటి మహమ్మారిని
పురుషోత్తముడై ఎదిరించే
పోరాట యోధుడొక మాస్క్ అవుతాడని
చరిత్రనెపుడైనా శంకించామా!

పెళ్ళి పీఠలపై వధూవరుల మధ్య
దోబూచులాడే సిగ్గుదొంతెర
లోక కల్యాణానికి నాంది పలుకుతుందని
అన్యమనస్కంగానైనా అనుకున్నామా!

పేదవాని మొలకు వేలాడే
మూరెడు గోచి గుడ్డకూ ఓ రోజొచ్చి
మహరాజు మూతిని సైతం ఆక్రమించి
సమానత్వం చాటుతుందని ఊహించామా!

వంటింటి కర్మాగారంలో
ఒళ్ళు వంచి కష్టించే చింపిరి మసిపీలిక
ముస్తాబై మూతి వాహనమెక్కి
రొమ్ము విరుచుకుని రోడ్డెక్కుతుందని
ఎక్కిసానికైనా నవ్వుకున్నామా!

దేశ సేవ చేయడానికి
మహాత్ములే కానక్కర్లేదు
మనసున్న తుండు ముక్కైనా సరిపోతుంది.

-నల్లు రమేష్
9989765095

కీడు మూడుతుంది

కరోనా వచ్చింది
కాలనాగై కాటు వేస్తుంది
ముక్కు మూతికి
మాస్కు మంచిగా కట్టు
మూడు మూరల దూరం
ఉండి మాట్లాడు
బయటకు పోయి
వచ్చావంటే
సబ్బుతో చేతులు రుద్ది
శుభ్రంగా నీటితో కడుగు
అజాగ్రత్తగా ఉన్నావంటే
అనర్థం జరుగుతుంది
ఇంటిల్లిపాదికి
కీడు మూడుతుంది
ఆప్తులందరికి నీవు
దూరమైపోతావు
కుటుంబం మంతా
కుప్పకూలిపోతుంది
ఆపైన వారి బ్రతుకు
వీధిలో పడుతుంది
కుటుంబ సభ్యుల
జీవితమంతా
కుక్కలు చింపిన
ఇస్తారవుతుంది

-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

కరోనా హైకూలు

క్రిమి తాండవం
కంపిస్తున్న జీవనం
విశ్వ పటంలో.

బతుకు చెడి
కరోనా బాటసారి
వలస కూలీ.

కరోనా భయం
జీవితకాలం పోరు
కాటేస్తుందని

లాక్ డౌన్ మంత్రం
కొత్త ఊపిరిచ్చింది
స్వచ్ఛగాలికి

మహనీయమే!
లాక్ డౌన్‌లో సేవలు
మీకు మా సలాం!!

రక్షా కవచం
కరోనా యుద్ధానికి
పిపీఇ కిట్టు

అన్నీ దూరమే
కవిత్వం దగ్గరైంది
విషక్రిమికి.

-డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి
9849331554

శబ్ద శిల్పాలు

చావు పుట్టుకకు ఒకటే తేడా
పుట్టినప్పుడు తాను ఏడుస్తాడు
గిట్టినప్పుడు తనవాళ్ళందరినీ ఏడ్పిస్తాడు.

'నా' వాళ్ళే అనుకుంటే అదొక ఆస్తి
'నా' వాళ్ళు లేకుంటే అంతా నాస్తి.

ప్రతి నాయకుడూ
ప్రతినాయకుడు కావచ్చు
కానీ,
ప్రతి నాయకుడు
ప్రజా నాయకుడు కాలేడు.

– దా॥పోరెడ్డి రంగయ్య
సెల్: 9948049864

పదనిసలు

ప్రవహిస్తేనే
నదికి నవ్యత,
పయనిస్తూ వెళ్తేనే
మనిషికి ప్రపంచంతో పరిచయం.
విశ్వం ఎంతో విశాలం
సూక్ష్మం మనిషి పరిమాణం.
ఇంకా చిన్నది జీవితం
జీవించేది ఒక్కసారే.
పయనించు
గడప దాటి, ఊరు వదలి
పరిశోధించు
ప్రకృతిని ఆసాంతం.
పరుగెత్తుతూ కాదు
పడిపోయినా
మళ్ళీ మళ్ళీ లేస్తూ.

– ఆచార్య కడారు వీరారెడ్డి
9392447007

"దా.నా."పదాలు

నడిరేయిలో నారి
నడచివచ్చిన దారి
నిర్భయానికి సవారి
ఓ చిన్ని"దా.నా."!

ఆటవెలదుల నుదుట
తిలకమిడినాడనుట
వేమన్న ఘనుడంట
ఓ చిన్ని"దా.నా."!

తెనుగు సాహితి"శ్రీ"లు
శ్రీశ్రీ దె చేవ్రాలు
విప్లవానికి ప్రోలు
ఓ చిన్ని "దా.నా."!

అన్నమయ్య కృతులు
వేంకటేశుని శృతులు
హృదయ పేటిని స్మృతులు
ఓ చిన్ని"దా.నా."!

మంచెనెక్కినవాడు
మంచమెక్కిననాడు
జాతికందునెకూడు?
ఓ చిన్ని "దా.నా."!

ఇంట కనకము యున్న
వెంట శునకముయున్న
వెరవు యుండదు కన్న
ఓ చిన్ని "దా.నా."!

ఇసుక మేసిన వాడు
ఇలకు తెచ్చును కీడు
పూడ్చబడునే వాడు!?!
ఓ చిన్ని "దా.నా."!

-కిలపర్తి దాలినాయుడు
7780589336

నేటి నిజం

భారమైన బతుకుబాటలో
బతుకుతెరువు పాట్లు... అనివార్యం
జీవన యానంలో
గాయపరుస్తున్న ఆకలిముళ్ళు.. కొచ్చపెడ్తుంటాయి
చుట్టుకుబడ్డ దేహాలైనా.. దివ్యాంగుల దేహాలైనా
చైతన్యస్ఫూర్తితో బతుకీడ్చటం
ఆ బతుకుబండిని.. బాధ్యతగా నడిపించడం
అందరికీ ఆదర్శమే...!

- కెరె జగదీష్

అంగడి

అక్కడ అరొక్కటి దొరుకది
వారానికి ఒక్కరోజే జరుగుతది
అదేనండి..
చుట్టుపక్కల పల్లెలన్నింటికి
నిత్యావసర సరుకులను
ఒకేచోట
అగ్గువకే అందించే అంగడి..

సంతలో దూరామంటే
సంచి సవరించుకొని
పర్సు పదిలపర్చుకొని
దృష్టి మరల్చకుండా
చెవులు నిక్కించుకొని
చాకచక్యంతో సాగాల్సిందే..

భీకర స్వరం
బేరమాడే చాతుర్యం
బహుభాషా నైపుణ్యం
తమ సొంతమైతే
పర్సు ఖాళీకాకముందే
సంచిలోని సరుకు
బరువెక్కుతది
పద్మవ్యూహాన్ని ఛేదించిన
విజయునిలా
త్వరగా ఇంటిముఖం పడ్తరు...

-బస్వ రాజ్ కుమార్
9392006080

నిఘా నేత్రం

తన పని చిత్రీకరణ
అపాదలో సాక్షి
పోలీస్ వారి కి మైత్రి
ఎన్నో కచ్చితమైన కేసుల పారిష్కారం
అంతు చిక్కని వాటికి
చిక్కించే ఒక యంత్రం
మోసగాళ్ల కేటుగాళ్ల
దొంగల భరతం పట్టే
ఒక నేత్రం
కనుల నిండా కనుమూయక
గల్లీ ప్రజల ఆస్తులు
మనప్రాణాల సురక్షి
మంచి కి ప్రేరణ
చెడు చెం దాడీ
తన పరిమితుల్లో ప్రాణం లేని యంత్రం అయిన
ప్రాణమున్న జీవుల రక్షనే
తపన తాపత్రయం
చోరుల పాలిట సింహస్వప్నం
న్యాయస్థానం కు సజీవమైన సాక్ష్యం
తనుదాన్నే వాడు ఒకడు ఉంటే
నిన్ను తన్నేవాడు నిఘా నేత్రం
ట్రాఫిక్ తప్పిదం అయిన
వేగంగా నడిపి ప్రాణాలు తీసి పారిపోయిన
చివరకు నీ బీరువా అయిన..
దేవుని హుండీ అయిన రక్ష నీఘానేత్రం
ఉంటే ఎంతో ధీమా
అందుకే గల్లీ గల్లీ ఒకటవండి
నన్ను ప్రేమతో పెట్టించండి
మీరు కంటి నిండా నిద్రపోండి
నా నేత్రాలు మీ రక్షకై
సురక్ష తదస్తూ.

- ఉమశేషారావు
9440408080

మరపురాని బంధం

కుల రొచ్చుకు అంటనిది
మత ఘర్షణల్లో మండనిది
స్వార్థానికి అందనిది
త్యాగానికి వెనుకాడనిది స్నేహబంధం,

వాడిన పువ్వు, ఎండిన ఆకు
పండిన పండు రాలి పోవచ్చు
నమ్మకంతో ఏర్పడిన స్నేహబంధం
మహ వృక్షమై నీడ నిస్తుంది

సముద్రంలో కెరటాలు ఎన్నున్నా
తీరం చేరే అలలు కొన్నే
సుఖాల్లో ఎందరు వున్నా
కష్టాల్లో కడదాకా నిలిచే వాడు స్నేహితుడు.

రక్త సంబంధాలు,ఋణాను బంధాలు
వెన్నుపోటుతో కత్తులు దూస్తుంటాయి
నమ్మిన స్నేహితులు చెడ్డవారైనా
గుణపాఠం అనుభవంగా అందిస్తాడు.

సమస్యల సుడిగుండంలో చిక్కి
కష్టాల కారుమబ్బుల్లో కాలుతున్నప్పుడు
ఆక్సిజన్ లా ఊపిరి అందించేవాడు,చచ్చినా
అమరుడై కలకాలం వెలుగుతూ ఉంటాడు
అదే మరపురాని స్నేహబంధం

- టీవీ రెడ్డి
73828 63523

భరోసావాక్యం

ఉదయాన్ని ,
స్వీయరక్షణ ఉద్యానవనం చేసుకుందాం ఆరోగ్యపరిమళాలతో
మిగితాదినాన్ని తేలికగా ఏలుకుందాం...!
సూర్యునికన్నా ముందే నిద్రలేచి
నడకకు రమ్మని అతన్నే పిలుద్దాం.. నమస్కారాలతో కొలుద్దాం..!
నీరెండను స్నానం గా పూసుకొని
విటమిన్‌డి ని ఇంకాయింకా మనలోకి యింకించుకుందాం,
ప్రాణాయామంలోనే ప్రాణమున్నది కదా
ప్రాణం నిల్పుకోడానికి
దాన్ని ప్రాణంగా స్వీకరించలేమా?
ఆసనాలచింతబరిగెవట్టుకొంటే
ఎంత బద్ధకమైనశరీరమైనా
బుద్ధిగా చెప్పినట్టు వినదా?
రకరకాల ఆసనాలుగా మనం ఒదిగిపోతుంటే
తేలికవుతున్న మనదేహం అనేక అనారోగ్యసందేహాలకు
సమాధానాల సందేశం అందించడం మనమే చూస్తాం!
భూగోళం మీద నీటిశాతం ఎక్కువ
నేలశాతం తక్కువనట..
మరి మనకడుపు ఒక భూగోళమే ..
వేన్నీళ్ళో చన్నీళ్ళో పొద్దున్నే పొట్టకు గట్టిగా పట్టిద్దాం..!
అన్నీ అయ్యాక
అల్లంఛాయి తో పాటు మంచిమంచి
కవితలు సేవిస్తూ..
ప్రతిఉదయానికొక నిండుదనమిద్దాం ..
నిండుఆరోగ్యజీవితానికి ఏరోజుకారోజు
ఒక భరోసావాక్యాన్ని కానుకగా రాసిద్దాం!

- డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

మధుర జ్ఞాపకాలు

మానవజీవనంలోమధురమైన
తీయనిఛాయాచిత్రములు
జ్ఞాపకాలుహృదయపుగదిలో
భద్రంగామనసుతాళంవేసి
నిలిపిన కదిలే బొమ్మలు

మనమెంతదూరములోనున్న
అవికన్నులముందుకు కదలాడుతున్నట్టుగా
చెదరని మరిచిపోని
నేస్తాలుగామిగిలిపోతాయి

అనుభవాలచిత్రాలు
అంతమువరకునిలచిపోతాయి
ప్రకృతిరమణీయ చిత్రరాజసము
సోయగాలసంబరాలు

జీవనసమరంలోవిలువైన
చిత్రపటములను
గుండెగూటిలోదాచుకొని
పదిలముగాచూసిఆదరించిన
ఆచంద్రార్కముగానిలచి
మధురజ్ఞాపకాల పొదిలో
చెదరనిశిల్పాలుగాచెక్కబడి
రంగులస్వప్నాలరంజింపజేస్తాయి

-మిట్టపల్లి పరశురాములు
9949144820

వారసత్వ సంపద

కాగితాలు లేని కాలమ్ములో తాటి
యాకుపైన వ్రాసిఅక్షరాలు
పుస్తకాల జేసి పూర్వ కవులు వార
సత్వ సంపదగ నొసంగి చనిరి!

చాల లభ్యమయ్యెతాళపత్ర గ్రంథ
ములు,లభించనవియు గలవు పెక్కు;
కాలగర్భమందు కలసిపోయిన పుస్త
కముల సంఖ్య లెక్కగట్ట వశమె?

దొరకియున్నవైన త్వరితగతిని అచ్చు
పడుట జరుగకుండె;వాస్తవమున
వ్యక్తులకు నసాధ్యమౌ నిది,సర్కారు
శ్రద్ధ చూపెనేని సాధ్యపడును!

లాభనష్టములను లక్షించకుండ చే
పట్టుచుండవలయు నిట్టి పనులు;
కాలయాపనమున గలుగు నష్టము పూడ్చు
కొనుట యెన్నటికిని కుదురబోదు!

పాత వ్రాతలందు భారతాదుల వంటి
విలువ గలుగు గ్రంథములు మరెన్నొ
దొరకవచ్చునేమొ,పరికించవలె,సేక
కించ పండితులుశ్రమించ వలయు!

కష్టపడి రచించి గ్రంథాలు పెక్కుల
పూర్వ విషయములను పొందుపరచి
పూర్వ కవు లొసంగిపోయినా,రవ్వాని
చదువుకొనుటె నేడు కుదురకుండె!

-హెచ్.ఆర్.చంద్రం.
9493248053

ఆ రోజులు కావాలి నాకు

ఆ రోజులు కావాలి నాకు...
ముసుగు తన్ని నిదరోతున్న నాకు
తెల్లారితే ఆదివారమని తెలిసి
లోలోపలే నవ్వుకున్న
ఆ రోజులు కావాలి నాకు...

పతంగులాటకై
గాజుముక్కలు, అన్నం ముద్ద,పసుపు నూరి
కరంటు పొళ్లకు దారం కట్టి
మాంజా తయారు చేసిన
ఆ రోజులు కావాలి నాకు...

దొంగతనాన కోసిన మామిడికాయలు
తోటమాలి కంట్లో పడి తీసిన పరుగులు
తలుపు వెనకాల దాక్కొని
భయంతో చూస్తున్న చూపులు
ఆ రోజులు కావాలి నాకు...

రేస్ ఆటలో అంగీలు మార్చి
దొంగగా వచ్చిన దోస్తును ఏమార్చి
చీకట్లో కుక్కపిల్లల్లా ఒకరిపై ఒకరు నక్కి
ఆహా...!
ఆ రోజులు కావాలి నాకు...

టేలాల పొంట తిరుగుతూ
సిగరెట్ డబ్బాలు ఏరుకుంటూ
కూల్ డ్రింక్ దక్కేన్లు జేబులో నింపుకుంటూ
పత్తాలు డిక్కీలాటలాడుకున్న
ఆ రోజులు కావాలి నాకు...

అజ్గారలీ డబ్బా మూతలే
తూకపు పళ్లాలుగా
వేప కాయలే
తూకపు రాళ్లుగా
కూరగాయల దుకాణం పెట్టిన
ఆ రోజులు కావాలి నాకు...

గిల్లి దండాటలో
ఫైబుల్ కొట్టి
పిన్నీసుతో అడుగులు లెక్కించిన
ఆ రోజులు కావాలి నాకు...

రెండు దారాలు కలిపి
తొడమీద పేని
బొంగురాలాడిన
ఆ రోజులు కావాలి నాకు...

సుట్టం తెచ్చిన సైకిలు
అమ్మ కళ్ళతో చేసిన సైగలు
దొంగతనంగా తీసుకెళ్లి
కైంచీ తొక్కిన ఆనందాలు
ఆ రోజులు కావాలి నాకు...

దెబ్బల చెండాటలో
కమిలిన వీపు
అమ్మకు తెలియకుండా
అద్దంలో చూసుకున్న వాపు
చాటుగా పొదరు రాసుకున్న టైపు
ఆ రోజులు కావాలి నాకు...

ఆటలో గెలుచుకున్న గోళీలు
రోజుకు పదిసార్లు లెక్కపెట్టుకున్న తీరు
బాపు కంట పడకుండా వేసిన దోరు
ఆ రోజులు కావాలి నాకు...

పెండింగు హోం వర్కును అమ్మతో చెప్పించి
లేని మీసాలు తిప్పుకుంటూ
అక్కతో రాయించి
రాత మారిందని
సారు బెత్తంతో చూసిన తన్నుల రుచి
ఆ రోజులు కావాలి నాకు...

ఆదివారం గడిచి
తెల్లవారి స్కూలుందని తెలిసి
లేని కడుపునొప్పిని పిలిచి
బడికి ఎగనామం పెట్టి
ఆ మర్నాడు స్కూలు
వెన్నులో పుట్టిన వణుకు
ఆ రోజులు కావాలి నాకు...

- మాధవ్ గుర్రాల
94926 48887

సెల్లు సోది ముచ్చట్లు

సెల్లుతోనే ధ్యాస
అది లేకుంటే ఆడదు శ్వాస
సోది ముచ్చట్లలో ఉండదు పస
అర్థమవదు సెల్లు పిచ్చోళ్ళ బాస
చరవాణి చేసింది నిదుర కరువు
ఇల్లు లేకున్నా సెల్లు ఉండాలని
రకరకాలుగా రూపాంతరం చెంది
అదే లోకమైపోయింది
అవసరముకై సృష్టించిన సెల్లు
అత్యవసరంగా
మార్చుకుంది మనమే
శక్తివంతమైన యువతా..
చరవాణితోనేనా బతుకు
మరోమార్గం వెతుకు.....
ప్రపంచం సెల్లుతోనే కాదు
సమాజంతో కూడా...

- ప్రియాంక
9652717548

నానీలు

బంధాలు
వీడని సుగంధాలు
అనుబంధాలు
అల్లుకొనే లతలు

కాలంతో
పరుగు పందెం
విజయాలు
వెలుగు కిరణాల్లా వెన్నంటే !

అమ్మ ప్రేమను
నిర్వచించాలా?
వెన్నెల చల్లదనమని
వేరే చెప్పాలా?

నాన్న ఆప్యాయత
గుర్తించరేం?
అవునులే!
నీడను పట్టించుకొనేదెవరు?

పిల్లలపై ప్రేమ
చద్దిమూట
అపురూపంగా
ఆస్వాదించాల్సిందే!

-యలమర్తి అనూరాధ
9247260206

కుబుసం విడవాల్సిందే !

నవ్వులు, పువ్వులు..
నీ ప్రాణ సమానమైతే..
జీవితం అనుక్షణం..
పరమానంద భరితమేగా !

కుబుస వస్త్ర త్యాగమే..
పాముకు పునర్జన్మ నిచ్చేది.
సోమరితనాన్ని విదిల్చితేనేగా..
చైతన్య శక్తి పొంగి పొర్లేది !

శరీర భాగాలైననూ గోళ్లను..
వ్యర్థమని నిర్ధయగా నరకేయాల్సిందే.
మదిలో మసి ఆలోచనలు తిష్టవేస్తే..
మంట బెట్టి బుగ్గిపాలు చేయాల్సిందే !

గిన్నెకు మసి పడుతుందని...
వంటను, మంటను మానేస్తామా.
విఫలమైతామనే భీతితో..
విజయపథం వీడుతామా !

అగరుబత్తికి అగ్గి తగిలితేనేగా..
సుగంధ పరిమళాలు వ్యాపించేది.
కండరాలను పిండితేనే కదా..
సాఫల్య పుష్పల పంటలు పండేది !

గొడ్డలి గాటుకే కదా...
మేడి పాల ఔషధం కారేది.
కార్యసిద్ధికి ఉపక్రమిస్తేనే కదా..
శ్రమ స్వేద సువాసనలు పారేది !

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

గుర్తింపు (కథ)

మహిళామండలి సమావేశం మొదలైంది. సభ్యులందరూ నిర్దేశిత స్థానాలలో ఆశీనులై ఈ అత్యవసర సమావేశానికి కారణమేమిటో తెలియక గుమ్ముచిమ్మాలు పడుతున్నారు. అధ్యక్షురాలు భార్గవి ముఖం గంభీరంగా ఉంది. ఆమె దీక్షగా తన చేతిలోని కాగితం వైపే చూస్తోంది.

'అదేమిటో, ఆవిడెందుకలా ఉన్నారో?' ఒక సభ్యురాలి స్వగతం.

అందరూ భార్గవి ఏం చెప్తుందో అని ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

నిశ్శబ్దాన్ని ఛేధిస్తూ, గొంతు సవరించుకుని 'మిత్రులారా మనం ఇంత త్వరలో మళ్ళీ ఇలా కలుసుకోవడానికి కారణం ఈ ఉత్తరం' అంది చేతిలోని కాగితాన్ని చూపిస్తూ.

"ఎవరి దగ్గరనుంచి? ఏమిటీ విషయం?" మండలి కోశాధికారిణి కళ్యాణి ప్రశ్న

"చదువుతాను వినండి.....

"అమ్మా! మీరు, మీ సంస్థ ద్వారా సమాజానికి ఎన్నో సేవలు అందిస్తున్నారని విని నాకు కూడా న్యాయం చేయగలరని ఆశిస్తూ ఈ ఉత్తరం రాస్తున్నాను. నేను పుట్టుకతో ఒక అబ్బాయిని. కానీ పెద్దవుతున్న కొలదీ అమ్మాయిలా బ్రతకాలన్న కోరిక ఎక్కువైంది. నా సమస్య ఇప్పుడు మీకు అర్థమైందనుకుంటాను. పెద్ద చదువు చదువుకుని, ఉద్యోగం చేసుకుంటూ, హిజ్రాగా కాకుండా సమాజంలో అమ్మాయిగా గుర్తింపబడి, గౌరవంగా బ్రతకాలని ఉంది.

కానీ అందుకు ఈ సమాజం సహకరిస్తుందా? మాపట్ల సమాజం వ్యవహరించే తీరు మీకు తెలియనిది కాదు. మాలో ఎందరిదో బిచ్చమెత్తుకుంటేగానీ ఒక్కపూట తిండికి నోచుకోని దుస్థితి. మావంటివారి జీవిత పుష్పాలెన్నో విరియక ముందే స్వార్థపరుల చేతులలో నలిగి రాలిపోతున్నాయి. ఇవి రెండే మాకు జీవనాధార వృత్తుల్లా పరిగణింపబడుతున్నాయి. కానీ నాకలా అవ్వాలని లేదు. నేనేం తప్పు చేసానని అటువంటి దుస్థితిలో బ్రతకాలి?

సమాజంలో కొందరు ఘోరమైన నేరాలు చేస్తూ, చట్టాన్ని తమ చేతులలో కీలుబొమ్మని చేసి ఆడిస్తూ, శిక్షలనుంచి తప్పించుకుంటూ దొరబాబుల్లా చెలామణి అవుతుంటే నేనెందుకు తప్పుచేసిన వ్యక్తిలా తిరగాలి? నాకెందుకు గౌరవంగా బ్రతికే అవకాశం ఉండకూడదు? నావన్నీ సమాధానం లేని ప్రశ్నలు అని నాకు తెలుసు. కనుకనే నేను బాగా చదువుకుని నావంటి వాళ్ళకోసం న్యాయ పోరాటం చేసి వారికి సమాజంలో గుర్తింపు కలిగించాలని ఆశిస్తున్నాను. కానీ అందుకు ముందు నాకొక గుర్తింపు కావాలి. అందుకు మీ సహాయం అర్థిస్తున్నాను. మీ సహకరం కోసం ఎదురుచూస్తూ.....

నమస్కారాలు....."

కల్పన

చదవడం ముగించి సభ్యులకేసి సాలోచనగా చూసింది భార్గవి.

గదిలో ఇబ్బందికరమైన నిశ్శబ్దం అలుముకుంది.

ముందుగా తేరుకుని "అయితే ఇప్పుడు మనమేం చేయాలి?" అడిగింది ఉపాధ్యక్షురాలు దీపిక

"మీ అభిప్రాయాలు తెలుసుకోవడానికే ఈ అత్యవసర సమావేశం పిలిచాను" భార్గవి సమాధానం

"కానీ ఇలాంటి వాళ్ళకోసం కాదుగా మనం సంస్థ నడుపుతున్నది?" గౌతమి ఉవాచ

"వాళ్ళూ మనుషులే కదా?" సరళ సానుభూతి

"అయినా మనకెందుకు బాబూ! పైగా మావారు ఒప్పుకోరు" శాంతి భయం

"అలాంటి వ్యక్తికి సహకరిస్తే మన సంస్థ పరపతి కూడా పెరిగే అవకాశముంది కదా'" క్రాంతిలో ఉత్సాహం

"క్రాంతీ ఏది చేసినా ఒక లక్ష్యం తో నిరాపేక్షగా చేయాలనేది మన సంస్థ సిద్ధాంతం అని నీకు తెలుసుగా! ఇక్కడ మన గుర్తింపు కంటే మనపై అత్యంత నమ్మకం ఉంచిన వ్యక్తికి గుర్తింపు కలిగేలా చూడడం మన ప్రథమ బాధ్యత అని గుర్తుంచుకుంటే మంచిది" సున్నితంగా మందలించింది భార్గవి.

ఇలా సహాయం చేద్దామని కొందరూ, వద్దని కొందరూ అంటే మిగిలినవారు అసలు నోరు విప్పలేదు.

అప్పుడు "మేడం నాకొక ఆలోచన వచ్చింది. ఈ వ్యక్తికి సహాయపడాలా వద్దా అనేది మనం ఓటింగ్ ద్వారా నిర్ణయిస్తేనో? మెజారిటీని బట్టి ఏంచేయాలో ఆలోచిద్దాము'' సూచించింది మహిళామండలి కార్యదర్శి ప్రతిమ.

భార్గవితో సహా అందరికీ ఆ ఆలోచన నచ్చింది. ఓటింగ్ జరిగింది. ముందు మాట్లాడనివారు కూడా ఓటింగ్ లో పాల్గొనడం భార్గవికి సంతోషం కలిగించింది. అవునుకీ కాదుకీ సమానంగా ఓట్లు పడ్డాయి.

"మేడం ఇక మీ నిర్ణయానికి కట్టుబడి ఉంటాము" సభ్యులందరూ ముక్తకంఠంతో అన్నారు.

కాసేపు ఆలోచించి నెమ్మదిగా గొంతు సవరించుకుని, గంభీరమైన స్వరంలో "ఉత్తరం వ్రాసిన వ్యక్తికి, కల్పనగా జీవించాలనుకుంటున్న అతనికి, సహకరించాలని నిర్ణయించాను. రేపు ఆ వ్యక్తిని మన సంస్థకి రమ్మని పిలుస్తాను. మీరందరూ కూడా రావలసి ఉంటుంది. మన పరిధులు అధిగమించైనా సరే ఆ వ్యక్తి కోరుకునే గుర్తింపు వచ్చేలా కృషి చేద్దాము. మీ అందరి సహృదయతకీ సహకారానికీ ధన్యవాదాలు" అని చెప్పి భావోద్వేగంతో చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకుంది భార్గవి.

సమాజంలో కొందరు ఘోరమైన నేరాలు చేస్తూ, చట్టాన్ని తమ చేతులలో కీలుబొమ్మని చేసి ఆడిస్తూ, శిక్షలనుంచి తప్పించుకుంటూ దొరబాబుల్లా చెలామణి అవుతుంటే నేనెందుకు తప్పుచేసిన వ్యక్తిలా తిరగాలి?



-దినవహి సత్యవతి
9790752180

రెక్కలుతెగి

విహరిస్తోంది నింగిలో ఓ విహంగం !
విజయ పరంపరలే దాని కేతనం !!

దాని జోరులో ఆపలేని ఆనందం !
దాని తీరులో ఎనలేని గొప్పదనం !!

అలా సాగుతుంటే ఎందరికో సంబరం !
అది విలవిలాడాలని కొందరి పన్నాగం !!

దానికేమి తెలుసు స్వార్థపూరిత జీవనం !
దానికేలా తెలుస్తుంది మనిషిలోని మర్మం !!

ఊరించి ఊరించి ఊహలతో ఉడికిస్తారని !
ఊరకనే చిటికలో రెక్కలు విరిచేస్తారని !!

రెక్కలుతెగి దిక్కులేక బిక్కచూపు చూస్తుంటే !
ఒక్కరైనా దరిచేరి దాక్షిణ్యం చూపరంతే !!

ఎందుకంటే వీళ్ళు జాలిలేని మానవులు !
ఇంత కంటే వీరు మారరు, మారలేరు, మారబోరు !!

-ఏతాడిమేటి సూర్య
9014144835

తీపిచేదు

ప్రేమ ఒక దేవాలయం
కామం ఒక అనారోగ్యనిలయం

ప్రేమ ఒక ఆకుపచ్చపూలతోట
కామం ఒక గన్నేరు పల్లేర్ల బాట

ప్రేమ ఒక మంచినీటి సెలయేరు
కామం ఒక కంపుకొట్టె మురికి నీరు

ప్రేమ ఒక విడిపోని బంధుత్వాల బంధం
కామం ఒక బంధాలు లేని అనుబంధం

-రేడియమ్
9291527757

అక్షరపద్మజం

బురదరోతలోనే ప్రసవించును పద్మజం
భూమాత ఓర్మి వర్షించుట సహజం...

ముళ్ల పైనే వికసించును రోజా పువ్వు
చిక్కుముళ్లు విసిగించాకే ఆనందించేవు కదా ఆ రోజు నువ్వు ...

అంబుది అంచులోనే దొరకును మణులు
అష్టకష్టాల వనవాసమంతానే దొరలును ఆనందభాష్పాలతో కనులు....

నింగినీరు ఏకమైన దారిలో సైతం కనుగొనాలి మన గమ్యందిశ
ఆత్మవిశ్వాసం తెరచాపగా గుండె నిబ్బరం నావగా కదిలిపోవుటే అవసరం బహుశ...

అనంత చీకటి అలవోకంగా పుష్పించును ఒక వేకువను
చింతలఆత్మావలోకనం నిన్ను ప్రశ్నించును నీదైన మెలకువను...

వెర్రి మనసా!
జీవితానికి తీరం ఏది
చెప్పగల్గారా నీకెవ్వరైనా భవసాగరమును ఈది
ముందుకు'సా'గిపోవడమొక్కటే కదా మన "సా".

-నల్లగొండ
83094532179

అరుగు

టీవీ సినిమాలు లేక ముందు కాలక్షేపానికి నిలయం అరుగు
ముచ్చటగా ముచ్చటించెదరు ఇరుగు పొరుగు
కష్టసుఖాలను పంచుకునేనీదుకు వేదిక అరుగు
పిల్లా పెద్దా అంతా కూర్చుని మురిపెంగా మాటాడుదురు
ముచ్చటించే వారితో కళకళలాడే అరుగు
సాధక బాధకాలను పంచుకునే క్షేత్రం అరుగు
సెల్ ఫోన్ టివి సినిమాలు వచ్చి ఖాళీ అయ్యే అరుగులు
టీవీ సీరియల్లో అతుక్కుపోయే వారి సంఖ్య పెరిగే
అరుగుల మీద కూర్చునే వారి సంఖ్య తగ్గే
ఏ ఇంటి ముందు చూసిన ఒంటరిగా కానవచ్చే
అరుగు
కబుర్ల కోసం కూర్చుండే మనుషుల కోసం వెతికే అరుగు
చిన్నబుచ్చుకున్న అరుగు మీద కూర్చుని ముచ్చటించుదానీ
ఇంటి ముందున్న అరుగులకు పూర్వవైభవం తీసుకొద్దాం



-యాదవరం చంద్రకాంత్ గౌడ్
9441762105

ఆత్మనిర్భర భారతి

భరతమాత మురిసెటి రోజు,
త్యాగఫలం మెరిసెటి రోజు,
దాస్య శృంఖలాలు త్రుంచి నవజ్యోతులు వెలిగినరోజు...!!భరత!!

యువచేతన జనగణమనగా జయభేరి ధ్వనించిన దేశం,
పుడమితల్లి పులకించేట్టు,
స్వాతంత్ర్యపు సంబర దేశం...!!భరత!!

మువ్వన్నెల జెండా ముదముతో
నింగిలోన ఎగిరేటి ధ్వజం,
జయజయహే వందేమాతర సాల్యూట్ చేసెటి భుజం...!!భరత!!

అమరవీర త్యాగఫలంగా ప్రతిహృదిలో మెదిలెటి శౌర్యం,
శాంతి జగతి సమతావాదం విశ్వమంత నింపెటి ధైర్యం..!!భరత!!

విశ్వశ్రేయవాద వేదం గీతామృత ప్రబోధ భారతి
సత్యం శివం సుందరంగా ధర్మకృత్య
తోరణ ప్రగతిది..!!భరత!!

ఆత్మనిర్భర లక్ష్యస్ఫూర్తితో నవజాగృత యోధుల యాగం
శ్రమయేవ వైభవమంటూ కౌశలభారతి
మన భావం...!!భరత!!

-డా.పాండాల మహేశ్వర్
9912180054

రైతన్న కోసం..

మొలకెత్తని విత్తనాలు.
ఎరువుల ధరల బరువు.
సాగుబడికి చాలని పెట్టుబడి.

ఐతే కోరలు తెరుచుకుని..
లేపోతే కట్టలు తెంచుకుని..
పరీక్షించే కాల మేఘం!

అందరి నోళ్ళలో
అతడు దేవుళ్ళను మించిన దేవుడు
పొగడ్తల పూ మాలలతో
తీరని అప్పుల బాధలు...

ఇది తరాలుగా సాగుతున్న
రైతు వెతల భారతం

ఐనా
నేనేం చేయను! అనకుండా
వెన్ను చూపని దివ్య మూర్తి రైతన్న.

కంచంలోని అన్నం లో
అన్నదాత దీక్ష ను చూడక
కాలం వెల్లబుచ్చే స్వభావాన్ని
వదలాలి సమాజం.

ఆకలి తీర్చే అన్నదాత కోసం,
నేనేమైనా చేయగలను అని
కదలాలి అందరం..

-వెల్ముల జయపాల్ రెడ్డి
9441168976

దుఃఖ సముద్రాలు

కారణాలేమైనా గానీ
మారణహోమం అక్కడ
'లిటిల్ బాయ్' బాంబ్ హిరోషిమాపై
'ఫ్యాట్‌మాన్' బాంబ్ నాగసాకిపైన
బొజ్జలెక్కిన శరీరాలు
దెబ్బతిన్న మనుషులు
లబోదిబోమని కొందరు
కాళ్ళు చేతులు తెగి
కళ్ళు చూడలేనంత భయానకం
వాళ్ళూ మనుషులేగా
పరమాణు విచ్ఛేదనం జరిగి
మారణాధిదేవతాపరిచ్ఛేదం
సైనికులు, వైద్యులు, పౌరులు
వేలకు వేలు మృత్యుకుహరాల్లో
చచ్చినవారు బ్రతికినవారి జ్ఞాపకాల్లో
బ్రతికిన వారు చచ్చినవారిగా మిగిలి
రెండు మహాబాంబులతో
రెండవ ప్రపంచయుద్ధం ముగిసింది
ఎన్నో దుఃఖ సముద్రాల్నేర్పరచి
ఎన్ని ఆత్మలు ఘోషించాయో కదా!
అందుకే
శాంతి జగతి నిండా విరియాలి
అదే ప్రగతికి బాటగా మారాలి
చర్చలు, నిర్ణయాలు అంతే
విధ్వంసాన్ని కలిగించే
ఆయుధాలు అగ్రరాజ్యలన్నిటికీ వున్నాయ్
అందుకే శాంతికిమించిన
సంతృప్తి లేదు.

– డా॥ చిట్యాల రవీందర్
సెల్: 7798891795

చేనేతకు ఇక మంచి రోజులు

చేనేత కార్మికుల్లారా!
నిరుత్సాహపడకండి.
ఈ కోవిడ్ కాలం
అందరి పాలిట
గడ్డు కాలమే
భయపడకండి.

మంచి రోజులు
వస్తున్నాయి.
మారుతున్న కాలంతో.
మార్పులు చెందుతూ
పరిగిడుతున్న
ఈ పోటీ ప్రపంచంలో.
మనం మారకుంటే
మనలోపం.
స్వదేశీ
అంటూ దేశ ఉత్పత్తులకు
ఆదరణ చూపుతున్నారు.
ధైర్యంగా ఉండండి
నాగరికత,
సంస్కారం,నేర్పే
నైపుణ్యం గలది.

మన ప్రభుత్వం
కుల సంఘాలు
స్వచ్ఛంద సంస్థలు
మీ వెంటే ఉన్నారు.
మీ బాధలు తీర్చే
ప్రయత్నాలుచేస్తున్నారు.
చేనేత వస్త్రాలను
కొనుగోలు చేస్తున్నారు.

–యెల్ది సుదర్శన్ పద్మశాలి,
9892411067

ఆత్మవంచన

అపజయాలు శత్రువులై దాడి చేస్తున్నా
గెలుపు మలుపుకై పోరు సలుపుతూనే ఉండాలి
గిట్టనివాళ్ళ మాటలు సూదుల్లా గుచ్చుతున్నా
మనోధైర్యమనే ఖడ్గంతో ఖండిస్తూనే ఉండాలి
కుటుంబ కలహాలు మనస్సును ఎడారిగా మారుస్తున్నా
ఆత్మవిశ్వాసమనే ఒయాసిస్సు క్షేత్రంలో
మమతానురాగాల విత్తనాలు నాటి
సంసారపు పంట పండిస్తూనే ఉండాలి
సమాజ చీత్కారం పాతాళానికి తొక్కేస్తున్నా
పుడమిని చీల్చుకొచ్చిన పూల మొక్కలా
పరిమళాన్ని పంచుతూనే ఉండాలి
కోటి ఆశలు ఎండమావిలా కనుమరుగవుతున్నా
కొత్త ఆశలు చిగురింపజేస్తూనే ఉండాలి
అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా
శ్రమ ఊటను ఉబికిస్తూనే ఉండాలి
కోరికలు తీరక తలుపులు మూసుకున్నా
మనోనిబ్బరంతో కొత్త దారులు వెతుక్కుంటూనే ఉండాలి
వృద్ధాప్యం బతుకు భరోసాను దూరం చేస్తున్నా
రేపటి ఉదయాన్ని ఆహ్వానిస్తూనే ఉండాలి
సమస్యల గాలం దుఃఖ సాగరంలో ముంచినా
ఆపన్నుల హస్తంతో ఒడ్డుకు చేరుతూనే ఉండాలి
సాగిలపడి తనువు చాలించాలనుకోవడం
ఆత్మవంచనే అవుతుంది
జీవితమే ఒక యుద్ధం
సైనికుడివై నిరంతరం పోరు సలుపుతూనే ఉండాలి
నీ శ్వాస నీ పై విజయం సాధించేంతవరకు..

–గుండు కరుణాకర్,
9866899046.

నేటినిజం

చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని **5** సం॥రాలకు రూ.**700/–**, **10** సం॥రాలకు రూ **1200/–** మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు. లేదా SBI 3056 7652 629, IFSC: SBIN 0011660 Gandhi Nagar Branch Hyderabad-80 అకౌంట్‌లో వేయవచ్చును.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి–74,
జవహర్‌నగర్,
హైదరాబాద్–500 020.

వెన్నుపోటు

ప్రొద్దున్నే లేచి
సద్దన్నం కట్టుకుని
పోలానికి వెళ్ళాను
మొలచిన మొలకల్ని
పురుగులు తింటున్నాయి
గుండె చెరువైంది
ఆశలన్నీ అడియాసలైనాయి
పురుగుల మందు
పిచకారి చేద్దామనుకున్న
జీవహింసా పాపమనిపించింది
పోనిలేయని నిలబడ్డా
మొలకలు దీనంగా
నన్ను చూశాయి
ప్రాణం కాపాడమని
దీనంగా ముఖం పెట్టాయి
పురుగుల్ని చంపి
మొక్కల్ని రక్షించాలా?
మొక్కల్ని చంపి
పురుగుల్ని బ్రతికించాలా?
చిక్కు ప్రశ్న నన్ను
ఉక్కిరిబిక్కిరి చేసింది
పచ్చని పేరే
జీవుల ప్రాణం కాపాడుతుందని
పురుగుల మందు
స్ప్రే చేశాను
పురుగులు నన్ను
ఎగతాళి చేశాయి
నకిలీ మందులు
మమ్మల్ని ఏమిచేయవని
ధీమను వ్యక్తం చేశాయి
నా పంటను
నాశనం చేశాయి
హరితవిప్లవానికి
వెన్నుపోటు పొడిచాయి
సకల ప్రాణాల నోట్లో
మట్టి కొట్టినాయి

–జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

ఆమె వెలుతురు పంచుతూ...!

మగవాళ్ళ జీవితాలు
అమ్మతో మొదలై
ఆమెతో ముగుస్తాయి!

ఎంత అమ్మయినా
పరుగెత్తి పరుగెత్తి
ఒక చోట ఆగిపోతుంది!

అప్పుడే
ఆ మారథాన్ పరుగులోకి
ఆమె ప్రవేశిస్తుంది!

వెంటే నడుస్తున్నట్లున్నా
మనకు వెలుతురు దారులు తీస్తూ
ముందుండేది ఆమెనే!

జీవిత కాలమంతా మనకు దొరికేవి
ఒట్టి కంచి గరుడ సేవలే
ఆమెనే మూలవిరాట్టు!

మనమెంత విస్తరించినా
నీడ మాత్రం ఆమెదే
పండయినాక చెట్టు పేరు చెప్పక్కర్లేదు!

తెలిసో తెలియకో
ఆమెను పూజ్యనీయం చేసి
మనమిట్లా పూజ్యంగా మిగిలిపోయాం!

ఇవ్వాళ మనమే రెక్కలు విరిచి
ఎగురమంటున్నా
ఆమె వెలుతురు పంచుతూ...
చీకట్లోనే!!

–కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

అబద్ధం కాదు

వంకర చూపులు
గాలివాటం వాగుడు
చులకన నవ్వుల మధ్య
ఇప్పుడు నిజం
కాలం చెల్లిన వైఖరి

స్వార్థాలే నిజాలు
నిలబెట్టటానికి
ఎంతకైనా తెగబడటం

అహంకారం అవమానాల మధ్య
మోసపోతున్న నిజాన్ని చూసి
పగలబడి నవ్వుతున్న అబద్ధం

ఎటుచూసినా
నిలువునా మునుగుతూ
ఉరికొయ్యకు వేలాడుతూ
గోతిలో పాతేయబడుతున్న
నిజం

అబద్ధం మాట్లాడితే తప్ప
ఎవరూ ఏదీ నమ్మని పరిస్థితి
చచ్చిపోతుంది
నిజం కాదు మనిషి

– కళ్ళేపల్లి తిరుమలరావు
సెల్: 9177074280

సైబర్ నేరాలు-మహిళల జాగ్రత్తలు

ఆ.వె.॥ ఎవరొతెలియకున్నయెందుకుచాటింగు
ఫేసుబుక్కులోని ఫేకు ముఖము
ఫెయిరు అనుచు ఊరు,పేరునూ చెప్పడం
మేక పులిని పిలిచి మేతయగుటె!

2॥వరసబెట్టి ఫోను వాట్సాపు ట్విట్టర్ల
గంట గంటలెన్నొ మంటగలుప
మనసు పాడుగవును మనిషితో పాటుగా
మెదడుకెపుడునదియు మేలుకాదు!

ఒంటిమహిళవనుచు వెంటెంట బడుచున్న
తుంటరోడినపుడె దునుమవలెను
చెప్పులోన రాయి చేటును చేయదా
తీయకుండ మనము తిరుగవద్దు!

మనిషి గుణము మరచి మసలెడు మృగములు
పగలు రేయి గూడ పడును వెంట
తెలివి తోడ మసలి తెగువను జూపుము
వంద సంబరుంది వదలవద్దు!

అవనియందు వనిత అందలంబెక్కని
వేదికేది లేదు వినుము జనని
నీవు వలయు శక్తి నీలోనె గలదను
నిజము గనుము ముందు నీరజాక్షి!

–పెసరు లింగారెడ్డి
9010292500

హైకూలు

రోడ్డు నిండా బస్సులు
నడక
బస్ ఎక్కింది

అధిక ధరలు
దారుణం
ఇక ఋణ మే

అయ్యా..బాబోయ్
అమ్మ..లేదు
ప్రమాదమే

గంగిరెద్దే
పైసలు పడేస్తే
మొక్కుతుంది

పొయ్యి కి
పొగ రెక్కింది
పొగ ఎక్కువైంది

కైలాసం
కనిపిస్తుంది
మండలం ఉపవాసంతో

ఎండలో తిరిగినా
వడ దెబ్బ లేదు
ప్రేమికులే

నల్లధనానికి
సిగ్గు ఎక్కువ
స్వదేశం రాదు

నాలు గిళ్లు కట్టాడు
పార్టీలు మారాడు
నాయకుడే

అన్నీ అందాల పూలే
కొప్పు లో కొచ్చేవి
కొన్నే

స్వామికి
సొమ్ములెక్కువ
ప (క)న్ను పడింది

ఉపవాసం
కడుపు నిండా
ప్రసాదం

అర్ధ రాత్రి ఐనా
నిద్ర రాదు
దోమ ల సంగీతం

రాత్రంతా భజనలు
తెల్లారింది
భక్తుల లో విభజనలు

చెట్టంత కొడుకే
స్ లాభం లేదు
చేతి కర్ర మేలు

పెళ్లి కూతురే
సిగ్గు లేదు
వరున్ని కోసుక్కుంది

జీవితం
మూడు ముక్క లాట
బాల్యం, యవ్వనం, వృద్యాప్యం

పిల్లి
బతక నేర్చిం ది
ఏడిల్లూ తిరుగుతుంది

కూడు లేదు
గూడు లేదు
సన్నకారు రైతే

మేలిమి బంగారమే
విలువ
పెరుగుతూనే ఉంది

ఎదిగే కొద్దీ
వయసు తక్కువ
తారే

గుండె
చేతుల్లో పట్టుకోవాలి
సెక్యూరిటీ చేతులెత్తేసింది

ప్రతి రాత్రి
పండగే
దోమ భామలకు

రక్తంతో
బతికేస్తా యి
ఆడ దోమలే

గుడ్డ లిప్పిన
కనువిప్పు లేదు
కర్మ తెగ లేదు

తాగే ద్రవం
మత్తు నిస్తే
ఉప ద్రవం

వనం నిండా
పూలే
గుడి కెళ్ళేవి కొన్నే

రాత్రి
బాగా నిద్ర పోయాడు
కష్ట జీవి

కోపం
తాటాకు మంట
తగలడదు

అద్దం
అబ్బదం చెప్పదు
పగిలి ముక్కలైన

ధ్వని కాలుష్యంలో
చిన్నబోయింది
చెవి

మురికి వాసనతో
మూసుకు పొయింది
ముక్కు

పల్లెలే
పెడదారి ప ట్టా యి
వలసలతో

బతకాలంటే
కమతం చాలు
మతం ఎందుకు

నిజాన్నీ
సమాధి చేశారు
నేతల పనే

పువ్వులు
నవ్వుతూనే ఉంటాయి
"వాడే" వరకు

కాలువలో
కలువలు
నిలదొక్కు కున్నాయి

కడుపు బాధ
కన్ను చెప్పుతుంది
ఏడుపు

సూరీడు
చూస్తూనే ఉంటాడు
కళ్ళు మూస్తే చీకటి

–ఆచార్య గిడ్డి
వెంకట రమణ
9440985416

నేను-నా దేశం

ఇదే ఇదే నా దేశం స్వతంత్ర భారతదేశం
పాడిపంటలకు కొదవలేనిది
పవిత్ర భారతదేశం...!
నదీ నదాలు ప్రవహించే
నిర్మలమైనది దేశం...!.
ఎందరెందరో మహానుభావులు
పుట్టిన ఈ దేశం ఘనతగ
మెట్టిన భారతదేశం....!.
తూర్పునందు బంగాళఖాతము
భలే ఉషారుగ ఉన్నది
పశ్చిమంబున హిందూసంద్రము
హిందువు నేనంటున్నది
దక్షణంబున అరేబియా
అందరమొకటే అన్నది
ఉత్తరంబున హిమాలయాలు పెట్టని గోడలమన్నవి
ఇదే ఇదే నాదేశం ఎల్లలు నేనంటున్నది
వాటిని చూస్తూ ద్వీపకల్పములొ
మేమంతా నివసిస్తున్నది....!.
అందరినెంతో అబ్బర పరిచే
ఆచార వ్యవహారాలు
శిలను సైతము శిల్పము చేయును
మనుషులలోని భావాలు...!.
ప్రేమాలయమే చూడాలయముగ
వెలసిన "తాజ్ మహలు "
దాగుడుమూతలు ఆడుకునేందుకు
దండిగ "అజంతా గుహలు "....!
మనసుకు విందును అందించే
" కజురహో " అందాలు
ఎంతచూసినా తనివి తీరని
"ఎల్లోరా శిల్పాలు "....!.
బొమ్మల నెలవై కొలువు దీరినా
కొండపల్లి అందాలు
సకల దేవతల స్థానమయ్యిన
భారత బృందావనాలు...!.
ఎన్నో కులాల ఎన్నో మతాల
మనుషులున్న నాదేశం కులమతాలలో తేడాలున్నా
మనుషులొక్కటని సందేశం...!.
సకల భాషల స్వర్ణ హారములు
వేసుకున్న నా దేశం
భాషలలోన బేధాలున్నా
భావమొక్కటని సందేశం...!.
వసుదైక కుటుంబపు పుట్టినిల్లు నాదేశం
వరుసలతో పిలుచుకునే సాంప్రదాయపు
సరస్సు నాదేశం....!.
సరిరాదు నా దేశానికి మరేది...!!!

– ఆకుల వెంకటరమణ
సెల్: 94417 17212

మట్టి వాసన

ఆధునిక హంగులతో అత్యాధునిక టెక్నాలజీతో
అద్దాల మేడలతో ఆకాశాన్నంటిన
తళతళలాడే తారు రోడ్డుల నిర్మితమై
సుందర సుమధురమైన పట్నం ఒక్కసారిగా ఉలిక్కిపడి
గాఢనిద్రలోకి జారి నిశ్శబ్ద మంత్రం వల్లిస్తున్నా
మట్టి వాసన పరిమళ భరితమైన పల్లె
నాగేటి సాలుతో నడుస్తున్న రైతన్నలు
భూమాతను నమ్ముకుని జలధారకు దండమెట్టి
నిత్య కృషివలురై చమట సేద్యం జేస్తూ
క్షణం వృధా చేయక గమ్యాన్ని ముద్దాడుతాయి పల్లెలు
పచ్చని ప్రకృతి హృదయాలతో పల్లె సంపదలతో
అవనికి అన్నపూర్ణగా జనుల కడుపునింపి పట్టుకొమ్మైంది
పట్నం బోగలాలస జీవితాలకు మూలం పల్లెలు
పల్లె ఓనమాలు దిద్ది బాట సాగితే
పట్నం గుణింతమై సాగుతది
పేరుకే పట్నం జీవితం మనసంతా పల్లెల్లో కదలాడుతూ
జ్ఞాపకాల దొంతరల్లో జ్ఞానం వెతుకుంటుంది
పట్నానికి సెలువు దినముండొచ్చు,
కాసేపు కునుకు తీయొచ్చు
కానీ పల్లె కాలచక్రంలో నిత్య భ్రమణమై సాగితేనే
నింగి నేల మధ్య ఉయ్యాల మంచమౌతుంది జీవితం
పల్లె పట్నం ఆత్మీయ బంధమై సాగుతుంది నిత్యం

–ఉంద్రాళ్ళ రాజేశం
9966946084

ఎత్తుపల్లాలు

భూమ్మీదికొచ్చిన క్షణం నుండి
మళ్లీ భూమిలో కలిసే వరకు
కష్టసుఖాలు పలుకరిస్తూనే ఉంటాయి
ప్రతిస్పందన ఇస్తూనే ఉండాలి

కష్టాలు కన్నీటితో కౌగిలించుకోవడం
సుఖాలు హాయిగా వాటేసుకోవడం
నిరంతరప్రక్రియలా సాగుతూనే ఉంటుంది

ఏదొచ్చినా ఆనందంగా స్వీకరిస్తూ
అవరోధాలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటూ
ఎత్తుపల్లాల జీవితంలో పయనం సాగించాలి..

–బస్వ రాజ్ కుమార్
9392006080

ఊరు రమ్మంటుంది?

చిన్ననాటి జ్ఞాపకాల గనులు
నా మది ఫలకంపై
మెదలాగా ,వూటలా రసధారలా,
నా మనసును తడిమాయి నా కళ్ళముందు కదలాడాయి
పూటకో సారి వచ్చే
బస్సు కోసం ఎదురుచూపులు, మాటునిచ్చే మర్రిచెట్టు,
పాట పాడే పండరి పాపన్న, ఉత్తరమిచ్చే పోస్ట్ మాన్,
దొంగతనంగా తిన్న
దోర జామ కాయల
దొరవారి గడి,
పంచాయతీ తీర్పు ఇచ్చే పట్వారి పంతులు ,
కోరిన కోర్కెలు తీర్చే
కోనేటి రాయుడు,
బెల్లం పెట్టి కబుర్లు చెప్పే దొరసాని ,
అ ఆ ..లు దిద్దించే
ఖానీ బడి ,
బాటు పిప్పరమెంటు, పేలాలముద్దల నిచ్చే
లచ్చమ్మ దుకాణం, పెద్దలందరూ కూర్చునే కచ్చీరు గద్దె,
ఊరి మధ్యలో నిలిచి ఎదుగుదలను చూపుతున్న
సర్వాయిపాపని కోట,
అల్లా.. అంటూ మూడు పూటలా ప్రార్థనను వినిపించే ...
అన్వర్ మియా గొంతు, బండ కింద
పంతులోళ్ళ వాడ,
ఆ వాడలో
టీవీ గా నడిచివచ్చే పేర్వారంరాములు ,
మొదటి సినిమా చూపిన పొన్నాల వారు ,
శతక పద్యాలను వినిపించే కేశిపెద్ది వారు,
ఊయలలూగే ఉసిరి చెట్టు,
బొమ్మల పెళ్ళిళ్ళు చేసే మామిడి చెట్టు,
నాలుగు స్తంభాల ఆట వెంకన్న గుడి, చదువులకే తల్లి
మా ఊరి బడి , కచ్చ కాయలు ఆడే కావటి నేల ,
బతుకమ్మ లాడే చెరువుగట్టు ,
చెడుగుడు,చింతగింజలాటపచ్చీసు పావులు,
వామన గుంట గింజలు, దాగుడుమూతలాట,
రంగస్థల నటుల రాగాలు, పుల్ల ఐస్ క్రీమ్,
పీచు మిఠాయి ,
లైలప్పగడియారం, పులిహోర దద్దోజనం ప్రసాదాలు,
ఈత నేర్పిన నిమ్మ బాయి, ఊరట నిచ్చే ఊరి బావి,
కమ్మనైన అమ్మ వంటలు,
కందిలి (లాంతరు) వెలుతురులో నాన్న చెప్పే
జీవిత పాఠాలు,
ఆత్మీయతగా పలకరించే మా ఇంటి అరుగు,
మమతానురాగాల లోగిలి, మా ఊరి వీధులు ...
ఇవన్నీ మరచిన జ్ఞాపకాలు కాదు ,మడచిన పేజీలు,
చిరకాలం చిరు హృదయాలలో ఉండాలంటే
జీవిత పొత్తాలలో ఆత్మీయత అనుబంధాలకు
విలువల కలాలతో లిఖించు, అందరూ బాగుండాలి
అందరిలో మనం ఉండాలి...
అందుకే ఊరు రమ్మంటోంది...

–డా.శ్రీభాష్యం అనూరాధ
8790325502

పెంచుకున్న నమ్మకం

నేలపై పెంచుకున్న నమ్మకం
విశ్వాస జూలం నుండి జారుతూ

పొడిచిన పిడికిళ్ల పొద్దు
ఇంటి వాకిటి ప్రశ్నగా మారుతూ

మోసపు తెరల స్వార్థం ఎప్పుడు
పూసుకున్న అత్తరు కౌగిలి

విధి రాసిన రాతలో తలరాత
వాలిపోతున్న మలిపొద్దు

కన్నీటి చుక్కల్ని లెక్కిస్తూ
సాగుతున్న విధి లేని భవిత

వార్తమానం దుఃఖ మయం
భవిత నమ్మలేని ప్రశ్న

నా మాటిప్పుడు నాది కాదు
కబంధ హస్త అస్త్ర కానుక

నిరాశల ప్రవాహం నా జీవితం
ఊపిరాడని మనుగడ నా అస్తిత్వం

బతుకిప్పుడు చుట్టుకున్న స్వార్థ ప్రశ్న
బతుకిప్పుడు కోరుకొని వేసుకున్న శిక్ష.

–సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

వెలుగురేకై పల్లవిస్తాను

ఎద నిండా ఏదో వేదన
ఉప్పెనై చెలరేగుతున్న వెతల సంద్రం

విరుచుకుపడుతున్న
నిరాశా నిశి పాతం

అదను కోసమే పొంచి ఉన్న
మనో దౌర్భల్యం

మూకుమ్మడి దాడిలో
కుదేలైపోని మనుషులు అరుదే...!

ఆకాశానికి నిచ్చెనలు వేయలేమనే
సిసలు నిజం తెలుసు...!

సంద్రానికి ఆనకట్టలు నిర్మంచలేమనే
అసలు సంగతీ ఎరికే...!

అయినా కూడా
విదియ నాటి చంద్రుడి వలె

నేను సైతం వెలుగు రేకనై పల్లవించి
కొన్ని దుర్భర జీవితాలనైనా
కాంతి పుంజముల ఛత్రంలోకి చేర్చాలని ఉంది!

అది ఆశో... నిరాశో...
ఫలితం ఏదైనా కానీ...

మరో ప్రయత్నానికి
సతతం నేను
సంసిద్ధమే...!!

–వెగ్గలం ఉషశ్రీ
9440370066

పల్లెను వొలిచిన పట్నం

పుడమికి ప్రాణవాయువు పైరుగాలి
పచ్చని పంట పొలాలే పల్లెలకు నిదర్శనం
పసిడి పంటలను పూడ్చి భవనాలు కట్టి
పల్లెలు పట్టణాలుగా మారిన ప్రదేశాలు ఎన్నెన్నో

స్వచ్ఛమైన పల్లె పల్లెలో పలుకుల రాగాలలో
స్వర కూర్చే పక్షుల కిలకిలమనే శబ్దాలెన్నో
వాహనాల ధ్వని తరంగాల హోరులో పక్షుల ఘోష
పట్టణ కాలుష్య కోరల్లో జీవరాశుల ఆయువు ముగిసే

పల్లె గ్రామ ప్రజల జీవనాధారం వ్యవసాయమే
సాయమే లేని పట్టణాల్లో రకరకాల జీవంలేని పనులెన్నో
ఎలాంటి రోగాలును దరిచేరనీయనిది వ్యవసాయమే
నేడు రోగాలకు దిక్సూచిగా పట్టణ ప్రాంతాలే మూలం

సముద్రం పిల్ల పిల్ల కాలువలను మింగినట్టు
మర్రిచెట్టు చిన్న చిన్న మొక్కలను తింటున్నట్టు
దూరపు కొండలను విశాలాకాశం కప్పినట్టు
భవనాలు పక్కన గుడిసెలు చీమల్లా కనిపించినట్టు

వరి విత్తనాలు లక్షల మొక్కలకు జీవమే నాంది
ఎన్నో అంతస్తుల భవనాలకు పునాదులే పట్టు
చిరునవ్వుల చిరుజల్లుల వనాలే పల్లె గ్రామాలు
మన నిత్య జ్ఞాపకాలే చిననాటి పల్లె అనుభవాలు

–దాసరి సుబ్రహ్మణ్యేశ్వర రావు
సెల్ : 9493033534

హరివిల్లు

వరద బీభత్సం
తెగిన రహదారులు
అరచేతిలో ప్రయాణం
జనానికి కష్టాలు

అనాథ ఆశ్రమాలు
ఆశ్రయం పేరుతో
అబలను చెర పడతారు
సహాయం పేరుతో

చూసే మనసు ఉండాలి
అన్ని కళాత్మకమే
చేసే పనిలో నైపుణ్యం
ఉంటే అద్భుతమే

పుడమికి పైరు అందం
చెట్టుకి పువ్వులు అందం
స్త్రీలకు నుదుటన
సింధూరం అందం

చినుకు చినుకు పడితే
వరదై పారుతుంది
పదం పదము కలిస్తే
కవిత్వం వస్తుంది.

–చపల మహేందర్
9949864152

అమ్మానాన్నలను అశ్రమాల ఉంచొద్దు... !

ముసలి తనముజూడ:ముదమెంతగలిగించు
మనుమరాళ్ళతోడ:మధురమోయి!
మనుమలున్నమురియు:మనమెంతహాయిలే!!
నిండుకాపురంబు:నింపుయింపు!!!

మరలిపోనిదిలను:మధురజ్ఞాపకఝరి
సానుభూతితోను:సంతసించు
జీవితానుభవపు:చీకటివెలుగుల
సారమంతజెప్పు:సంబరంబు!

అవ్వతాతమాట:లానందరసధుని
బోసినవ్వులిడుతు:మోదమిచ్చి
ఆటపాటలమర:నాడించిపాడించి
నీతికథలుజెప్పి:నియతినేర్పు!

అవ్వతాతలనిల:ఆశ్రమాలకుపంపి
పేగుబంధతీపి:పేర్మినొదలి
నేటికొడుకులంత:నెనరులేకుండ:ను
బ్రతుకుచుండిరిభువి:భ్రాంతితోడ!

తల్లిదండ్రులిలను:దైవాంశభూతులు
పుట్టుకిచ్చినట్టి:పుణ్యమతులు
కనులబెట్టుకొనియు:కాపాడిపెంచిన
మూలపురుషులొదలు:మూఢమతులు!

అలసిసొలసిపోయి:అయినవారునులేక
తల్లడిల్లిపోయి:తపనజెందు
దిక్కుమొక్కులేని:దీనులజేయక
మమతలన్నిపంచు:మాన్యులార!!!

(21.8.2020 వృద్ధాప్ప దినోత్సవ సందర్భమున)

–చింతోజు
పద్మావతీ శ్రీనివాస్
8464954860

సరిహద్దులు లేని సాహితీ చైతన్యానికి పసిడి వెలుగుల శిలాశాసనం

మెరుపులా మెరిసి మాయమయ్యే రచనల మధ్య ఒక స్థిరమైన చిరునామాతో ఒక రచన తన ప్రస్థానాన్ని సుదీర్ఘకాలం కొనసాగించాలంటే సృజనాత్మకత, ఆసక్తి ఒకటే చాలదు. అంచనాలకు అందని ఆలోచనా విధానం, విషయాలను సంధాన పరిచే అవగాహన నేర్పరితనం, రచన ప్రవాహంలో అంతుచిక్కని చిక్కదనాన్ని చక్కదనంగా మార్చగల మేధావితనం, అన్నిటికీ మించి రచనా శిల్పానికి సొగసులు అద్దగల అనుభవ పూర్వకమైన సాహిత్య సాధికారత ఎంతైనా అవసరం. ఈ శక్తులన్నీ ఒక సమూహంగా ఏర్పడి సమిష్టిగా ఒక సాహిత్య సృష్టికి శ్రీకారం చుట్టగలిగితే సరిహద్దులు లేని సాహితీ చైతన్యానికి శాశ్వతంగా దాహం తీర్చే మంచినీటి కొలనులా ఆ రచన పురుడు పోసుకుంటుంది. అందుకు సాక్ష్యంగా నిలుస్తున్న గ్రంథమే డాక్టర్ తుర్లపాటి రాజేశ్వరి గారి "వ్యాస నిరాజనం". ఊహలతో ఊపిరి పోసుకున్న గ్రంథం కాదిది. సాహిత్య అభిలాష, అధ్యయనం, పరిశోధన ఒక దానితో మరొకటి పోటీ పడి సాహిత్య అంశాలను అఖండదీపంలా వెలిగించిన ప్రయత్నమిది. అసంఖ్యాకమైన సాహితీవేత్తల సాహితీ సత్తువులను సారవంతమైన వ్యక్తీకరణతో పాఠకుల సంతృప్తికి సంపూర్ణమైన విందుభోజనాన్ని అందించిన విలక్షణమైన గ్రంథమాల ఈ 'వ్యాస నీరాజనం'.

ఈ గ్రంథము లోని వ్యాసాలు ఎన్నో విషయాలను వడ్డించిన విస్తరిలా మన ముందు ఉంచుతాయి. ఇందులోని వ్యాసాలు నేరుగా మన మనస్సు వాకిళ్లు తెరుచుకొని చిరునవ్వులు చిందిస్తాయి.

సాహిత్యంలో సంపూర్ణ సాధికారత సాధించిన సాహితీవేత్తలంతా అడుగులేస్తూ కరచాలనాలతో మన సంతోషానికి సరిపడ తడిని తనివితీరా అందిస్తారు. అన్ని కాలాలతో పెనవేసుకున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ఇత్యాది విషయాలను ఆది నుంచి నేటి దాకా సాహిత్యం తనవంతు కర్తవ్యంగా పద్యం, గేయం, కథ, కథానిక, నవల, నాటకం ఇంకా అనేక రూపాలలో ఎలా తరగని నిధిలా ఈ తరాలవారికి వరాల జల్లుగా కురిపించిందో అబ్బురపరిచే రీతిలో అమ్మ చేతిలోని వెన్నముద్దల అందిస్తుందీ గ్రంథం.

తెలుగు వారి సాహిత్య ఆరాధ్యదైవం గురజాడ. ఒడియా ప్రజల్లో పూజనీయ స్థానం సంపాదించుకున్న ఫకీర్ మోహన్ సేనాపతి ఆశ్చర్యంగా ఇద్దరూ కలిసి ఈ ప్రాంగణంలోకి అడుగు పెడతారు. రామాయణ కల్పవృక్షాన్ని తెలుగు వారికి కానుకగా ఇచ్చిన విశ్వనాథుల వారి పద్యం ఆంధ్రుల అభిమానానికి తిలకం దిద్ది బయలుదేరుతుంది. సమాజాన్ని కదిలించి కనువిప్పు కలిగించిన చాసో గారి కథ కన్నీళ్లను మోసుకుంటూ మనముందు నిలబడుతుంది. మానవతావాద నినాదాలతో హోరెత్తిస్తూ ఇనాక్ గారి భావ కంఠస్వరం గంభీరంగా వినిపిస్తుంది. హడావుడిగా కోర్టు నుండి వస్తున్న రావిశాస్త్రి గారి కథల్లోని ఉపమానాలు బహుమానాల బుట్టల్లా మన వరండాల్లో దిగుతాయి. శివారెడ్డి కవిత్వం అందమైన శిల్పంలా మనల్ని నిశ్చేష్టులను చేస్తే, ఇంతలో ఆచార్య గోపి గారి కవిత్వం పాఠకుల దాహం తీర్చడానికి ఏకంగా నదిలా పురకలేస్తూ వస్తుంది. వజ్రాయుధం మెరుపులతో ఓటమి ఎరుగని సాహిత్య యోధుడిగా సోమసుందర్ దర్శనమిచ్చిన రీతికి జైజైలు పలుకుతాం.

ఒడిశాలో ఉంటూ జాతీయ ఉద్యమంలో పాల్గొన్న తెలుగు మహిళా మణుల అపూర్వ సేవలు సూర్యుడి వెలుగులా మన ముందు క్రొత్త ప్రకాశాలతో మన ఆలోచనా లోచనాలకు కనువిందును అందిస్తాయి. సాహిత్య సంబంధాలతో సర్వమానవ ప్రపంచాన్ని ఆత్మీయ బంధాలతో ముడి వేస్తున్న నేపథ్యంలో ఎంతోకాలంగా తెలుగు ఒడియా భాషల మైత్రి బంధం ఇరు భాషాభిమానుల మధ్య శాశ్వత రహదారులు ఏర్పరుస్తూ, బంగారాన్ని మించిన ధగధగలతో దరిత్రికే ఒక నగలా భాసిల్లిన ముచ్చట్లు పాఠకుల్ని మైమరిపిస్తాయి. సారి క్రొత్తబ పుంతలు తొక్కుతున్న సమకాలీన ఒడియా సాహిత్య సౌధాల సౌందర్యం తన అధ్యయనానికి మనల్ని ఆహ్వానిస్తుంది. ఈ గ్రంథములో వందలాది విషయాలు తమ ఇళ్ల దగ్గర నిలబడి పలకరించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రస్తుతానికి కొన్నింటి తాంభూలాలను మాత్రమే ఇక్కడ స్వీకరివద్దాం.

తెలుగు కథా శిల్పి చాసో గారి 'కుంకుడాకు' కథ లోని 'గవిరి' తాను చేయని నేరానికి అనుభవించిన శిక్షకు కార్చిన కన్నీళ్ల సంఖ్యను లెక్కించడానికి బడిలో వినిపిస్తున్న లెక్కల శాస్త్రానికి సైతం సాధ్యం కాదేమోననిపిస్తుంది. సంక్షిప్తంగా సాగిన ఈ కథాపరిచయం మొత్తం సారాన్ని. మన దోసిళ్ళ నిండా నింపే ప్రయత్నంలో వ్యాసకర్త సాధించిన విజయానికి భాగం పంచుకున్న అక్షరాలు క్షణకాలం గర్వముతో పూగిపోతాయి. మధ్యతరగతి మనిషి కథ అయినా అట్టడుగు శ్రామికవర్గం కథయినా చాసో గారి సృజనలో సజీవమైన జీవం ఆయా పాత్రల్లో తొణికిసలాడుతుంది. వ్యాసం చివరలో చిన్నాజీ కథ రాగానే ఆయన సాహిత్య వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న 'చాగంటి తులసి' గారు చిరునవ్వులతో మన ముందుకు వచ్చి, పసితనం నవ్వును తంగేడు పువ్వులా అందించి తుర్రుమంటారు. ఆర్థిక సంబంధాలు మానవ సంబంధాలను శాసించే రీతిని అద్భుతంగా ఆవిష్కరించిన చాసో గారి 'కాందిశీకుడు' కవిత ఈ గ్రంథంలో అదనపు వెలుగులా ప్రకాశిస్తుంది.

తెలుగు కథని కావ్య స్థాయికి తీసుకెళ్ళిన రావిశాస్త్రి గారి పేరు చదవగానే పాఠకుల కళ్ళల్లో ఒక తెలియని

సాహిత్య అభిలాష, అధ్యయనం, పరిశోధన ఒక దానితో మరొకటి పోటీ పడి సాహిత్య అంశాలను అఖండదీపంలా వెలిగించిన ప్రయత్నమిది.

మెరుపు తళుక్కుమంటుంది. అగ్నిపర్వతాలు సముద్రాలలోనే కాదు పేదల కన్నీటి జలాలలో సైతం ఎలా దాగి ఉంటాయో తిరుగులేని వాక్య ప్రయోగాలతో తనకు మాత్రమే సొంతమైన శైలిలో ఆయన చిత్రీకరించిన రీతి పాఠకుడి శ్వాసతో చిరకాల స్నేహం చేస్తుంది. సమాజములోని అవలక్షణాలను, సామాన్య మనుషుల్లోని బలహీనతలను, దోపిడీ దుర్మార్గపు అసహ్య రూపాలను ఉత్తరాంధ్ర మాండలికంలో అందించిన ఆయన కలానికి సాగరం సైతం సలాం చేస్తుంది. శాస్త్రి గారి ఎండ కథలోని సుందరమ్మ తన పిల్లల కోసం ఆ పేదరాలు ఆ వర్షంలో పడిన ఆవేదనను పరిచయం చేసిన తీరు కథలో పాఠకుడిని ఒక పాత్రను చేసి కంటతడి పెట్టిస్తుంది. ముఖ్యంగా ఈ కథలో అమితంగా ఆకర్షించిన అంశం ప్రకృతిలో సహజమైన ఎండను అనేక మూర్తాలతో శాస్త్రి గారు ఆ కథలో పోల్చిన వివరాలు ఆయన కలం శక్తిని ఒక్కసారి కళ్ళకద్దుకుని ఏలా చేస్తాయి. "అతడు నడుస్తున్న మేరా కదం తొక్కుతున్న శబ్ద ఘోష, ధీర గంభీర కథాసరిత్సాగర ఘోష" అంటూ రావిశాస్త్రి గారి సాహిత్య విస్వరూపాన్ని ఒక రంగుల చిత్రంలా ఆవిష్కరిస్తారు వ్యాసకర్త.

తెలుగు సమాజాన్ని, తెలుగు సాహిత్యాన్ని సంస్కరణ మార్గములో నడిపించిన కందుకూరి వీరేశలింగం, అదే బాటలో నడిచి మార్గదర్శకులైన గురజాడ

మార్గాన్ని మనసారా ఆహ్వానించి మానవతా ఉద్యమానికి తన రచనల్ని సైనికుల్లా మలిచిన ఆచార్య ఇనాక్ గారి. "ఊరబావి" విశేషాలు మరొక్కసారి నిద్ర పోతున్న మానవత్వాన్ని నిద్ర లేపుతాయి. సమాజములో మానవీయ విలువల విధ్వంసాన్ని సజీవ చిత్రంగా మలిచిన కథ ఇది. కథలో నాటకీయత, నిగూడత పోటీపడుతూ ఎత్తుగడలో అపురూప సౌందర్యాన్ని అందిస్తూ కథ సాగుతుంది. గుంటూరు యాసలో సాగిన ఈ కథ పరిచయానికి పట్టుచీర కట్టినట్టు కరుణాకర్ "కొత్త చెప్పులు",మా గోఖలే "మునసబు కచేరీలో మనిషి" కథల ప్రస్తావన అవసరమే కాదు, అర్థవంతంగా కూడా ఉంది. పెత్తందార్ల పీడనానికి బలైపోయిన దళితుల ఆక్రందనలు వ్యాసకర్త అక్షరాలను పదవల్లా మార్చుకుని పాఠకుల మనసు తీరాలకు చేరుకుంటాయి. ఇప్పటికీ ఈ ఊరబావిలో నీళ్లు ఉప్పగానే ఉన్నాయి. కారణం బావి మట్టికణాలనుండి ఊరిన నీరు కాదది.

తరతరాలుగా పీడిత జనం కార్చిన కన్నీరు అది. ఇంకా చెప్పాలంటే నిరుపేదల వేదనకు నిలిచిన ఇనాక్?రు కార్చిన కన్నీరది. అందుకే ఆ నీరు అంతా ఉప్పగా ఉంది. అందులో ఉప్పదనమే కాదు వ్యాసకర్త ఆలోచనా లోచనాలతో పరిశీలనగా చూస్తే దుర్మార్గపు మంటల్లో మాడి మసైపోయిన మానవత్వపు అవశేషాలు సైతం ఆ బావి నీళ్ళల్లో కనిపిస్తాయి.

కథ ఎలా వ్రాయాలి? ఏది వ్రాయాలి? ఎందుకు వ్రాయాలి? ఈ ప్రశ్నలకు సమాధానంగా ఈ వ్యాసం నిరాజనంలో పరిచయం చేసిన ప్రతి కథ ఒక ఉపాధ్యాయుడై పాఠాలు బోధిస్తుంది. అలాంటి పాఠాలకు పాఠ్యపుస్తకం లాంటి కథలు "ఆఖరికి మహారాజు, నిశ్శబ్దం నిశ్శబ్దం". వీటి సృజనకర్త సుజాతారెడ్డి గారు. ఆమె కథలలోని వాతావరణాన్ని, పాత్రల స్వభావాలను, సన్నివేశాల కల్పనలో ప్రారంభం ముగింపు విశిష్ట విధానాలను కోరి. కోరి పాఠకులకు వడ్డించినట్లుగా ఉంటుంది. అది ఏ శాప ఫలితమో అర్థం కాదు కానీ, అన్ని స్వామ్య సమస్త వ్యవస్థలోనూ అవస్థలకు ఆహారంగా మారుతున్నది మహిళలు మాత్రమే. పితృస్వామ్య వ్యవస్థలో తాను నిలబడిన విష సంస్కృతిని సాహసంతో ప్రశ్నించిన సావిత్రి ఒక ప్రక్క, ఆ సుడిగుండంలో చిక్కుకుపోయి బయటికి రాలేక విషాదపు గుమ్మానికి వ్రేలాడుతున్న సుఖన్య మరొక ప్రక్క, తమ హక్కుల చట్టాన్ని చేతబూని మగజాతి అహంకారపు నేరాన్ని కాలం బోనులో నిలబెట్టి ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఈ దృశ్యానికి తెరతీసి అద్భుతంగా పరిచయం చేసినందుకు పాఠకుల అభినందన చందనాలు వ్యాసకర్త ఖాతాలో జమ చేయబడుతాయి.

కరుణ రసార్ద్ర హృదయానికి ఆయన ఒక మహారాజు. పేరు కళాప్రపూర్ణ గజపతిరాజు అచ్యుతరామ రాజు. నటుడిగా, దర్శకుడిగా, ప్రయోక్తగా, రచయితగా, నవలాకారుడిగా సుప్రసిద్ధులైన ఈ న్యాయవాది కలం కలకాలం కరుణ రసానికి తివాసీలు పరిచి సాహిత్య పాలన సాగించిన సత్యానికి నిలువెత్తు చిత్రపటం నిలిచిన ఈ వ్యాసములో రాజు గారి "మున్నీ" కథల సంకలనంలో హృదయాలను సున్నితంగా తాకే కథలు రాళ్ళల్లోని తేమను సైతం ఎలా కన్నీళ్లు గా మార్చగలవో వివరించిన వ్యాసకర్త రచనా శైలి అపూర్వంగా వుంది. పొట్టకూటికోసం రైలు పెట్టెలను నిత్యం తుడిచే జగత్ సోదరుడిని కథకు నాయకున్ని చేసి, సాహిత్య గౌరవం కల్పించిన తీరును తేనె చుక్కల్లా ఈ వ్యాసం మన చేతుల్లో రాలుస్తుంది. అరటి చెట్టు నేపథ్యంలో మూడనమ్మకాలను పటాపంచలు చేసిన రాజు గారి కలం ఝులిపించిన వాస్తవ వాదాలకు అభివాదాలు చెల్లించవలసిందే. సమాజములో నైతిక విలువల దిగజారుడు తనాన్ని తన భావాల ఫిరంగులతో తునాతునకలు చేసిన రాజు గారి సాహిత్య లక్ష్యానికి పాఠకులు లక్ష ప్రమాణాలు చెల్లించుకుంటారు. "అన్న వాక్యము, అత్తగారింటికి దారేది" కథలు స్థానిక చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తాయి. జానపద సాహిత్యంలో స్త్రీలకు సంబంధించిన కథలు కరుణ రసాత్మక కొలిమిలో ఎలా సానబట్టాయో బుట్ట భోజనంలా అందిస్తుందీ వ్యాసం.

వేయిపడగల సృష్టికర్త కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి సాహిత్య ప్రస్తావన ప్రపంచంలోకి మన చిటికెన వేలు పట్టుకొని ఆప్యాయంగా నడిపించిన వ్యాస సౌందర్యం ముగ్ధులను చేస్తుంది. 14 పద్యాలతో సాగించిన ఆంధ్ర విష్ణు కథ, 12 పద్యాలతో సాగిన వేగిక్షేత్రము మరో పన్నెండు పద్యాలతో సాగిన ముఖలింగం కావ్యాలు అందించిన ఆంధ్రుల కళాకౌశలం, పల్లవ రాజుల ఉదాత్త వ్యక్తిత్వము, తెలుగు వీరుల ప్రభావం, శిల్ప సంగీత కవిత్వాది లలితకళలలో నాటి ఆంధ్రుల ప్రతిభ శంఖాలూది తెలుగు సాహిత్యాన తమ పునాదుల నివాస స్థావరాలను నెవ్వర పోయే విధంగా ప్రదర్శించడానికి వేదికగా మారిన ఈ వ్యాసానికి పాఠకుల ఆనందం సాగర అలలతో స్నేహం చేస్తుంది. విశ్వనాథ వారి అపురూప పద్య శైలికి పింఛంలా నిలిచిన పద్యాలను అందించిన వ్యాసకర్త పద్య సాహిత్య అభిరుచికి, అధ్యయన శక్తికి పాఠకుల ఆశ్చర్యం విరబూసిన కమలమవుతుంది.

' మట్టిలోంచి పొడుచుకొచ్చిన మొక్క పిట్ట అక్షరం" అంటూ గర్జిస్తున్న ఆ స్వరం శివారెడ్డి గారిది. విద్యార్థి ఉద్యమాలు, పోరాటాలు, వామపక్ష భావజాలం, మానవ సంబంధాలు కవితా వస్తువులై కలకాలం నిలిచే కవిత్వ సారానికి భూమాతగా నిలిచిన అయన మేధాసంపత్తిని వివరించిన తీరు ఒక చైతన్య స్వరూపానికి హారతులిచ్చినట్టుగా ఉంది. ఆయన ప్రయోగించిన ఉపమానాలు పాఠకుల అభిమానానికి హక్కుదారులుగా మారుతున్నాయి. "వాడొక పిట్ట" కవిత తన ద్వారాలను తెరిచి ఎదురుగా సింహాసనం మీద పక్షిని కూర్చోపెట్టి ఆ పిట్ట మానవాళికి చేస్తున్న మహోపకారాన్ని అద్భుతమైన పద ప్రయోగాలతో కవిత్వ శాస్త్రవేత్త శివారెడ్డి గారు స్వరపరచిన గీతాన్ని ఈ వ్యాసం మనకు వినిపిస్తుంది. దేశం ఏదైనా ప్రాంతం ఏదైనా అణచివేతకు గురి కాబడుతున్న పీడిత జనానికి బాసటగా నిలిచేది, పోరాటాలకు నినాదమై ప్రతిధ్వనించేది చివరికి అనివార్య పరిస్థితుల్లో ఆకలికి చావలేక తిరగబడ్డ జనం తిరుగుబాటుకు నినాదమై వినిపించేది సాక్షాత్తు అక్షరమే. అక్షరం సర్వాంతర్యామి అని మార్మికంగా వ్యక్తం చేసిన కవితా శివారెడ్డి గారు ఈ వ్యాసటలో అన్ని అక్షరాలు తానై కనబడుతారు.

ఈ వ్యాస నిరాజనం భవంతిలోకి ఆచార్య గోపి గారిని ఆహ్వానించిన విధానం తెలుగుతల్లి మెడలో అలంకరింప జేసిన తులసిమాల చందాన పాఠకుల చేత చప్పట్లు కొట్టిస్తుంది. గోపి గారి కలం ప్రసాదించిన "కవిత్వం కోసం/ తలుపు దగ్గర నిలబడి/ ఎదురుచూసే అమ్మలాంటి వాడు కవి" అమృతంలాంటి ఈ వాక్యంతో ప్రారంభమైన వ్యాసం తన శిరస్సు మీద నాణ్యమైన అధ్యయనం పించాన్ని ధరించి మయూరంలా గోపి గారి కవిత్వం విశేషాలు రెక్కలతో నాట్యమాడిన దృశ్యం తన స్థిరమైన చిరునామాను పాఠకుల జ్ఞాపకాల మైదానాల



మీద నిలువెత్తున ఎగిరే ఒక పతాకంలా నిలిచిపోతుంది. గోపి గారి కవిత "పురివిప్పిన ఊపిరి" తెలుగు సాహిత్యానికి ఒక శాశ్వత ఊపిరిగా మారిన విధానాన్ని ఈ వ్యాసములో మనం దర్శించవచ్చు. ఒక కుమ్మరిలో మహావిష్ణువును ఒక గోపి గారే ఆవిష్కరించగల వాస్తవం అందరూ తలెత్తి చూసే ధ్వజస్తంభం నిలబడుతుంది. హరప్పా మొహంజోదారో శిథిలాలలో దొరికిన కుమ్మరి శ్రామికుడి చెమట బిందువుల తడి తిరిగి వ్యాసకర్త కలం నుండి చిందటం పాఠకుల సంతోషానికి తలుపులు తీసినట్లుగా ఉంది. చివరకు గోపి గారు మన అమ్మమ్మల గ్రామాలకు దారి చూపిస్తూ తోడుండి పాఠకుల్ని నడిపించడం మరువలేని ఒక గొప్ప అనుభూతి.

ఈ గ్రంథములో కస్తూరి పరిమళాలు వెదజల్లిన వ్యాసం తెలుగు సాహిత్యము లో దేశభక్తి. దేశములో కేవలం పౌరులుగా జీవించడమే జీవనమనుకునిమే ఈ వర్తమానం అజీర్తికి వాములంటి ఔషధం ఈ వ్యాసం. 18వ శతాబ్దంలోని గోగులపాటి కూర్మనాథ కవి తన కవిత్వంలో దేశభక్తిని ప్రాణవాయువుగా మార్చి సింహాద్రి నారసింహ శతకము వెలువరించిన సంగతి ఈ వ్యాసానికి ముత్తెదువు నుదుట వెలిగే కుంకుమ బొట్టులా మెరిసిపోయింది. 1895 లోనే గోదావరి మండల సభలో చిలకమర్తి లక్ష్మీనరసింహం, విశాఖపట్టణం మండల సభలో ఈశ్వర జగన్నాథ శాస్త్రి, శ్రీ రామ శాస్త్రి గారు గానం చేసిన దేశభక్తిని ఈ వ్యాసం వివరించిన విధానం పలకరింపుగా వచ్చి పులకరిస్తున్న పాఠకుల వీపు తట్టి దేశభక్తి ప్రసాదాన్ని రెండు చేతుల నిండా అందించినట్లు గా ఉంది.

ఇంతలో 'భరతఖండంబు చక్కని పాడియావు' అంటూ ఒక ఘంటారావం నాలుగు దిక్కులా మ్రోగిపోతుంది. ఆ వెంటనే మేలుకొని 'మేలుకొనుమీ సుజన పుత్రుడా ....' అంటూ ఒక అజ్ఞాత కవి కంఠం వినిపిస్తుంది. 'పరతంత్రం బహుహేయము నరకమువలే' అంటూ మంగిపూడి వేంకటశర్మ గానం దానికి తోడుగా 'దేశమును ప్రేమించుమన్నా' అంటూ కదం తొక్కుతూ గురజాడవారి గీతం, 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని' అంటూ భావితరాలకు సూచనలిస్తూ సాగిన రాయప్రోలు సుబ్బారావు గారి చైతన్య గీతం, 'మాకొద్దీ తెల్లదొరతనము' గీతంతో బ్రిటిష్ వారు విధించిన ఆంక్షల గీతను దాటి భారతీయుల నుదిటిమీద దేశభక్తి గీతాలు రాస్తూ గరిమెళ్ళ సత్యనారాయణ గారి దేశభక్తి ఇలా ఒక్కరేమిటి దేశభక్తి ప్రవాహములో సాహితీవేత్తల దేశభక్తి సంపదను ఈ వ్యాసం పాఠకుల స్ఫూర్తికి పదును పెట్టుకునే ఆకరాయిలా అందిస్తుంది. దేశభక్తి గడపదాటి అడుగు ముందుకు వేయగానే ధగధగ మెరిసే వజ్రాయుధంతో కవిత్వంగా కలకాలం జీవించిన సోమసుందర్ గారి చిరునవ్వులు ఆప్యాయంగా సాహిత్య ఆలింగనం చేసుకుంటాయి.

పాఠకుల మెదళ్లకు పదును పెట్టే వ్యాసం "మూడు భాషల రచనల్లో పెళ్లి ముచ్చట మహనీయ దృక్పథం'. 'కన్యాశుల్కం' నాటకంతో తెలుగు కవి గురజాడ, మా ధమహంతీంకో కన్యాసునా' కథతో ఒడియా రచయిత ఫకీర్ మోహన్ సేనాపతి, 'మది మాళత్తు మదిమాయే' కథతో తుళు రచయిత కె. విఠల్ హెగ్డే ఈ ముగ్గురూ కలిసి వ్యాస నిరాజనం వేదికమీద ఆసీనులై తమ రచనల్లోని పెళ్లి ముచ్చట్లను మనోహరంగా వివరించడానికి అవకాశం కల్పించిన వ్యాసకర్త మనసారా అభినందనలు తెలియజేద్దాం. గురజాడ నాటకం కన్యాశుల్కం ఫకీర్ మోహన్ సేనాపతి ఒడియా కథల మాధమహంతీంకో ఈ రెండు రచనల్లోనూ అమ్మాయిల బాల్యవివాహాలు ప్రధాన భూమిక అవుతున్నాయి. రచయిత విఠల్ హెగ్డే కథలో సమస్య బాలికది కాదు. విచిత్రంగా ఒక పెళ్లి కోసం ఎదురుచూస్తున్న ఒక వృద్ధుడిది. భ మూడు రచనల్లోని సన్నివేశాలు, సందర్భాలు,) సమస్యలను చదివి ఆనందించడమే కాదు ఇతర భాషల కథా పరిచయం పెళ్లి భోజనటలో పరిమళాల తాంబూలాన్ని అందుకున్న ట్టుగా ఉంటుంది.

ఇదే గ్రంథములో గురజాడ 'అగ్నిహోత్రావధానులు', ఫకీర్ సేనాపతి 'మాధవ మహంతి' పాత్రల ఆధారంగా వీరి రచనల్లో లేవనెత్తిన ప్రధాన సమస్యలను, ఆ సమస్యల పరిష్కారానికి ఎన్నుకున్న మార్గాలను మరోసారి తులనాత్మకంగా సాధికారికంగా ఈ వ్యాసంలో చర్చించడం జరిగింది. రెండు రచనల్లో చోటు చేసుకున్న ఒక్కొక్క పాత్రకు సరిపడే మానసిక స్వభావాన్ని ఆ మహా రచయితలిద్దరు ఆకలింపు చేసుకున్న ఆలోచనల పదును ఈ వ్యాసంలో మెరుపులు మెరుస్తుంది. ఈ గ్రంథంలో చోటు చేసుకున్న తరాలుగా తెలుగేతర రాష్ట్రాలలో తెలుగు సాహిత్య సేవలో తరించి మెరిసిన సాహితీవేత్తల పరిచయం క్యాలెండర్ లోని పండుగలు ఒకే రోజున వచ్చి పలకరించిన పరవశం పాఠకుల వశమై పోతుంది. దేశంలోని అనేక ప్రాంతాలలో జీవించడానికి అక్కడి గాలిని గాలిని పీల్చినా, తెలుగు సాహిత్య సుస్థిరతకు తమ ప్రాణాన్ని ప్రాణవాయువుగా మార్చిన వందలాది సాహితీ మూర్తుల సాహిత్య సేవలను వ్యాసకర్త అందించిన విషయం సామాన్యమైనది కాదు ఇంతటి విస్తృతమైన సమాచార సేకరణే వ్యాసకర్తకు ఒక శాశ్వత సాహిత్యపీఠంఆహ్వానం పలుకుతోంది.

గాంధీజీ నాయకత్వాన సాగిన జాతీయోద్యమంలో పాల్గొన్న మహిళల సంఖ్య చాలా స్ఫూర్తిదాయకంగానే ఉంటుంది. తెలుగునేల మీదే కాదు ఒడిశా రాష్ట్రంలో ఉంటూ 'స్వాతంత్ర్యం నా జన్మహక్కు' అంటూ ప్రాణాలకు తెగించి ఉద్యమాల్లో నడిచిన తెలుగు వీరవనితలను గురించి సమగ్రమైన సమాచారం అందించిన ఈ వ్యాసం జాతీయ జెండాలా పాఠకుడి ముందు ఎగురుతుంది. ఆదుర్తి లక్ష్మీబాయి మొదలుకొని గాదె లక్ష్మీనరసమ్మ వరకు ఆ స్త్రీ మూర్తులు ముద్దాడిన సాహసాన్ని, ఆలింగనం చేసుకున్న అంకితభావాన్ని తలపాగాల్లాగా చుట్టుకున్న త్యాగాల్ని, పోరాటంలో భాగంగా అనుభవించిన జైలు జీవితాలను ఈ వ్యాసంలోని అక్షరాలు దివిటీలుగా మార్చి పాఠకుల సమక్షంలో చేసిన కవాతులో మనసు రెటీవాల మీద చెదిరిపోని ఛాయాచిత్రంలా నిలిచిపోతుంది.

కళింగదేశంలో తెలుగు పరిమళాల చిరునామా ఈనాటిది కాదు. ప్రాచీన కాలమే తెలుగుదనానికి తలుపులు తెరిచి ఆహ్వానం పలికిన రీతుల్ని సమగ్రమైన సమాచారంతో అందించిన వ్యాసం, చిన్ననాటి స్నేహితుడిలా

ఒక అమూల్యమైన, బహుళ ప్రయోజన కరమైన, అర్థవంతమైన నేటి రేపటి తరాలకు అవసరమైన వ్యాస సంపుటిని తెలుగు సాహితీలోకానికి ఒక అపురూప కానుక

ఆసక్తి కొమ్మమీద ఊగిస్తూ ఊరిస్తూ అందిస్తుంది. ఇందులోని సమాచారం చాలామందికి సమీపంలో లేనిదే. తెలుగు రక్తం మన శరీరాల్లోనే కాదు, కళింగ దేశంలో సైతం ప్రవహించి, చరిత్ర పరవశానికి పట్టువస్త్రాలు ఎలా బహూకరించిందో ఈ వ్యాసం మండు వేసవిలో చల్లని మజ్జిగలా పాఠకుల దాహం తీరుస్తుంది. ఇదే క్రమంలో 15వ శతాబ్దంలో ఒడిశాలో రాతి కలశముపై వెలిసిన తెలుగు లిపి చిరునవ్వులతో ఒడియా – తెలుగు సాహిత్య సంబంధాల ప్రదర్శనకు అబ్బురపడి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. దివాకర మిశ్ర మొదలుకొని బెంగాలీనందో వరకు ప్రముఖ సాహితీవేత్తల కృషి ఒడియా తెలుగు సాహిత్య సంబంధాల జీవనాడికి ఎలా పునాదిరాళ్ళ పాత్రను ప్రతిష్టాత్మకంగా నిర్వహించిందో తెలియజేసిన వ్యాసంలో తెలుగు –ఒడియా సాహిత్యాల ఐక్యతకు విశేషంగా కృషిచేసిన కళాప్రపూర్ణ పురిపండా అప్పలస్వామి గారు వేదిక మీదికి వచ్చి సాహిత్య పరిషత్ స్థాపనతో తెలుగు ఒడియా భాషలో సంయుక్త సౌందర్యానికి వేసిన రహదారుల గురించి ఆయన చేసిన ఉపన్యాసాల అలలు పాఠకుల ఆనందానికి స్వరకల్పన చేస్తాయి.

అత్యంత ప్రాచీన కాలం నుంచి తెలుగు ఒడియా జాతుల మధ్య పెనవేసుకున్న శతాబ్దాల దృఢబంధం గురించి రాయప్రోలు సుబ్బారావు గారు తన కవిత్వంలో వివరించిన సందర్భంతో పాటు తెలుగు ఒడియా భాషల మధ్య జరిగిన ఆదాన, ప్రదాన ప్రక్రియల ఆత్మీయ పరస్పర ఆహ్వానం సంబరాలు ఈ వ్యాసంలో అంబరాన్ని తాకుతున్నాయి. తెలుగు నుంచి ఒడియా లోకి ప్రవేశించిన పదాలు, ఒడియా నుంచి తెలుగు లోకి ప్రవేశించిన పదాలు, ఒడియా భాషలో ఉన్న కొన్ని జాతీయ పదాలు రెండు భాషల రెక్కలు ధరించి గగనవిహారం చేయటం ఆనందం కలిగిస్తుంది. ఇదే క్రమములో వర్తమాన సమాజంలో అసమానతల వికృత చేష్టలకు బలైపోయి సామాన్య జనం కన్నీటిలోంచి పుట్టిన సమకాలీన ఒడియా కవిత్వాన్ని పరిచయం చేసిన వ్యాసం ఒక క్రొత్త ఆలోచనలకు ద్వారాలు తీస్తోంది. అందుకు ఉదాహరణ కుమారహసన్ "ముఖానాచ" కావ్యం సాక్ష్యంగా నిలుస్తుంది. అశు

తోష్ ఫరీదా కవితా సంపుటిలోని "రక్తబర్ణబలీ" పాఠకుల హృదయాన్ని ఎలా ద్రవింపజేస్తుందో తెలుసుకోవడానికి, ప్రభుత్వ పథకాల అమలు, అందులోని లోపాలు, ప్రజల్ని మోసం చేసే కాకి లెక్కలు, ప్రభుత్వ అణచివేత చర్యలు వీటిని అశ్వినికుమార్ మిశ్రా తన "ధోళాఃఓటీ" కవితలో ఎలా బహిర్గతం చేశాడో అర్థం చేసుకోవడానికి, ప్రపంచీకరణ విషకోరల్లో విలవిల్లాడిన గ్రామీణజీవన అవస్థలు ప్రతిబింబాలుగా నిలిచిన కవితల సారాన్ని సమీపంగా గమనించడానికి, స్త్రీల హక్కులు, సమాజంలో ఆమె స్థితిగతులకు గొడుగు పట్టిన సమకాలీన కవితా స్వరూపాలతో కరచాలనం చేయడానికి ఈ గ్రంథంలోని "సమకాలీన ఒడియా కవిత్వం" వ్యాసం చదివి తీరవలసిందే.

తెలుగు వాళ్లకు బ్రౌన్ ఉన్నట్లే ఒడియా వాళ్లకు కూడా ఒక బ్రౌన్ ఉన్నాడు. ఒడియా స్వతంత్ర భాష కాదని అది బెంగాలీ లోని మాండలికమని బ్రిటిష్ వాడు వాదించి పాఠశాలల్లో ఒడియా భాష బోధనకు అడ్డుకట్ట వేసిన సందర్భములో ఒడియా భాష గొప్పతనాన్ని, స్వతంత్రతను, ప్రాచీన మూలాలను వెలికితీసి, ఒడియా భాషను అఖండ దీపంలా వెలిగేలా శ్రమపడిన ఒడియా భాష ప్రేమాభిమాని, జన్మతః ఆంగ్లేయుడై బ్రిటిషువారి ఐఏఎస్ అధికారిగా ఒడిషాలో పనిచేసిన 'జాన్ బీన్స్'. ఒడియా లిపి, ఇతర ఆధునిక ఆర్య భాషలతో ఒడియా సంబంధాల లోకి అడుగు పెట్టగానే ఓహో ఒడియా అనిపించే ఎన్నో ఆశ్చర్యకరమైన విశేషాలు ఈ వ్యాసములో ఆనందానికి తివాచీలు పరుస్తాయి. ఈ ఆనందం నుండి తేరుకునే లోపలే అపురూప చిత్రకారుడు డి నారాయణరావు రంగుల సామగ్రితో సంచి చేత పట్టుకొని ఎదురొస్తారు. వైవిధ్యమైన అతని జీవితాన్ని గురించి, బాల్యంలో తనని ప్రిన్సిపాల్ మెచ్చుకున్న సంఘటన గురించి, ఆదివాసి చిత్రకళా నైపుణ్యం పట్ల ఆకర్షితుడైన పిదప ఆ ప్రభావం అతడి చిత్రకళను మల్లించిన మార్గాలను గురించి సంపూర్ణంగా తెలుసుకోవడానికి ఈ వ్యాసంలోకి ఆలస్యం చేయకుండా అడుగులు వేయవలసిందే.

వ్యాసరచన చాలా క్లిష్టమైన ప్రక్రియ. ఎన్నుకున్న విషయం మీద సాధారణ అవగ

ఆగష్టు 20

జ్ఞాపకాలు



ఆగష్టు 20, 2017న సహకార భవన్‌లో "అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ (భోపాల్)" తెలుగు శాఖ వార్షికోత్సవంలో శ్రీనివాస్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, పి.వి. మనోహరరావు. వేదికపై శిష్టా మాధవి, ఆచార్య జయరాములు, ఆచార్య కదారి సత్యమూర్తి, పి.వి.బ్రహ్మం, పొత్తూరి సుబ్బారావు.

ఆగష్టు 20, 2017న సహకార భవన్‌లో "అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ (భోపాల్)" తెలుగు శాఖ వార్షికోత్సవంలో శ్రీమతి జి. పద్మావతికి పురస్కారం ప్రదానం చేస్తున్న శ్రీనివాస్, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, పి.వి. మనోహరరావు, ఆచార్య కదారి సత్యమూర్తి, పి.వి.బ్రహ్మం.

ఆగష్టు 21 & 22

జ్ఞాపకాలు

ఆగష్టు 21, 2019న ఆరాధన 24వ వార్షికోత్సవం సందర్భంగా నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసుకు 'పాత్రికేయ పురస్కారం' ప్రదానం చేస్తున్న జస్టిస్ శేష శయనారెడ్డి, సినీ నటులు సుబ్బరాయశర్మ, ఓలేటి పార్వతీశం, డా॥ కొత్తకృష్ణవేణి, ఆలపాటి లక్ష్మి, అన్నపూర్ణ, కత్తుల లక్ష్మి రవీందర్ తదితరులు.

ఆగష్టు 22, 2015న తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో "తెలంగాణ దీపస్తంభం" (గ్రంథావిష్కరణలో టి. ఉదయవర్మ, డా॥నందిని సిధారెడ్డి, డా॥ఎం. మదుసూధనరెడ్డి, ఆచార్య పి. నీరదారెడ్డి, అవిష్కర్త కేంద్ర మాజీమంత్రి యస్. జయపాల్‌రెడ్డి, డా॥ అమ్మంగి వేణుగోపాల్, ఆచార్య జి.వి.రెడ్డి, ఆచార్య టి. మోహన్‌సింగ్, డా॥ బుక్కా బాలస్వామి, వంగాల మల్లారెడ్డి, బైస దేవదాసు.

ఆగష్టు 22

జ్ఞాపకాలు

ఆగష్టు 22, 2015న తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో రాజా బహదూర్ కొత్వాల్ వేంకట రామారెడ్డి 147వ జయంతి సభలో గంటా జలంధర్ రెడ్డి, కమలసన్ రెడ్డి, టి. ఉదయవర్మ, ఆచార్య పి. నీరదారెడ్డి, డా॥నందిని సిధారెడ్డి, డా॥ఎం. మధుసూధన రెడ్డి, కేంద్ర మాజీమంత్రి యస్. జయపాల్‌రెడ్డి, బైస దేవదాసు, డా॥ అమ్మంగి వేణుగోపాల్, ఆచార్య జి.వి.రెడ్డి, ఆచార్య టి. మోహన్‌సింగ్, డా॥ బుక్కాబాలస్వామి, వంగాల మల్లారెడ్డి.

ఆగష్టు 22, 2015న పాత్రి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రాజా బహదుర్ కొత్వాల్ వెంకట రామిరెడ్డి 147వ జయంతి సందర్భంగా పత్రికారంగానికిగాను సీనియర్ జర్నలిస్టు 'నేటినిజం' దినపత్రిక సంపాదకులు బైస దేవదాసుకు ఆయన పేరిట పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఆచార్య పి. నీరదారెడ్డి, డా॥ఎం.మధుసూదన్‌రెడ్డి, గంటా జలంధర్‌రెడ్డి.

ఆగష్టు 22

జ్ఞాపకాలు

ఆగష్టు 22, 2019న తెలంగాణ రాష్ట్ర బి.సి.కమీషన్ ఛైర్మన్ బి.యస్.రాములు 70వ జన్మదినం సందర్భంగా పుస్తకావిష్కరణలో నందిగామ నిర్మల, యం.రాములక్కి, గంటా జలంధర్‌రెడ్డి, డా॥ వకుళాభరణం కృష్ణమోహన్, బి.యస్.రాములు, జూలూరు గౌరీశంకర్, బైస దేవదాసు, డా॥ఎస్.రఘు తదితరులు.

ఆగష్టు 22, 2019న రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర బి.సి. కమీషన్ ఛైర్మన్ బి.యస్.రాములు 70వ జన్మదిన సందర్భంగా జరిగిన సాహితీ సమాలోచనలు కార్యక్రమంలో పాల్గొన్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసుకు జ్ఞాపికతో సత్కరిస్తున్న బి.యస్.రాములు, డా॥వకుళాభరణం కృష్ణమోహన్, డా॥ఎస్.రఘు, జూలూరు గౌరీశంకర్ తదితరులు.

ఆగష్టు 22

జ్ఞాపకాలు

ఆగష్టు 22, 2018న కళా లలిత కళావేదికలో "మణిపూసలు" ప్రక్రియ సృష్టికర్త వడిచర్ల సత్యం ఆత్మీయ అభినందన సత్కార సభలో చిక్కా రామదాసు, డా॥ ఈటెల సమ్మన్న, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ అయాచితం శ్రీధర్, బైస దేవదాసు, డా॥పత్రికా మోహన్, డా॥ఎనుగు నరసింహారెడ్డి, సీతాలక్ష్మి, బింగి నరేందర్, చిక్కా దేవదాసు.

ఆగష్టు 22, 2018న కళా లలిత కళావేదికలో "మణిపూసలు" ప్రక్రియ సృష్టికర్త వడిచర్ల సత్యం ఆత్మీయ అభినందన సత్కార సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు. వేదికపై డా॥ ఎనుగు నరసింహారెడ్డి, చిక్కా రామదాసు, డా॥పత్రికా మోహన్ తదితరులు.త

ఆగష్టు 22 & 23

జ్ఞాపకాలు

ఆగష్టు 22, 2019న తెలంగాణ రాష్ట్ర బి.సి.కమీషన్ ఛైర్మన్ బి.యస్.రాములు 70వ జన్మదినం సందర్భంగా జరిగిన సాహిత్య సదస్సులో ప్రసంగిస్తున్న బైస దేవదాసు. వేదికపై నందిగామ నిర్మల, యం. రాములక్కి, బి.యస్.రాములు, డా॥ఎస్.రఘు, డా॥యం. మోహన్ రావు, క్రర సదాశివ, డా॥జలంధర్‌రెడ్డి.

ఆగష్టు 23, 2019న తెలంగాణ రాష్ట్ర బి.సి.కమీషన్ ఛైర్మన్ బి.యస్.రాములు 70వ జన్మదినం సందర్భంగా విశాల సాహితీ అకాడమీ నేటినిజం సంపాదకులు బైస దేవదాసుకు పురస్కారం ప్రదానం చేస్తున్నరాష్ట్ర హెూంశాఖామాత్యులు మహమూద్ అలి, డా॥ వకుళాభరణం కృష్ణమోహన్, బి.యస్.రాములు, డా॥ అంకం, కళా జనార్దనమూర్తి, మాడిశెట్టి గోపాల్ తదితరులు.

ఆగష్టు 23

జ్ఞాపకాలు

ఆగష్టు 23, 2016న త్యాగరాయ గానసభలో "తృతీయ స్వరం" గ్రంథావిష్కరణలో రమణ వెలమకన్ని, బైస దేవదాసు, డా॥ఓలేటి పార్వతీశం, ఆవిష్కర్త డా॥సినారె, డా॥పోరెడ్డి రంగయ్య, డా॥కే.వి. దీక్షితులు, సాధనాల వెంకట స్వామినాయుడు తదితరులు.

ఆగష్టు 23, 2016న త్యాగరాయ గానసభలో "తృతీయ స్వరం" గ్రంథావిష్కరణలో ప్రసంగిస్తున్న బైస దేవదాసు. వేదికపై డా॥ఓలేటి పార్వతీశం, డా॥సినారె, డా॥కె.వి. దీక్షితులు, సాధనాల వెంకటస్వామినాయుడు.

ఆగష్టు 23, 2018న త్యాగరాయ గానసభలో ప్రముఖ సాహితీవేత్త శ్రీ పేర్వారం జగన్నాథంగారి జయంతి సభలో నాగేశ్వరరావు, బైస దేవదాసు, వి. శ్రీనివాసరావు, జనార్దనమూర్తి, తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమీషనర్ బుద్దా మురళి తదితరులు.

ఆగష్టు 24, 2017న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సుప్రసిద్ధ రచయిత డా॥ దాశరథి రంగాచార్య జయంతి సందర్భంగా స్మారక పురస్కారాన్ని డా॥జయప్రకాశ్‌కు అందజేస్తున్న కందుకూరి శ్రీరాములు, బైస దేవదాసు, డా॥దా.నా.శాస్త్రి, డా॥నందిని సిధారెడ్డి, ఆచార్య వి. నిత్యానందరావు, విరించి, బదేసాబ్ తదితరులు.

మహిళా సాధికారతకు కృషి చేయాలి

మహిళలకు ఓటు హక్కు ఇచ్చే ప్రకటనపై యునైటెడ్ స్టేట్స్ అఫ్ అమెరికా 1920 వ సంవత్సరంలో రాజ్యాంగంలోని 19వ సవరణ ద్వారా తీర్మానం చేసింది. సంవత్సరములో అప్పటి అమెరికా విదేశాంగ కార్యదర్శి ఐన బై స్ట్రిడ్జే కోల్టి అమెరికా మహిళలకు రాజ్యాంగపరమైన ఓటు హక్కును ఇచ్చే ప్రకటనపై సంతకం చేసిన రోజు జ్ఞాపకార్థంగా ఆగస్టు 26 తేదీని మహిళా సమానత్వం దినోత్సవం గా తీసుకున్నారు ఈ సంవత్సరంలో దేశవ్యాప్తంగా సమ్మె చేశారు. 1971 లో సమానత్వం కోసం పోరాటాలు చేశారు. 1973లో మహిళల సమాన హక్కులు, సమస్యలపై పోరాటాలు కొనసాగుతున్న సందర్భంలో న్యూయార్క్‌కు చెందిన కాంగ్రెస్ మహిళ బెళ్ళా అబ్జుగ్ ఆగస్టు 26 మహిళ సమానత్వ దినం జరుపుకొనుటకు తీర్మానం ప్రవేశపెట్టగా అప్పటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ ప్రకటన విడుదల చేశాడు. అలా 1973లో అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలిపిన తర్వాత మొట్టమొదటి సారిగా సమానత్వ దినాన్ని జరుపుకున్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా మద్రాస్ రాష్ట్రం మహిళలకు ఎన్నికల్లో ఓటు హక్కును మంజూరు చేసింది. స్వాతంత్ర్యానంతరం మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 లో ప్రస్తావించబడిన విధంగా 1950లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు ఓటు హక్కు కల్పించబడింది. ప్రపంచంలో జరిగిన కొన్ని సర్వేల ఆధారంగా రాజకీయాల్లో మహిళల ప్రాధాన్యత తక్కువనే ఉంది. పార్లమెంట్‌లో మహిళా ప్రాతినిధ్యం విషయంలో భారతదేశం ప్రపంచంలో 20వ స్థానంలో ఉంది. మహిళా అధ్యక్షులుగా ఎన్నుకొన్న దేశాలను గమనిస్తే, గ్రేట్ బిటన్, జర్మనీ, ఇజ్రాయిల్, భారత్, మరియు డెన్మార్క్ వంటి మరికొన్ని దేశాలు మహిళా అధ్యక్షులను ఎన్నుకున్నాయి. కాని అమెరికా ఇప్పటివరకు మహిళలను అధ్యక్షులుగా ఎన్నుకోలేదు. మహిళల హక్కుల సాధన కోసం రోసా పార్క్స్, ఎలియనోర్ రూజ్వెల్ట్, మేరీ క్యూరీ, జేన్ గుడాల్ ఇలాంటి మహిళలు సమాజంలో పురుషులు, మహిళలు సమానమని పోరాటం చేశారు. మహిళల ఓటు హక్కు కోసం కాకుండా, విద్య, ఉపాధి అవకాశాల కోసం, రాజకీయాల్లో నిర్వహించడం కోసం పోరాటం చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేసే మహిళలు కోరుకుంటున్న సమస్యలు,, అణచివేత, హింసకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకోసం ఆగస్టు 26 మహిళా సమానత్వం దినోత్సవం సందర్భంగా సెమినార్లు, వర్క్ షాపులు, సదస్సులు, నిర్వహిస్తారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహిళలను గుర్తించడంకోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవం, బాలికా దినోత్సవం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట సేవలు అందించిన మార్గరెట్ థాచర్, మాక్సిన్ కింగ్, మలాల యూసఫ్ జాయ్ ఇలాంటి నేతలు చరిత్రను, ఝాన్సీ లక్ష్మీబాయిలాంటి వీర వనితలు, సావిత్రిబాయి పూలే వంటి సంఘ సంస్కర్తలు, పి.టి.ఉష లాంటి క్రీడాకారులు, ఇందిరాగాంధీ లాంటి రాజకీయ నేతల చరిత్ర గురించి నేటి తరం మహిళలకు ఆయా వేదికల ద్వారా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజకీయాలతో పాటు మహిళలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పిస్తే దేశం పురోగమిస్తుంది అని చెప్పవచ్చును. వివక్షత లేని సమాజాన్ని నిర్మించాలి. చట్టసభల్లో మహిళలకు తగిన రిజర్వేషన్లు కల్పించాలనే ఆలోచన, ప్రతిపాదనపై అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన బిల్లును 2014లోనే రాజ్యసభ ఆమోదం తెలిపినా, ఆ వెంటనే 15వ లోక్ సభ రద్దు కావడంతో బిల్లు ఆమోదం పొందలేదు. దేశ జనాభాలో 50 శాతం ఉన్న మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంలో మీనమేషాలు లక్కిస్తున్నారనీ పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.. వేద కాలం నుండి ఇ మహిళలను సమానంగా చూసే సంస్కృతి మన దేశానిది. అలాంటిది స్వతంత్రం వచ్చి 74 సంవత్సరాలు గడిచిన మహిళలు ఇంకా వెనుకబడే ఉన్నారు. సమాజంలో కుమార్తె కన్నా, కుమారునికి ప్రాధాన్యం ఇచ్చే పద్ధతులు మార్చుకోవాల్సిన అవసరం ఉంది. శిశు హత్యలు, భ్రూణ హత్యలు, అత్యాచారాలు, వరకట్న వేధింపులు లాంటి దురాచారాలు రూపు మాపినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని చెప్పవచ్చు. అలాగే ఈ మధ్య హిందూ కుటుంబం ఆస్తిలో కొడుకులతో బాటు, కూతుళ్లకు సమానం హక్కు ఉందని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం హర్షించదగ్గ విషయం. హిందూ వారసత్వ సవరణ చట్టం 2005 కు ముందు తండ్రి మరణించిన కూడా కూతురికి ఆ హక్కులు దక్కుతాయని స్పష్టం చేసింది. పాకిస్తాన్‌లో విద్య కోసం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి, నోబెల్ బహుమతి గ్రహీత న్యాయవాది, మలాల యూసఫ్ జాయ్ మాటల్లో ప్రపంచం మొత్తం నిశ్శబ్దంగా ఉన్నప్పుడు ఒక స్వరం కూడా శక్తివంతమవుతుందని అన్నారు. అందుకే సమాజం నుండి స్త్రీ పురుషుల వివక్షత లేకుండా చూసినప్పుడే మహిళా సాధికారత సాధ్యం అవుతుందని ఆ దిశగా ప్రభుత్వాలు వారికి అవకాశాలు ఇవ్వాలని పలువురు శాస్త్రవేత్తలు, తత్వవేత్తలు వివిధ సందర్భాల్లో అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. మహిళలను చైతన్యవంతం చేయుటకు ఈ మధ్య తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో అధికారంలో ఉన్న మహిళల స్థానంలో భర్తల పెత్తనం, వారి బంధు గనం కూడా ప్రత్యక్షంగా సమావేశాల్లో పాల్గొనకూడదని పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేయడం హర్షించదగ్గ విషయం అని చెప్పవచ్చు. అయితే స్త్రీలను ఏ రంగంలో తీసిపోరనే విధంగా అవకాశాలు కల్పించాలని, వారిని అన్ని రంగాల్లో భాగస్వాములను చేసినప్పుడే మహిళా సమానత్వం దినోత్సవ సార్థకత అవుతుందని చెప్పవచ్చును.

(ఆగస్టు 26 మహిళా సమానత్వం దినోత్సవం సందర్భంగా)

-సామంతుల సదానందం
9866136491

అతి సుతారమైన
తన జీరగొంతు.
అప్రతిహత
సాహిత్య ఝరీ ప్రవాహం
అతని వంతు.
అతని అక్షరం
అందరికీ కనిపించదు.
పెళ్ళుమని శబ్దం
వినిపించదు.
మెరుస్తున్న కళ్ళ నుండి
మొలకెత్తే ధృక్కులు.
వయో భేదం లేకుండా
వినమ్రంగా నమస్కరించే
హక్కులు.
సానుకూలంగా
ప్రవర్తన సంక్రమించిన దృక్పథం.
నిరలంకారం,మన్నన
తన మనో పథం.
ఎన్నడూ పెలుసు మాట
పలికిందీ లేదు.
ఎవరినీ, ఎక్కడా
తూలనాడింది లేదు.
తనో మేథో మేరువన్న
గర్వం లేదు.
గుర్తింపుకై
వేదికల మీద పొగిడించు కోలేదు.
ఒంటి నిండా
మానవీయ పరిమళం.
ప్రణాళికా నిబద్ధత
అతని జీవన ప్రయాణం
బంధం వీడలేదు ...
ఒకరోజు తేడాలో
అర్థాంగి రుక్మిణి తో తన సహ గమనం.
పద్య ప్రియుడైన
రాపాక ఏకాంబరా చార్యుల వారి
మూర్తిమత్వం.
పదం విసిరితే
అనేక యుక్తుల విశ్వ భావన తత్వం..
నన్నయ నుండి నేటి దాకా
సహస్ర పద్య సౌరభ సంకలనం
కల నెలవేరనేలేదు
ఇష్ట విభువులైన
విశ్వ బ్రాహ్మణ ఇంటికి
తన గ్రంథం ఇంకా చేరనేలేదు..
కాల ప్రవాహంలో తానే
కాలమైనాడు.
ఇష్ట ప్రియులను ఒదిలి
ఒంటరైనాడు.



రాపాక వారికి నివాళి.

-మేడిశ్రీ
8977564470

కిన్నెర ఆర్ట్ థియేటర్స్

కిన్నెర ఆర్ట్ థియేటర్స్,
నేటినిజం తెలుగు దినపత్రిక,
మరియు
పి.వి.మనోహరరావు గారి
సౌజన్యంతో
భారత పూర్వ ప్రధాని పి.వి.నరసింహారావు గారి
శత జయంతి సందర్భంగా



పి.వి.నరసింహారావు
జీవితం- వ్యక్తిత్వం- సాహిత్యం ఇతివృత్తంగా

వ్యాస రచనల పోటి

ఉత్తమ బహుమతి : రూ.5000/-
ద్వితీయ బహుమతి : రూ.3000/-,
తృతీయ బహుమతి : రూ.2000/-

- రచనలు ఎ4 సైజు పేపరులో 4 పేజీలు తగ్గకుండా/ మించకుండా ఉండాలి.
- వ్యాసాలు ఏ పత్రికలో ప్రచురించలేదని సోషల్ మీడియాలో పోస్ట్ చేయలేదని, ఈ పోటీ నిమిత్తమే వ్రాసినదని, హామీ పత్రం జతచేయాలి.
- హామీ పత్రంలో మీ పేరు, ఫోటో, పూర్తి చిరునామా, సెల్ నెం.తప్పనిసరి.

రచనలు పంపవలసిన చిరునామా:
నేటినిజం దినపత్రిక,
ఎస్.ఆర్.టి-74, జవహర్‌నగర్,
అశోక్‌నగర్, హైదరాబాద్-20
netinizam2020@gmail.com

రచనలు పంపవలసిన చివరి తేది
30-09-2020

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా'

పోటీ ఫలితాలు

నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

శీర్షిక: మానవత్వము పరిమళించ....

ప్రథమ బహుమతి విజేత

రాత్రి పగలు వస్తూనే ఉంటాయి
కష్టపడ్డ వారినే వరిస్తాయి 'కలలు'

వస్తుంటాయి పోతుంటాయి నీటిలో
తీరం చేరేవి కొన్నే 'అలలు'

ఎర ఎంత ఏసినా
చిక్కే చాపలు కొన్నే
లంచం కల్లెం వేయడానికి విసరాలి 'వలలు'

అరువది నాలుగు వున్నా
ఐదు మాత్రమే ఆకట్టుకునే లలిత 'కళలు'

పడివుండే రాళ్లు ఎన్నో
తొక్కేవి కొన్ని మొక్కేవి కొన్ని 'శిలలు'

ఒక్క తల చేతిలోనే
నేల కూలాయి పది 'తలలు'

పదిమందిని ప్రేమతో పలకరించి
చేరదీసి వెన్నుచరచి ఆదుకునే
మానవత్వముతో చేయూత 'వలలు' విసర
శిలలు వలె ఉండక
తీరం చేరాలన్న 'అలల' వలె
పోరాటం చేస్తూ కన్న 'కలలు'
నెరవేరి 'కళల' లో ప్రసిద్ధులై
'తలలు' ఎత్తుకుని తిరుగుతూ
కీర్తి పతాక నెగుర వేసెదరు

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383

శీర్షిక: తీయని కలలు

ద్వితీయ బహుమతి విజేత

యవ్వనప్రాయం మొగ్గతొడిగిన నుండి
ఎదగదిలో తపనల తమకాలు సృష్టిస్తూ...
మసకతెరల మాటున మోమును దాచగా నీవే 'కలలు' నిత్యం....

ఒంటరితనపు ఆలోచనల్లో స్తబ్ధతగొన్నప్పుడు...
తుంటరితనపు చేష్టలై చెక్కిలిగిలిపెట్టి మురిపించగా..
మేనును చలింపజేస్తూ నీ జ్ఞాపకాల 'అలలు'

రెప్పలదుప్పటి మూసిమూయగానే
చటుక్కున వాలిపోయి ఆనందవిహారం చేయిస్తూ...
నన్ను మైమరపింపజేసే నీ చూపుల 'వలలు'

అరువది నాలుగు 'కళలు'అవపోసన పట్టిన చిత్రాంగుడవవగా..
నన్ను నీదానిగా చేసుకొనుటకు..
నీ టక్కులమారి వేషాలతో కరిగెనుగా నా హృదయ 'శిలలు'

తీయనిస్వప్నాలు సత్యమై
చెలికాడివై చెంతచేరాక
వెటకారపు తూటాలతో గుచ్చి హింసించిన
'తలల'కు నేలచూపులే అనివార్యమయ్యేనుగా....

తీరని కలలు తీయని కలలై నిజరూపంలో కడవరకు తోడవగా...
బ్రతుకంతా నందనవనమేగా..
దాంపత్యబంధమై ప్రేమపరిమళాన్ని పంచగా...

-స్వప్నకృష్ణ
హుజురాబాద్

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
Editor: B. Devadas, Cell: 9000065433
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.